ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

వరంగల్

fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-6-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 124 పేజీలు: 8+16 వెల: 6.50



రూ.10 వేల కోట్లతో ఇంధన ధరల స్థిరీకరణ నిధి
మమతా బెనర్జీకి షాక్..
58 మంది ఎమ్మెల్యేల తిరుగుబాటు
5




బుధవారం బెంగళూరులోని లోక్‌భవన్‌లో డికె శివకుమార్ చేత కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయిస్తున్న గవర్నర్ తవర్‌చంద్ గెహ్లాట్

## ఢిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం

భగ్గుమన్న రెస్టారెంట్

**21 మంది సజీవ దహనం**

మృతుల్లో 10 మంది విదేశీయులు

రాష్ట్రపతి, ప్రధాని మోడీ సంతాపం




కిటికీలోంచి కిందికి దిగుతున్న బాధితులు

**న్యూఢిల్లీ, జూన్ 3:** రాజధాని నగరంలోని మాల్వియా నగర్‌లో ఉన్న రెస్టారెంట్‌బిల్డింగ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 21 మంది మృతిచెందారు. మరో40మందికిపైగా తీవ్రగాయాల పాలయినట్లు అధికారులు తెలిపారు. అయితే >>2

## భుజంగరావు మళ్లీ అరెస్టు

ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడైన సస్పెండెడ్ ఎస్పీని అక్రమాస్తుల కేసులో అరెస్టు చేసిన ఎసిబి



**హైదరాబాద్, జూన్ 3, ప్రభాత వార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడుగా వుండి అరెస్టయి, జైలుకు వెళ్లి బెయిలుపై వున్న సస్పెండెడ్ అదనపు ఎస్పీ భుజంగరావును అక్రమాస్తుల కేసులో ఎసిబి అధికారులు బుధవారం మళ్లీ అరెస్టు చేశారు. ఉదయం ఆ రు గంటల నుంచి హాఫీజ్‌పేట్‌లోని ఆయన ఇంటితో పాటు సూర్యాపేట్, >>2

# నైపుణ్యాలకు నెలవు



బుధవారం హైదరాబాద్‌లో ద.ఆఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే బృందంతో భేటీ అయిన సిఎం రేవంత్ రెడ్డి

మెడికల్ టూరిజం, పారిశ్రామిక రంగాల్లో తెలంగాణ-దక్షిణాఫ్రికా పరస్పర సహకారం

ద.ఆఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే బృందంతో సిఎం రేవంత్ రెడ్డి భేటీ

తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు

డిసెంబర్‌లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు దక్షిణాఫ్రికా బృందానికి ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్3:** తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడులు, విద్య, వైద్య సేవలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలకమైన అడుగు వేసింది. అందులో భాగంగా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి బుధవారం దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం, పరిశ్రమలు, పెట్టుబడులు వంటి పలు రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని ఇరు పక్షాలు చర్చించాయి. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్ ప్రత్యేకతలను దక్షిణాఫ్రికా ప్రతినిధులకు వివరించారు. ఐటీ, ఫార్మా, రక్షణ, ఏరోస్పేస్ వంటి అత్యాధునిక రంగాలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేసి ప్రపంచానికి అందించే విధంగా హైదరాబాద్ అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. అనేక ప్రపంచ ప్రఖ్యాత ఫార్చ్యూన్-500 >>7



## టెట్ తప్పనిసరి

సర్వీసులో ఉన్న టీచర్లకూ యేడాదికి రెండుసార్లు పరీక్ష

ఉత్తీర్ణత గడువు 2028 ఆగస్టు 31 దాకా పొడిగింపు.. సుప్రీం కోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ, జూన్ 3:** ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిఇటి) తప్పనిసరి అని సుప్రీంకోర్టు 65కు పైగా సమీక్షా పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.అయితే, పిల్లల ప్రాథమిక విద్యలో నిరంతరాయతను నిర్ధారించాల్సిన ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, ఇకపై ఎటువంటి పొడిగింపులు ఉండవని పేర్కొంటూ, పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి గడువును ఆగస్టు 31, 2028 వరకు పొడిగించడం ద్వారా కోర్టు పాక్షి క ఉపశమనం కల్పించింది. ఉపాధ్యాయులు టెట్ (టిఇటి) అర్హతను పొందడానికి అసలు గడువు ఆగస్టు 31, 2027 కాగా, దానిని ఇప్పుడు ఆగస్టు 31, 2028 వరకు పొడిగించారు. అర్హులైన ఉపాధ్యాయులకు చట్టబద్ధమైన అవసరాన్ని పూర్తి చేయడానికి సహేతుకమైన అవకాశాన్ని కల్పించేందుకు, వరుస పరీక్షల మధ్య సుమారు ఆరు నెలల వ్యవధి ఉండేలా, ప్రాధాన్యంగా సంవత్సరానికి రెండు సార్లు టెట్‌ని క్రమానుగతంగా నిర్వహించాలని రాష్ట్రాలు, సంబం ధిత అధికారులను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. >>2

## 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

తెలంగాణకు భారీ వర్ష సూచన



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్3:** తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురు,శుక్ర వారాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, >>2



బుధవారం హైదరాబాద్‌లో మీట్ దిప్రెస్‌లో కెటిఆర్

# ఇది భూమి పుత్రుల జాగీరే

జాతీయవాదంపై పాఠాలు నేర్వాల్సిన అవసరం లేదు..

పవన్‌ను ఎవరు అడ్డుకొన్నారు?

గత ఎన్నికల్లో పోటీచేస్తే ఏమైందో తెలియదా!

తెలంగాణ కథలో మొదటి విలన్ కాంగ్రెస్సే

మీడియాతో మాజీ మంత్రి కెటిఆర్

**హైదరాబాద్,జూన్ 3,ప్రభాతవార్త:** తెలంగాణకథలో నంబర్‌వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయేనని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. ఆనాడు బలవంతంగా తెలంగాణ, ఆంధ్రాను కలిపింది వారేనని, తెలంగాణ ఉద్యమాలను కర్కశంగా అణచివేసింది హస్తం పార్టీనేనని ధ్వజమెత్తారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్‌లో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వమే తెలంగాణ ఇచ్చినప్పటికీ ఇవ్వక తప్పని పరిస్థితి సృష్టించిన నాయకుడు కేసీఆరేనని స్పష్టం చేశారు. తమకు కూడా కేసీఆర్ లాంటి పాలకుడు కావాలని పొరుగు రాష్ట్రాలవారు అనుకునేలా పదేళ్ల పాలన కొనసాగించామన్నారు.దశాబ్దకాలంలో సుసంపన్నమైన తెలంగాణను ఆవిష్కరించామన్న కేటీఆర్, రాష్ట్రాన్ని పరిపాలించే నాయకత్వ పటిమ మీకుందా అని ఆనాడు కేసీఆర్‌పై కొందరు మాటల దాడి చేశారన్నారు. దేశానికి అన్నంపెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందని, వ్యవసాయానికి ఉచితంగా 24 గంటలు ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. ఎన్నికల అజెండాలో లేకున్నా తాము రైతుకు పెట్టుబడి సాయం కోసం రైతుబంధు పథకం తెచ్చినట్లు గుర్తుచేశారు. తలసరి ఆదాయంలో తెలంగాణను అగ్రస్థానంలో నిలిపామన్న ఆయన, ప్రతి జిల్లాకు ఒక >>2




అమరావతిలో బుధవారం మీడియాతో ఏపి డి.సిఎం పవన్

# ప్రాంతీయ విద్వేషాలు ఇంకా ఎన్నాళ్లు?

అది దేశసమగ్రతకు భంగం కలిగించడమే..

హైదరాబాద్‌లో సభ జరుపుతానంటే తప్పేంటి?

కెటిఆర్ నా మిత్రుడే.. అలా మాట్లాడి ఉండకపోవచ్చు..

సిఎం రేవంత్ పాత్రకూడా ఉండదు: ఎపి డి.సిఎం పవన్

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రాంతీయ విభేధాలతో రాజకీయాలు చేయడం అంటే దేశ సమగ్రతకు భంగం కలిగించడమేననిఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.రాజ్యాంగం కల్పించిన హక్కులను అణచివేయగలిగే శక్తి ఎవ్వరికి లేదన్నారు.తెలంగాణ భారతదేశంలో అంతర్భాగం. ఎవరైనా అక్కడకు వెళ్ళవచ్చు, ఆస్పత్రిలో చూపించుకోవచ్చు. హద్దులకు ఫెన్సింగ్‌లు వేస్తారేమో కానీ, మనుషుల మనసులకు వేయలేరు కదా! >>2

## భారత్‌పై 12.5% అదనపు సుంకాలు

ఊహించని షాక్ ఇచ్చిన అమెరికా




**వాషింగ్టన్,జూన్ 3:** భారత్, అమెరికాల మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై న్యూఢిల్లీలో కీలకమైన ఉన్నత స్థాయి చర్చలు జరుగుతున్న తరుణంలో అమెరికా ఊహించని షాక్ ఇచ్చింది. భారతదేశంలో అన్యాయమైన వాణిజ్య పద్ధతులు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ, యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ కార్యాలయం భారత్‌ను దోషుల జాబితాలో చేర్చింది. ఈ అన్వేషణల ఆధారంగా భారతదేశం నుంచి అమెరికాకు వెళ్లే వివిధ రకాల దిగుమతులపై >>2

## రాష్ట్రంలో జతీయ రహదార్ల విస్తరణ

రూ 7,597 కోట్లతో రెండు ఎన్‌హెచ్‌లలో 190 కిలోమీటర్ల విస్తరణ పనులు

జగిత్యాల, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు మేలు

కేంద్ర మంత్రి మండలి ఆమోదం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్3:** కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సంబంధించి అత్యంత కీలక నిర్ణయం తీసుకుంది.రూ.7,597.16 కోట్ల వ్యయ అంచనాలతో మొత్తం 190 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల పనులకు ఆమోదం >>2

## రేపటి నుంచి భూముల ధరలు పెంపు

ధరల సవరణ హేతుబద్ధంగా చేపట్టాం..

క్షేత్రస్థాయి అధ్యయనంతో కొత్త విలువలు: మంత్రి పొంగులేటి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్3:** రాష్ట్రంలో భూముల విలువలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మేరకు సవరించిన భూముల విలువలు ఈ నెల 5వ తేదీ నుంచి అమలులోకి తెస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఆర్థిక నిపుణులు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక ప్రకారం ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని విస్తృత స్థాయిలో అధ్యయనం నిర్వహించిన అనంతరమే ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. >>2



బుధవారం బెంగళూరులో కర్ణాటక సిఎంగా డికె శివకుమార్ ప్రమాణ కార్యక్రమానికి హాజరైన సిఎం రేవంత్, కేరళం సిఎం సతీశన్ తదితరులు

## డికె ప్రమాణ స్వీకారానికి హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్3:** కర్ణాటక ముఖ్యమంత్రిగా డికె శివకుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయనను లభినందిస్తూ ఆలింగనం చేసుకున్నారు. డి.కె.శివ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో రేవంత్‌రెడ్డితో పాటు కేరళ ముఖ్యమంత్రి సతీషన్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒకే వరుసలో కూర్చున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు: మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి సిట్ నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్3:** ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి సిట్ నోటీసులు జారీ చేసింది. గురువారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని పేర్కొంది. 2014-18 మధ్య మహేశ్వరం ఎమ్మెల్యేగా తీగల కృష్ణారెడ్డి పని చేశారు.

# అగ్ని ప్రమాదం

>> ప్రాథమిక దర్యాప్తులో ఈ ప్రమాదానికి సంబంధించి ఆసక్తి కర అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఫ్లోరిష్ స్టే హోటల్‌లో పర్మిషన్ కేవలం ఆరు రూమ్‌లకు మాత్రమే ఉన్నది. కానీ ఆ స్టే ఇన్‌లో 24 రూమ్‌లకు బుకింగ్ అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. లైసెన్సు జారీ అంశంలో ఏవైనా ఉల్లంఘనలు జరిగాయా లేదా అన్న కోణంలో విచారణ చేపడుతున్నారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన అతిపెద్ద అగ్నిప్రమాద ఘటనగా ఇది నమోదు అయ్యింది. బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద ఆరు రూమ్‌లకు ఢిల్లీ టూరిజం శాఖ పర్మిషన్ ఇచ్చింది. కానీ అక్రమంగా ఆ హోటల్ గదిలో 24 రూమ్‌లను నడుపుతున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్ బుకింగ్‌లో ఆ హోటల్‌కు 24 రూమ్‌లు ఉన్నట్లు రిజర్వేషన్ చూపిస్తున్నది. అయిదు అంతస్తుల ఆ బిల్డింగ్ ప్రమాదంలో 40 మందిని రక్షించారు. ఆ బిల్డింగ్‌లో ఉన్న లెమన్ గ్రీన్ రెస్టారెంట్ నుంచి మంటలు వ్యాపించి ఉంటాయని తొలుత అనుమానించారు. కానీ బీ అండ్ బీ ఈటరీ బిల్డింగ్ నుంచే మంటలు వ్యాప్తి చెందినట్లు అంచనాకు వచ్చారు. 21 మంది మృతుల్లో పది మంది విదేశీయులు ఉన్నట్లు నిర్ధారించారు. వారిలో ఎక్కువ శాతం మంది సెంట్రల్ ఏషియా, ఆఫ్రికా దేశస్థులు ఉన్నారు. గాయపడ్డ వారి సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బిల్డింగ్‌లో ఓ బేస్మెంట్, గ్రౌండ్ ఫ్లోర్, అయిదు అంతస్తులు ఉన్నట్లు ఢిల్లీ అగ్నిమాపక శాఖ చెబుతోంది. ఉదయం 9.30 నిమిషాల సమయంలో బిల్డింగ్‌లో మంటలు, పొగ అలుముకున్నట్లు తెలిసింది. బీ అండ్ బీలో స్టే చేస్తున్న వారి పరిస్థితి దారుణంగా ఉంది. సమీప ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారే ఎక్కువగా బీ అండ్ బీలో బస చేస్తున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ నుంచి మోకాలి మార్పిడి గురించి అయిదు రోజుల క్రితం ఓ ఫ్యామిలీ ఆ హోటల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తున్నారు. బిల్డింగ్‌లో ఎటువంటి వెంటిలేషన్ లేదని, కిటికీలు లేవని, బాత్రూమ్‌ల్లో కూడా కిటికీలు లేవని ఓ వ్యక్తి ఆరోపించాడు. మికాసా ఇన్‌కు చెందిన రెస్టారెంట్‌లో మొదలైన మంటలు ఆ తర్వాత పైకి వ్యాపించాయి. ఆ బిల్డింగ్ అయిదు అంతస్తులు ఉన్నది. మంటలు, పొగ దట్టంగా కమ్ముకున్న సమయంలో ఓ మహిళ ఆ హోటల్ పైనుంచి కిందకు దూకింది. ఆ బిల్డింగ్ నుంచి ఇద్దరు మహిళలు దూకినట్లు తెలుస్తోంది.

## విద్వేషాలు ఇంకా ఎన్నాళ్లు?

>> అని స్పష్టం చేశారు. అమరావతిలో పవన్ బుధవారం పర్యటించారు. శాఖమూరులో అక్కడి 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోరుకోవడం వేరని, కానీ తెలుగువారి కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఎప్పుడూ వేరే రాష్ట్రం వారు రాకూడదని చెప్పలేదని గుర్తుచేశారు. తెలంగాణలో ఆంధ్రా కాంట్రాక్టర్లు, ఏపీలో తెలంగాణ కాంట్రాక్టర్లు పనులు చేసుకుంటున్నప్పుడు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం ఎందుకని పవన్ ప్రశ్నించారు. పుష్కర కాలం తర్వాత కూడా ఇంత ద్వేషం ఉంటుందని తాను అనుకోలేదన్నారు. ఖిహైదరాబాద్ నా ఇల్లు, నా పార్టీ అక్కడే ఆవిర్భవించింది. అక్కడికి వెళ్ళడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణలో పుట్టిన భూమి పుత్రులు సభలు పెట్టుకుంటే తప్పేంటి?ఖిఅని నిలదీశారు. ఈ వివాదం చినికి చినికి గాలివాన అయిందే తప్ప దీని వెనుక ఎలాంటి కుట్ర లేదన్నారు. బిఆర్ఎస్ నేత కేటీఆర్‌తో తనకు సోదర సమాన బంధం ఉందని, ఆయన తప్పుగా మాట్లాడి ఉండరని అభిప్రాయపడ్డారు. అలాగే ఈ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర కూడా ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది నేతలే పనిగట్టుకుని ఇలాంటి విద్వేషాలు రేపుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి పోటీ చేయవచ్చు కానీ, తాము వస్తే బెదిరిస్తారా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ దేశమంతా తిరిగినా ప్రయోజనం ఏముందని, బూర్గుల రామకృష్ణారావు, పీవీ నరసింహారావు వంటి మహనీయుల త్యాగాలను గుర్తించాలని హితవు పలికారు. ఇలాంటి ప్రాంతీయ విద్వేషాలకు ముగింపు పలకడమే తన తపన అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ప్రాంతీయ విద్వేషాలు రగల్చడం రాహుల్‌గాంధీకి మంచిది కాదన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు మాట్లాడాలన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేసి ఏం నేర్చుకున్నారన్నారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే వారు ప్రజలకు ఏం సందేశం ఇస్తారని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ, తమిళనాడులో ప్రాంతీయ భావం ఉందన్నారు. ఏపీ ప్రజల్లో ఉన్న ఉప ప్రాంతీయవాదం సరికాదన్నారు. వైఎస్సార్సీపీకి భయపడితే ఇంతమంది రాజకీయాల్లోకి ఎందుకు వస్తారన్నారు. ఇప్పుడు వారికి 3 జిల్లాలతో కలిసిన రాజధాని కావాలంటే సాధ్యమేనా అంటూ పవన్ ఎద్దేవా చేశారు. అందరూ కలిసి నిర్ణయం తీసుకున్నాక ముందుకు తీసుకెళ్లాలన్నారు. రాజధానిపై వైఎస్సార్సీపీ నేతల వ్యాఖ్యలు సరికాదన్నారు. గద్దర్ కుటుంబసభ్యులు అంటే తనకు చాలా ఇష్టమని పవన్ కళ్యాణ్ అన్నారు. పాలసీలపై కేటీఆర్ మాట్లాడి ఉండవచ్చు, ఆయన నాకు మిత్రుడని పవన్ వివరించారు. విభజన రాజకీయాలకు స్వస్తి పలకాలి, ఎవరికీ మంచిది కాదన్నారు. కేటీఆర్, నేను అనేక విషయాలు మాట్లాడుకుంటాం, విభేదాలు ఏమీ లేవని పవన్ తేల్చిచెప్పారు. తెలంగాణా,ఆంధ్ర పౌర సంబంధాలు భంగం కలిగించడం మంచిది కాదన్నారు.

## ఆర్థిక సంఘం చైర్మన్‌గా రాజయ్య

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** తెలంగాణ రెండవ రాష్ట్ర ఆర్థిక సంఘానికి మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య చైర్మన్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయమై బుధవారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఆర్థిక సంఘం లోని ఇతర సభ్యులలో సూర్యాపేటకు చెందిన సంకేపల్లి సుధీర్ రెడ్డి, వికారాబాద్‌కు చెందిన రంగరాజ్, రంగారెడ్డి జిల్లాకు చెందిన మహమ్మద్ ఆసిఫ్ అలీ ఉన్నారు. చైర్మన్ మరియు సభ్యులు బాధ్యతలు స్వీకరించిన తేదీ నుండి రెండు సంవత్సరాల పాటు పదవిలో కొనసాగుతారు.

## టెట్ తప్పనిసరి

>>'అంజుమన్ ఇషాత్‌ఎతలీమ్ ట్రస్ట్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర, 2025 ఎస్సీసీ ఆన్‌లైన్ ఎస్సీ 1912' కేసులో ఇచ్చిన తీర్పులోని ఒక భాగాన్ని సమీక్షించాలని కోరుతూ వివిధ రాష్ట్రాలు, ఉపాధ్యాయ సంఘాలు, సంస్థలు, వ్యక్తిగత ఉపాధ్యాయులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టి ఈ మేరకు తీర్పునిచ్చింది. సమీక్షా పిటిషన్ల బ్యాచ్‌లో, పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం, 2009 (ఆర్‌టిఇ చట్టం)కు ముందు నియమితులై, 5 సంవత్సరాల కంటే ఎక్కువ సర్వీసు మిగిలి ఉన్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు, 1 సెప్టెంబర్ 2025 నుండి 2 సంవత్సరాలలోపు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిఇటీ)లో అర్హత సాధించాలని, అలా చేయని పక్షంలో వారు సర్వీసులో కొనసాగడానికి అనర్హులవుతారని నిర్దేశిస్తూ దాఖలైన పిటిషన్లపై, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం, 'అంజుమన్ ఇషాత్‌ఎతలీమ్ ట్రస్ట్' కేసులో ఇచ్చిన తమ తీర్పులోని సరైనతను పునరుద్ఘాటించింది. ఆర్‌టిఇ చట్టంలోని సెక్షన్ 23 ఎల్లప్పుడూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు నిర్దేశిత అర్హతలను పొందడాన్ని ఉద్దేశించిందని, ఆర్టికల్ 21ఎ కింద నాణ్యమైన విద్యకు రాజ్యాంగం కల్పించిన హామీలో భాగంగా టిఇటి ఒక తప్పనిసరి అర్హత అవసరం అని పేర్కొంది.

"గతానికి వర్తింపజేయడం, ఎన్‌సిటిని చట్టంతో వైరుధ్యం, సేవా నిబంధనలలో అనుమతిలేని మార్పులు వంటి ఆరోపణలతో సహా సమీక్షలో పేర్కొన్న అన్ని కారణాలను కోర్టు తిరస్కరించింది.

అయితే, ఆర్టికల్ 142 కింద ఆచరణాత్మక విధానాన్ని అవలంబిస్తూ, టిఇటి అర్హతను పొందేందుకు పాటించాల్సిన గడువును 2 సంవత్సరాల నుండి 3 సంవత్సరాలకు పొడిగించి, 31 ఆగస్టు 2028ని తుది గడువుగా నిర్ణయించింది.

### వారం - వర్జ్యం

**04-06-2026, గురువారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం**
**గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె**
చవితి రా.11.29
ఉత్తరాషాఢ రా.3.41
వర్జ్యం : ఉ.9.53-ఉ.11.40
దు.ఉ.9.54-ఉ.10.46,
2) మ.3.08-4.00
రాహుకాలం - మ.1.30-3.00

### వార్తాఫలం

**మేషం:** సంతానము మీ అభిప్రాయములతో ఏకీభవించక పోవచ్చు. రహస్య పెట్టుబడి పెట్టిన వ్యవహారాలు చిక్కులో పడతాయి.

**వృషభం:** ఏ కార్యక్రమమును చేపట్టినా ఆలోచించి, నిర్ణయములను తీసుకొనుట మంచిది. ఆర్థిక సంస్థలనుండి ఋణాలు తీసుకుంటారు.

**మిథునం:** గృహ నిర్మాణాలు వాహనాలు కొనుగోలు ప్రయత్నాలు సాగిస్తారు. ఆర్థిక భారం పెరుగుతుంది. ఆస్తి వివాదాలు.

**కర్కాటకం:** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. పెట్టుబడులకు తగిన సమయం. వస్త్రలాభం కలదు.

**సింహం:** కోర్టు వివాదాలు పరిష్కారమవుతాయి. పరిశ్రమలు, సంస్థల ఏర్పాటులో ఆటంకాలు తొలగుతాయి.

**కన్య :** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలకువ అవసరం. ఆరోగ్యం జాగ్రత్త.

**తుల :** ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తికాగలవు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. స్పెక్యులేషన్‌కు దూరముగా వుండండి.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుసుకుంటారు.

**ధనుస్సు:** ఇతరులకు సైతం మీరు సహాయం అందిస్తారు. బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తిస్తారు. వస్త్రలాభం కలదు.

**మకరం:** ఆర్థికపరమైన లావాదేవీలలో ఆటుపోట్లు తొలగుతాయి. శత్రువులు సైతం మిత్రులుగా మారతారు. బంధువులను కలుస్తారు.

**కుంభం:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**మీనం:** విదేశీ పర్యటనల అవకాశాలు. సోదరుల నుండి విలువైన సమాచారం అందుకోండి. పరిచయాలు పెరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రేపటి నుంచి భూముల ధరలు పెంపు

>> ప్రాంతాల వారీగా భూముల మార్కెట్ పరిస్థితులు, రిజిస్ట్రేషన్ల సంఖ్య, బహిరంగ మార్కెట్ ధరలు, ప్రభుత్వ విలువల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సమగ్రంగా పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో కొత్త విలువలను నిర్ణయించామని మంత్రి పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలాంటి సమగ్ర కసరత్తు లేకుండా, అశాస్త్రీయ పద్ధతుల్లో 2021-22 సంవత్సరాల్లో కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రెండు సార్లు భూముల ధరలను పెంచడంతో పాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సవరణలు క్షేత్రస్థాయి అధ్యయనం లేకుండా కేవలం శాతం గణనల ఆధారంగా, పట్టికల ప్రకారం చేపట్టడం వల్ల కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే చాలా తక్కువగా, మరికొన్ని ప్రాంతాల్లో అధికంగా విలువలు నిర్ణయించబడ్డాయని తెలిపారు. వాస్తవ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ విలువలకు మధ్య భారీ అంతరం ఉండటం వల్ల భూ లావాదేవీలలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు రాష్ట్రంలోని అన్ని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల (ఎస్ఆర్‌వోలు) పరిధిలో మార్కెట్ విలువల పునర్విమర్శ చేపట్టామని మంత్రి వెల్లడించారు. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు స్థానిక పరిస్థితులను పరిశీలించి సవరించిన విలువలను రూపొందించి ఆమోదించాయని చెప్పారు. ప్రాంతాల అభివృద్ధి సామర్థ్యం, వృద్ధి రేటు, ఇటీవల జరిగిన భూముల వేలాలు, మార్కెట్ పరిస్థితులు, డిమాండ్, కొత్త రహదారులు, వృద్ధి కారిడార్లు, ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని మార్కెట్ విలువలను నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఫ్లాట్ల విషయంలో గతంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయి మార్కెట్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ అంతస్తుల వారీగా అధిక రేట్లు నిర్ణయించడం వల్ల అసమానతలు ఏర్పడ్డాయని, అలాంటి ప్రాంతాల్లో అన్ని అంతస్తులకు ఒకే రేటు వర్తింపజేస్తూ మార్కెట్ విలువలను హేతుబద్ధీకరించినట్లు వివరించారు. ఇప్పటికే అధిక మార్కెట్ విలువలు ఉన్న ప్రాంతాల్లో ఎలాంటి పెంపు ప్రతిపాదించలేదన్నారు. అదేవిధంగా ప్రాంతాల అభివృద్ధి స్థాయిని బట్టి హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండిఏ),క్యూర్ పరిధి, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఫ్లాట్లకు కనీస ప్రాథమిక రేట్లను కూడా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్మాణ వ్యయాలను కూడా 2021 తర్వాత సవరించలేదని, గత ఐదేళ్లలో నిర్మాణ సామగ్రి ధరలు, కార్మికుల వేతనాలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో నిర్మాణ రేట్ల సవరణ అవసరమైందని మంత్రి పేర్కొన్నారు. అనేక మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ కావడం, గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడం వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఆర్‌సీసీ, నాన్‌ఆర్‌సీసీ నిర్మాణాల రేట్లను గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సవరించినట్లు వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వాస్తవ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఈ సవరణలు చేపట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, భూ లావాదేవీలలో పారదర్శకత పెంపునకు, ప్రభుత్వ ఆదాయ వృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# జతీయ రహదార్ల విస్తరణ

>> తెలిపారు. కేంద్ర మంత్రి మండలి బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశం అయింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను తెలియచేశారు. కేంద్ర కేబినెట్ ద్వారా ఇంతకు ముందు ఎప్పుడూ లేని రీతిలో ఇప్పుడు ఈ హై ప్రాజెక్టుల నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోదం దక్కింది. ఇప్పుడు ఆమోదించిన పనులలో రెండు రహదారులు ఏర్పాటు అవుతాయి. మొదటిది ఎన్‌హెచ్-63పరిధిలోని ఆర్మూర్-జగిత్యాల- మంచిర్యాల సెక్షన్ రహదారి విస్తరణ హైబ్రిడ్ అన్యూటి మాడల్ (హామ్) పద్ధతిలో నిర్మిస్తారు. ఇక, రెండోది ఎన్‌హెచ్- 563 సంబంధిత జగిత్యాల-కరీంనగర్ సెక్షన్ రహదారిని బిల్డ్ ఆపరేటర్ ట్రాన్స్‌ఫర్ ప్రాతిదికన కాంట్రాక్టుకు ఇస్తారు. నాలుగే లేన్ల ప్రామాణిక మార్గంగా దీనిని మారుస్తారు. ఈ రహదార్ల ఏర్పాటు క్రమంలో మునుపటి ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లా, కొంత మేరకు నిజామాబాద్ జిల్లాల ప్రజలకు మేలు జరుగుతుంది. ఇప్పుడు ప్రతిపాదించిన ఆర్మూర్, జగిత్యాల, మంచిర్యాల ప్రాజెక్టు సెక్షన్ నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల మీదుగా సాగుతుంది. ఇప్పుడు ఈ ప్రాంతంలో హైవే వెంబడి విస్తృత జనసంచారం, రద్దీ వ్యాపార సముదాయాలు ప్రాంతాలు ఉండటంతో ఇరుకైన దారిలో సాగాల్సి వస్తోంది ఈ మార్గంలో అంకుశాపూర్, కోరుట్ల, ధర్మపురి, లక్సేటిపేట, మంచిర్యాల, జగిత్యాల్ వంటి ప్రాంతాలు ఉండటంతో ప్రయాణ ఇక్కట్లు తలెత్తుతున్నాయి. ఇదే విధంగా జగిత్యాల కరీంనగర్ సెక్షన్ కూడా పలు రద్దీ ప్రాంతాల మీదుగా వెళ్లుతుంది. జగిత్యాల, పోతారం, గంగాధర, కరీంనగర్‌లలో ఇటీవలి కాలంలో విపరీత స్థాయిలో ప్రయాణాలు సాగుతున్నాయి. ఈ డిమాండ్‌ను ఇప్పటి రోడ్లు సరైన విధంగా తీర్చలేకపోతున్నాయి. పూర్తి స్థాయి సమీక్షలు విశ్లేషణల తరువాత ఈ రెండు సెక్షన్ల విస్తరణ, నాలుగు లేన్ల పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కేంద్రం అధికారిక ప్రకటనలో తెలిపారు. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణ సామర్థం, సంబంధిత పలు జిల్లాల్లో ప్రయాణ సమర్థత మరింత మెరుగుపడేలా చేసేందుకు ఈ ప్రాజెక్టులను తలపెట్టారని వెల్లడించారు. ఓపెన్ టోల్, స్పీడ్ సక్రమ నిర్వహణ వంటివి ఫక్కాగా కుదిరేందుకు వీలేర్పడుతుంది. ప్రత్యేకించి ఉత్తర తెలంగాణ ప్రాంతానికి ప్రయాణ సౌలభ్యం పెరుగుతుంది. మరో వైపు ఈ మార్గంలో మహారాష్ట్ర, గుజరాత్ వంటి దూర ప్రాంతాలకు వేగంగా వెళ్లేందుకు వీలేర్పడుతుంది. పైగా జిల్లాలోని మారుమూల అనుసందాన రూట్లలో కూడా ప్రయాణ సౌకర్యానికి అనుసంధాన మార్గాల ఏర్పాటుకు వీలేర్పడుతంది. ప్రాంతీయ స్థాయిలో రవాణా సౌకర్యం పెరగడంతో ఈ ప్రాంతంలోని ఆర్థిక వాణిజ్య కార్యకలాపాలకు, సామాజిక సానుకూలతకు దారితీస్తుందని ప్రకటనలో తెలిపారు. పనుల శంకుస్థాపన, నిర్మాణ పనులు చేపట్టిన తరువాత రెండున్నర నుంచి మూడేండ్లలోపు ఈ విస్తారిత రాదార్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాజెక్టులు రెండు సంపూర్తి అయితే ఈ ప్రాంతాల్లో వారికి రవాణా సమయం దాదాపుగా గంటన్నర వరకూ ఆదా అవుతుంది. ఆర్మూర్, మంచిర్యాల మధ్య వెళ్లే వారికి గంటన్నర కలిసి వస్తుంది. కాగా జగిత్యాల, కరీంనగర్ మధ్య వెళ్లే వారికి దాదాపు ముప్పావు గంట ప్రయాణ సమయం తగ్గుతుంది. ఈ క్రమంలో వారికి ఎక్కువగా రవాణా సౌకర్యాలు ఏర్పడటంతో పాటు వ్యాపార రంగం వృద్ధికి వీలేర్పడుతుందని ఆశిస్తున్నారు. కాగా, దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కోసం రూ.39,290 కోట్ల పెట్టుబడికి కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం ఆరు ముఖ్యమైన ప్రతిపాదనలను ఈ సమావేశంలో ఆమోదించారు. దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడానికి పలు రాష్ట్రాల్లో జాతీయ రహదారి ప్రాజెక్టులను ఆమోదించింది. రామేశ్వరంకోణార్క్‌పారాదీప్ కోస్టల్ హైవే ప్రాజెక్ట్‌ను ఆమోదించగా.. ఇందుకు రూ.8,301 కోట్లు ఖర్చు చేయనుంది. దేశంలోని తూర్పు తీర ప్రాంతంలో అనుసంధానాన్ని ఈ ప్రాజెక్ట్ బలోపేతం చేస్తుందని కేంద్రం భావిస్తోంది. ఇక బీహార్‌లోని ఖగారియాపూర్నియా సెక్షన్‌ను నాలుగు లేన్లుగా విస్తరించే ప్రాజెక్టుకు రూ.3,936 కోట్లు ఆమోదించారు. మధ్యప్రదేశ్‌లో ఎన్‌హెచ్-347బి అప్‌గ్రేడ్ కోసం రూ.4,415 కోట్ల పెట్టుబడిని కూడా ఆమోదించారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త వాహనాల కొనుగోలుపై 100 శాతం మోటారు వాహన పన్ను మినహాయింపు రిజిస్ట్రేషన్ ఫీజులో ఉపశమనాన్ని కూడా అందిస్తాయి. అయితే ఈ ప్రయోజనం తమ పాత వాహనాలను స్క్రాప్ చేసే లేదా వాటిని ఎన్‌సిఏపీ యేతర నగరాలకు తరలించే వాహన యజమానులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.



బుధవారం ధర్మశాలలోని మెక్‌లియోడ్‌గంజ్‌లో దలైలామాకు 2026 గ్రామీ అవార్డును అందజేస్తున్న సరోద్ విద్వాంసుడు అంజాద్ అలీ ఖాన్ తదితరులు

# ఇది భూమి పుత్రులజాగీరే

>> మెడికల్ కాలేజీని మంజూరు చేసినట్లు తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత పెట్టుబడుల సాధనలో బెంగళూరును అధిగమించినట్లు చెప్పారు. తెలంగాణలో జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ఎవరూ అడ్డుకోలేదని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేనను గెలవకుండా ప్రజలే అడ్డుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినలేదని పవన్ గతంలో అన్నారని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడితే అన్నం తినని వ్యక్తి రాష్ట్ర అవతరణ రోజు సభ ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. జనసేన పార్టీ తెలంగాణలో కొత్తగా పోటీ చేసేదేముందని, 2023 అసెంబ్లీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లో కూడా పోటీ చేశారని గుర్తుచేశారు. తెలంగాణ ముమ్మాటికి ఈభూమిపుత్రుల జాగీరేనని అందులో ఎటువంటి అనుమానం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదం కంటే ప్రమాదకరం అన్న పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించారని, ఇప్పుడు దాన్ని తప్పు పడతారా? అని ప్రశ్నించారు. తెలంగాణకు రావాల్సిన పరిశ్రమలను ప్రధాని మోదీ గుజరాత్‌కు తరలించారని దాన్ని ఏమనాలో పవన్ కళ్యాణ్ చెప్పాలని డిమాండ్ చేశారు. జాతీయవాదం గురించి పవన్ కళ్యాణ్ వద్ద పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు.

**డిస్టర్బ్‌చేసే ప్రత్నాలు అప్పుడే జరిగాయి...**

ఒక నటుడిగా, ఏపీకి డిప్యూటీ సీఎంగా పవన్‌కల్యాణ్‌ను తాము గౌరవిస్తామని కేటీఆర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడటానికి తమకు ఓజీలు, నేతలు ఉన్నారని అన్నారు. తెలంగాణను డిస్టర్బ్ చేసే ప్రయత్నాలు 2014లోనే జరిగాయని, హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేసే కుట్రలకు ప్రయత్నించారని తెలిపారు. తమ అనుమతి లేకుండానే తెలంగాణ గ్రామాలు, సీలేరు ప్రాజెక్టును, ఖమ్మంలోని ఏడు మండలాలను కలిపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడిపోయినందుకు బాధ లేదని కేటీఆర్ అన్నారు. కానీ తెలంగాణ వ్యతిరేకులు పదవిలో కూర్చోవడమే బాధాకరంగా ఉందని పరోక్షంగా సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. తెలంగాణ ఉద్యమకారులపైకి తుపాకీ పట్టిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉండటమే అభ్యంతరకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్న ఆయన ఎక్సైజ్‌శాఖలో మినహా అన్నింటిలో ఆదాయం పడిపోయిందని తెలిపారు. మందు గమనం మాత్రమే బాగుందని మిగతా అంతా మందగమనమే ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బిజెపిలు ఒక్కటే.. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలసి నడుస్తున్నాయన్న కేటీఆర్ ..పోక్సో కేసులో బండి భగీరథ్‌ను 9 రోజులు ఎవరు కాపాడారో చెప్పాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇంటిపై గతంలో ఈడీ దాడులు జరిగితే ఇప్పటివరకూ చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కాపాడుతున్నదెవరో అందరికీ తెలుసన్నారు. తెలంగాణలో ఆర్‌ఆర్ ట్యాక్స్ నడుస్తుందన్న మోదీ సీఎం రేవంత్ రెడ్డిపై చర్యలు ఎందుకు తీసుకోరు? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు పొరపాటేనన్నారు. అలా మాట్లాడి ఉండాల్సింది కాదన్నారు. అయితే తమ మాజీ ఎమ్మెల్యే అలా మాట్లాడితే జైల్లో పెట్టారని ఇప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కొంతమంది ఇంకా లైను దాటి మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవేళ బాల్క సుమన్ మాట్లాడింది తప్పయితే సీఎం రేవంత్ రెడ్డి నిత్యం మాట్లాడే మాటలు కూడా తప్పేనని అన్నారు. తమ బీఆర్‌ఎస్ గద్దెలు కూల్చాలి అని సీఎం రేవంత్‌రెడ్డి కూడా మాట్లాడారని గుర్తుచేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్న ఆయన ఓటమికి కుంగిపోమని చెప్పారు.

## భుజంగరావు మళ్లీ అరెస్టు

>>హైదరాబాద్‌లోని బంధువుల ఇళ్లలో ఈ సోదాలు చేబట్టిన ఎసిబి అధి కారులు ఐదు కోట్ల 92 లక్షల రూపాయలకు పైగా విలువచేసే అక్రమాస్తులను గుర్తించి వాటిని జప్తు చేశాక సాయంత్రం అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎసిబి డిజి చారు సిన్హా మీడియాకు వెల్లడించారు. 2024 మార్చి నెలలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం వెలుగు చూడడం తెలిసిందే. అంతకు ముందు 2023 నవంబరు నెలలో అసెంబ్లీ ఎన్ని కల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందిన తరువాత బేగంపేట్‌లోని ఎస్ఐబిలో గల ఫోన్ ట్యాపింగ్ యూనిట్‌లో కీలక కంప్యూటర్లు, హార్డ్ డిస్కులు ధ్వ ంసం అవడం, అనేక వస్తువులు కనిపించకుండా పోవడం విదితమే. దీనిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించగా సిట్ ఏర్పాటు అయ్యింది. అనం తరం ఈ కేసుకు సంబంధించి మొదట ఎస్ఐబిలో డిఎస్‌పిగా పనిచేసిన దుగ్యాల ప్రణీత్ రావు అరెస్టవగా ఆ తరువాత అప్పట్లో భూపాలపల్లి అదనపు ఎస్‌పిగా వున్న భుజంగరావు, సిటీ సెక్యూరిటీ వింగ్ అదనపు ఎస్‌పి తిరుపతన్న, చివరగా టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావులు వరుసగా అరెస్టయ్యారు. వీరంతా ఐదు నెలలకు పైగా జైల్లో వున్న తరువాత బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ కేసు ప్రస్తుతం నాంపల్లి కోర్టులో విచారణలో వుంది. దీనికి సంబంధించి నాటి ఎస్ఐబి బాస్ డాక్టర్ ప్రభాకర్ రావును కోర్టు ఆదేశాలను అనుసరించి పోలీసు కస్టడీలో వుంచి విచారించడం సంచలనం రేపింది. ఇదే కేసులో సిట్ అధికారులు బాధితుల వాంగ్మూలం తీసుకుంటున్నారు. సరిగ్గా ఇదే సమయంలో సస్పెండ్ అయిన అదనపు ఎస్పి భుజంగరావు ఫోన్ ట్యాపింగ్‌తో పాటు గతంలో ఆయన పనిచేసిన చోట అక్రమంగా ఆస్తులు సంపాదించిన ట్లు ఎసిబికి ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో హాఫీజ్‌పేట్‌లోని భుజంగరావు ఇంటితో పాటు ఆయన హైదరాబాద్, సూర్యాపే ట్‌లో గల బంధువుల ఇళ్లలో ఎసిబి అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. భుజంగరావు రెండేళ్లకు పైగా సస్పెన్షన్‌లో వుండగా ఎసిబి అధి కారులు అక్రమాస్తులకు సంబంధించి దాడులు చేయడం గమనార్హం. దాడుల సందర్భంగా భుజంగరావు ఇంట్లో, ఆయన బంధువుల ఇళ్లలో ఎ సిబి అధికారులు భారీగా ఆస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించారు. భుజంగరావు ఇంట్లో రూ.3.83 లక్షల రూపాయల నగదు, బ్యాంకు ఖాతాలో మరో ఎనిమిది లక్షల రూపాయల నగదు, కిలో బంగారు నగలు, ఒక కారు లభ్యమయ్యింది. సూర్యాపేట్, నల్లగొండలో 27.29 ఎకరాల వ్యవసాయ పొలం ఆయన పేరిట వుంది. ఐదు ఖాళీ ప్లాట్లు, రెండు ఖరీదైన ఇళ్లు, ఒక వాణిజ్య భవనం ఆయన పేరిట వుంది. భుజంగ రావు వద్ద లభ్యమైన అక్రమాస్తుల విలువ ఐదు కోట్ల 92 లక్షల 54 వేల 500 రూపాయలుగా గుర్తించారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ 50 కోట్ల రూపాయల వరకు వుంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో పాటు ఆయన ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా వున్న 29 మద్య ం బాటిళ్ల వుండగా వాటిని ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమాస్తుల కేసులో భుజంగరావును ఎసిబి అధికారులు నాంపల్లి కో ర్టులో బుధవారం సాయంత్రం హాజరు పరిచారు. ఈ కేసును విచారించిన ఎసిబి కోర్టుల న్యాయమూర్తి భుజంగరా వుకు రెండు వారాల రిమా ండు విధించడంతో ఆయనను చర్లపల్లి జైలుకు తరలించారు. దాడుల సందర్భంగా భుజంగరావుతో పాటు ఆయన బంధువులను ఎసిబి అధికా రులు విచారించి వాంగ్మూలం నమోదు చేశారు.

## 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

>> నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతోపాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి.

## 12.5% అదనపు సుంకాలు

>> 10 శాతం నుంచి 12.5 శాతం వరకు అదనపు సుంకాలను విధించాలని యూఎస్‌టీఆర్ ప్రతిపాదించింది. అమెరికా ట్రేడ్ యాక్ట్ 1974 లోని సెక్షన్ 301 కింద నిర్వహించిన 60 సుదీర్ఘ దర్యాప్తుల ఫలితాలను యూఎస్‌టీఆర్ విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 54 ఆర్థిక వ్యవస్థలలో బలవంతపు శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను సమర్థవంతంగా నిషేధించడానికి లేదా నిరోధించడానికి తగినంత కఠినమైన చర్యలు లేవని అమెరికా తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ 54 దేశాల జాబితాలోనే భారతదేశాన్ని కూడా చేర్చడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జామీసన్ గ్రీర్ ఈ విషయమై మాట్లాడుతూ మా అత్యంత ముఖ్యమైన వాణిజ్య భాగస్వాములు బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతుల సమస్యను పరిష్కరించడంలో విఫలం కావడం అంగీకరించలేనిది. దీనివల్ల అమెరికా కార్మికులు ప్రపంచవ్యాప్తంగా అసమానమైన, అన్యాయమైన వాతావరణంలో పోటీ పడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూఎస్‌టీఆర్ నోటిఫికేషన్ ప్రకారం బలవంతపు శ్రమకు సంబంధించిన దిగుమతులపై ఇప్పటికే పాక్షిక ఆంక్షలు విధించిన లేదా పరస్పర వాణిజ్య ఒప్పందాల ద్వారా ఆ నిబంధనలను అమలు చేయడానికి అంగీకరించిన దేశాలపై 10 శాతం అదనపు టారిఫ్ పడుతుంది. ఈ ప్రమాణాలను అస్సలు పాటించని భారతదేశం, చైనా, జపాన్, సౌత్ కొరియా, బ్రెజిల్ వంటి దేశాల దిగుమతులపై గరిష్టంగా 12.5 శాతం అదనపు సుంకం విధించనున్నారు.

## రూ.4 వేల కోట్ల రుణం సేకరించిన సర్కార్

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.4 వేల కోట్ల మేర రుణాన్ని సేకరించింది. తాజాగా రిజ ర్వ బ్యాంకు (ఆర్బీఐ) నుంచి ఈ రుణాన్ని తీసుకుంది. రిజర్వ్ బ్యాంక్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను బహిరంగ వేలం ద్వారా ఈ రుణాన్ని సమీకరించింది. ఈ రూ.4 వేల కోట్ల రుణాన్ని రెండు విడతలుగా సేకరించింది. ఈ రుణంలో రూ.2 వేల కోట్లు 17ఏండ్ల కాలపరిమితితో 7.90వార్షిక వడ్డీకి, మరో రూ.2 వేల కోట్లను 30ఏండ్ల కాలపరిమితితో 7.88వార్షిక వడ్డీకి తీసుకున్నట్టు రిజర్వ్ బ్యాంక్ వెల్ల డించింది. దీంతో ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు తీసుకున్న అప్పు రూ.16,900 కోట్లుగా నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుండి జూన్ నెల వరకూ కలిగిన తొలి త్రైమాసికంలో రూ.18,900 కోట్లు రుణాన్ని తీసుకుంటామని రిజర్వ్ బ్యాంక్‌కు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రతిపా దనలు సమర్పించింది. ఇందులో భాగంగా ఏప్రిల్ నెలలో రూ.6,900 కోట్లు, మే నెలలో రూ.6వేల కోట్లు, ఈ జూన్ నెలలో రూ.4 వేల కోట్లు రుణాన్ని సమకూర్చుకుంది. మిగిలిన రూ.2వేల కోట్ల రుణాన్ని కూడా ఈ నెలలోనే సమీకరించబోతున్నది.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

## బడంగ్‌పేట్ మాజీ మేయర్ దంపతుల విచారణ

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధి తులుగా వున్న వారి విచారణ కొనసాగుతోం ది. ఈ కేసులో గడచిన పది రోజులుగా ముగ్గురు బాధితులను విచారించిన సిట్ అధికారులు తాజాగా బుధవారం బడంగ్‌పేట్ మాజీ మేయర్ చిగురింత పారిజాత, ఆమె భర్త నర్సింహా రెడ్డిలను అరగంట పాటు పలు అంశాలపై ప్రశ్నించి వాంగ్మూలం నమోదు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బుధవారం కమాండ్ కంట్రోల్‌లోని సిట్ కార్యాలయానికి విచారణకు రావాలని సిట్ అధికారులు మంగళవారం సాయంత్రం పారిజాత దంపతులకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా బుధవారం ఉదయం 11గంటలకు వారు విచారణకు హాజర య్యారు. వీరి వెంట కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చారు. విచారణ అనంతరం పారిజాత ఆమె భర్త మీడియాతో మాట్లాడుతూ తమ ఫోన్‌లు టా ్యపింగ్ అయిన విషయం తమకు ఇప్పటి వరకు తెలియదని, అయితే గత అసెంబ్లీ ఎన్నికల వేళ తాము పడ్డ ఇబ్బందులను గమనిస్తే ట్యాపింగ్ నిజమని భావిస్తున్నామని తెలిపారు. గతంలో తాను మేయర్‌గా వుండగా తన భర్త తనకు సహాయం అందించే వారని, ఈ సమయంలో తమకు తెలియకుండా ఫోన్‌లను ట్యాప్‌చేసి తమను మానసికంగా కృంగదీశారని, తమ కదికలపై అప్పటి సర్కారు అడుగడుగునా నిఘా ఉంచిందని పారిజాత తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌పై సిట్ విచా రణ సవ్యంగా సాగుతుందని తాము నమ్ముతున్నామని, ఈ కేసులో నిందితులకు శిక్ష పడుతుందని తమకు నమ్మకం వుందని పారిజాత దంపతులు అన్నారు.

### హీరా గోల్డ్ ఆస్తుల కేసులో

## నౌహేరా షేక్ పిఎ అరెస్టు

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** దేశంలోని అనేక రాష్ట్రాలతోపాటు గల్ఫ్ దేశా ల్లోనూ అమాయకులను అధిక వడ్డీ, బంగారం. వజ్రాల స్కీంల పేరిట నిండా ముంచి నాలుగువేల కోట్ల రూపాయలకు పైగా దోచుకున్న నౌహేరా షేక్ ఉదం తంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం మరో వ్యక్తిని అరెస్టు చేశారు. అరెస్టయిన వ్యక్తి నౌహేరా షేక్ పిఎగా పనిచేస్తున్న నజ్నీన్ అన్సారిగా ఈడీ అధికారులు తెలిపారు. హైదరా బాద్‌కు చెందిన నజ్నీన్ అన్సారి నౌహేరా షేక్ గోల్‌మాల్ వ్యవహారంలో కీల కంగా వుండడం తెలిసిందే. ఈడీ గతంలో అటాచ్ చేసిన ఆస్తులను నౌహేరా షేక్ తన అవసరాలకు వాడుకోవడంతో పాటు తనకు తెలిసిన వ్యక్తులకు అద్దెకు ఇచ్చినట్లు ఆవిభాగం అధికారులు గుర్తించారు. ఈ తతంగంలో నజ్నీన్ అన్సారి కీలకంగా వ్యవహారించినట్లు ఈడీ తేల్చింది. ఈ నేపథ్యంలో నజ్నీన్ అన్సారిని అరెస్టు చేసిన ఈడీ అధికారులు అతన్ని తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తు న్నారు. కాగా నౌహేరా షేక్‌ను ఈడీ అధికారులు ఇటీవలే హరియాణలో రహ స్యంగా తలదాచుకోగా అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించడం తెలి సిందే. ఇప్పుడు ఆమె పిఎ నజ్నీన్ అన్సారిని కూడా అరెస్టు చేయడంతో అతడిని కూడా ఇదే జైలుకు తరలించే వీలుంది.

## బంజారాహిల్స్ ఠాణాకు బాల్క సుమన్ కేసు

**జూబ్లీహిల్స్, జూన్ 3, ప్రభాతవార్త:** చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై నాంపల్లి ఠాణాలో నమోదైన కేసును బంజారాహిల్స్ ఠాణాకు బదిలీ చేశారు. ఈ నెల 26న సింగరేణిలో జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాల్క సుమన్‌పై నాంపల్లి ఠాణాలో కేసు నమోదైన విషయం విదితమే. ఒక సమావేశంలో కార్యకర్తలతో బాల్క సుమన్ మాట్లాడుతూ నాంపల్లిలోని సింగరేణి భవనాన్ని, సింగరేణి ఆస్తులను తగులబెట్టాలని, మిలిటెండ్ యాక్టివిటీ చేయాలని, రైలు పట్టాలు కోయాలంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే బాల్క సుమన్‌పై కేసు నమోదైంది. సుమన్‌ను గత నెల 30న బీఆర్ఎస్ భవన్‌లో నాంపల్లి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజుల రిమాండ్‌కు విధించారు. దీంతో బాల్క సుమన్ ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కేసును బుధవారం బంజారాహిల్స్ ఠాణాకు బదిలీ చేశారు. దీంతో బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు సుమన్‌ను కస్టడీ కోరుతూ పిటీ షిన్ వేయాలని భావిస్తున్నారు. మూడు, నాలుగు రోజుల కస్టడీ కోరుతూ పిటీ షన్ వేస్తామని బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు. బాల్క సుమన్‌పై పోలీ సులు బీఎన్ఎస్326(జి), 55,61(2), 353(3), 353(1)(బి), 152 సెక్షన్లతో పాటు పీడీపీపీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## అమెరికాలో కారు ప్రమాదం
## మధుయాష్కీ గౌడ్ సతీమణికి తీవ్ర గాయాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** కాంగ్రెస్ సీనియర్ నేత, నిజామాబాద్ మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ కుటుంబంలో తీవ్ర ఆందోళన నెలకొంది. అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ సతీమణి డాక్టర్ సుచి యాష్కీకి తీవ్ర గాయాలయ్యాయి. మధుయాష్కీ గౌడ్ కుటుంబ సభ్యులు తమ చిన్న కుమార్తె డాక్టర్ గగన యాష్కీని ఉన్నత చదువుల నిమిత్తం ఎండీ కోర్సులో జాయిన్ చేసేందుకు అమెరికా వెళ్లారు. కూతురి అడ్మిషన్ ప్రక్రియ ముగించుకుని వారు బోస్టన్ నగరం నుంచి వేర్వేరు కార్లలో న్యూయార్క్‌కు వస్తుండగా డాక్టర్ సుచి యాష్కీ ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం జరిగినట్లు తెలిసింది. మార్గమధ్యలో భారీ వర్షం కురుస్తుండగా రహ దారిపై వీరు ప్రయాణిస్తున్న కారుఒక్కసారిగా అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈప్రమాదం జరిగిన సమయంలో కారులో ఉన్న మధుయాష్కీ భార్య డాక్టర్ సుచీ యాష్కీకి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటనలో సుచియాష్కికి పక్క టెముకలు విరిగాయి. ప్రమాదం జరిగినవెంటనే ఆమెను స్థానిక ఆసుపత్రికి తర లించగా డాక్టర్లు అత్యవసర చికిత్స అందించినట్లు కుటుంబ సభ్యులు తెలి పారు. మధుయాష్కీ గౌడ్ కూడా ప్రస్తుతం అమెరికాలోనే ఉన్నారు.

## ఫోన్ ట్యాపింగ్‌లో బిజెపి నేత దీపక్ రెడ్డికి సిట్ నోటీసులు

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుల విచారణ, వాంగ్మూలం నమోదు కొనసాగుతోంది. దీనికి సంబం ధించి పంజాగుట్టలో నమోదైన ప్రధాన కేసులో ఇప్పటికే అనేక మంది వాంగ్మూలం ఇవ్వగా మరికొందరిని సిట్ అధికారులు విచారించారు. ఇదే కేసులో బిజెపి నేత లంకల దీపక్ రెడ్డికి సిట్ అధికా రులు బుధవారం ఫోన్ ద్వారా సమాచారం అందించి, గురువారం విచారణకు రావాలని కోరారు. ఈ కేసులో దీపక్ రెడ్డి బాధితుడుగా వున్నట్లు సమా చారం. గత అసెంబ్లీ ఎన్నికల సమ యంలో ఆయన ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు గుర్తించినట్లు తెలిసింది.

# చీఫ్ సెక్రటరీ పదవీ కాలం పెంపునకు యత్నం

### కేంద్రానికి లేఖ రాయనున్న రాష్ట్ర సర్కార్
### సిఎస్ పోటీలో నలుగురు సీనియర్లు



**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు పదవీ కాలాన్ని మరోసారి పొడిగించాలంటూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలని నిర్ణయించినట్లు తెలియవచ్చింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. కాగా ఇప్పటికే రామకృష్ణారావు పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం రెండు సార్లు పొడిగించింది. 1991 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావు 2025 ఏప్రిల్ 30న చీఫ్ సెక్రెటరీగా బాధ్యతలు చేప ట్టగా, అదే ఏడాది ఆగస్టు 31న రిటైర్ కావా ల్సి ంది. కానీ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఆయన సర్వీసును 7 నెలల పాటు కేంద్రం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ ఏడాది మార్చి నెలాఖరున ఆయన సర్వీస్ ముగు స్తుండగా మరోసారి ఆయన పదవీ కాలాన్ని పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరగా, మరో 3 నెలల పాటు ఆయన సర్వీసును పెంపుదల చేసింది. దీంతో రామ కృష్ణారావు పదవీ కాలం ఈ నెల 30న ముగి యనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో చీఫ్ సెక్రెటరీగా కొత్త వారిని నియమించడం అంత ఆసక్తి లేకపో వడంతో రాష్ట్ర ప్రభుత్వం రామకృష్ణారావును మరికొన్ని నెలల పాటు కొనసాగించడానికి మొగ్గు చూపుతున్నట్లు వెల్లడవుతోంది. మరోపక్క రామ కృష్ణారావుకు ఇంకోసారి పదవీ కాలం పొడిగింపు లభించకపోతే ఆ పదవికి నలుగురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు తీవ్రంగా ప్రయత్నిస్తు న్నారు. ఆ జాబితాలో కేంద్ర సర్వీసులో ఉన్న సంజయ్ జాజు రాష్ట్ర సర్వీసులో ఉన్న జయేశ్ రంజన్, వికాస్ రాజు, సబ్యసాచి ఘోష్ సైతం సీఎస్ పోస్ట్ కోసం పోటీ పడుతున్నట్లు తెలియవచ్చింది.

## 5 నుంచి 12వరకు ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి (ఎస్ ఎస్‌సి) అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ఎక్కడా గ్యాప్ లేకుండా జూన్ 5 నుంచి 12 వరకు వరుసగా జరగనున్నాయి. రాష్ట్రంలో 93 కేంద్రాల్లో 31,542 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ తెలంగాణ హాల్ టికెట్లను విడుదల చేసింది. విద్యార్థులు తమ జిల్లా పేరు,స్కూల్ పేరు,పుట్టిన తేదీ వివరాలు అధికారిక వెబ్‌సై ట్‌లో నమోదుచేసి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.తెలంగాణ పదో తరగతి 2026 సప్లిమెంటరీ పరీక్షల పూర్తి టైం టేబుల్ ఇదే.

జూన్ 5న ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్ఏ) పరీక్ష
జూన్ 6న సెకండ్ లాంగ్వేజ్
జూన్ 7న థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లిష్)
జూన్ 8న మ్యాథమెటిక్స్
జూన్ 9న సైన్స్ పార్ట్1 (ఫిజికల్ సైన్స్)
జూన్ 10న సైన్స్ పార్ట్2 (బయాలాజికల్ సైన్స్
జూన్ 11న సోషల్ స్టడీస్, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ పరీక్షలు
జూన్ 12వ తేదీన ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్2 పరీక్షలు ఉంటాయి.

**10వ తేదీలోగా ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు**

మరోవైపు తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వా న్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఇప్పటికే పూర్త య్యాయి. జవాబు పత్రాల మూల్యాంకనం, స్కానింగ్ ప్రక్రియలు కూడా పూర్తయ్యాయి. ఇక ఫలితాలను ఈనెల 10వ తేదీలోపు విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఫలితాల విడుదలకు సంబంధించిన తుది చర్యలు కొనసాగుతు న్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మే 12 నుంచి మే 21 వరకు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. మొత్తం 3,98,358 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. సప్లిమెంటరీ ఫలి తాలు వెలువడిన వెంటనే ఎంసెట్ కౌన్సెలింగ్, డిగ్రీ ప్రవేశాలు ప్రక్రియలు ప్రారంభమవుతాయి.

### భూముల మార్కెట్ విలువ పెంపుతో
# రూ.2వేల కోట్లకు పైగా ఆదాయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** మూడు శ్లాబుల్లో మార్కెట్ విలువలను పెంచడం ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి రూ.2 వేల కోట్లకుపైగా అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021, 2022లో రెండు విడతలుగా భూముల రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలు సవ రించింది. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా వ్యవ సాయ, వ్యవసాయేతర భూములు, ఇళ్ల స్థలా లు, అపార్ట్‌మెంట్ల రిజిస్ట్రేషన్ విలువలు పెరి గాయి. గడిచిన నాలుగేళ్లలో స్థిరాస్తుల విలువలు భారీఎత్తున పెరిగినా ప్రభుత్వం మార్చలేదు. ప్రభుత్వ రిజిస్ట్రేషన్ మార్కెట్, బహిరంగ మార్కెట్ విలువల మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అందులో భా గంగా అన్ని రకాల ఆస్తుల రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలను సవరించేందుకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటుచేసింది. గత నెల రోజులుగా కొనసా గుతున్న కసరత్తు పూర్తైనట్లు స్టాంపులు, రిజిస్ట్రే షన్‌శాఖ అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా144 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 'రివిజన్ ఆఫ్ మార్కెట్ వాల్యూస్ గైడ్‌లైన్స్ కమిటీలు' క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశాయి. జాతీయ రహదారులు, వెడల్పాటి రోడ్లు 30 అడుగుల కన్నా ఎక్కువ 100 అడుగులవరకు రహదారులు ఉన్న ప్రాంతాలు వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు, పట్టణ విస్తరణ ప్రాంతాలు వంటి వివిధ కేటగిరీలుగా ప్రాంతా లను విభజించారు. అక్కడ అమల్లో ఉన్న విలు వలను అధికారులు పరిశీలించారు.బహిరంగ, మార్కెట్ విలువల మధ్య భారీగా తేడా ఉన్నట్లు గుర్తించారు. రెండింటి మధ్య తక్కువ వ్యత్యాసం ఉన్న ప్రాంతాల్లో 25 శాతం, ఎక్కువ వ్యత్యా సం ఉన్న ప్రాంతాల్లో 50 శాతం, వాణిజ్య పరంగా వేగంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో 100 శాతం వరకు విలువలు పెంచాలని కమిటీ ప్రభుత్వానికి నివేదించింది. ఇళ్ల స్థలాలు, భవ నాలు, అపార్ట్‌మెంట్ల విషయంలో ప్రస్తుతం అమల్లో ఉన్న రిజిస్ట్రేషన్, మార్కెట్ విలువలు, ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువలను పోల్చి 25 శాతం, 50శాతం, 100 శాతం, మూడు కేటగిరీల్లో పెంపు ప్రతిపాదనలు చేసినట్లు సమా చారం. గ్రామాలు, పట్టణాలు, వార్డులు యూని ట్లుగా తీసకొని సగటు మార్కెట్ విలువలను ఆధారంగా పెంపు నిర్ణయం తీసుకున్నట్లు అధి కారులు వెల్లడిస్తున్నారు. క్షేత్రస్థాయిలో రూపొం దించిన ఆ వేదికలను 144 సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాల నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కమి షనర్‌కు పంపించారు.

ఆ నివేదికలను హైదరా బాద్‌లోని ఐజీ కార్యాలయంలో అదనపు ఐజీలు, జాయింట్ ఐజీలు, జిల్లా రిజిస్ట్రర్లు, పలువురు సబ్ రిజిస్ట్రార్లు గత కొన్ని రోజులుగా సమీక్షించినట్లు సమాచారం. గతంలో మాదిరిగా కాకుం డా ఈసారి క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహనతో, పారదర్శకంగా మార్కెట్ విలువల సవరణ ప్రక్రి య చేపట్టినట్లు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధి కారులు పేర్కొంటున్నారు.

# మొజ్తబాను కలవాలనుంది..

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 3:** ఇరాన్‌తో సంబంధాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీని కలిసే అవకాశం ఉందని రెండు దేశాల మధ్య ప్రస్తుతం పరిస్థితులు ఊహించిన దానికంటే మెరుగ్గా ఉన్నాయని చెప్పుకొచ్చారు. కొనసాగుతున్న ఉద్రిక్తతలు, శాంతి చర్చల్లో జాప్యం ఉన్నప్పటికీ ఇరాన్‌తో తమ సంబంధాలు సానుకూల దిశగా సాగు తున్నాయని తెలిపారు. పాడ్ ఫోర్స్ వన్ ఏజెన్సీ పోడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లా డారు. ఇరాన్ నిర్ణయాల ప్రక్రియలో మొజ్తబా ఖమేనీ ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 28న ప్రారంభమైన అమెరికాఇజ్రాయెల్ సైనిక చర్యల తర్వాత మొజ్తబా ఖమేనీ బహిరంగంగా కనిపించలేదు. ఆ దాడుల్లో అయతుల్లా అలీ ఖమేనీ సహా పాలక కుటుంబానికి చెందిన పలువురు మరణించారన్న వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల మధ్య కూడా మొజ్తబా ఖమేనీ ఇరాన్ నాయకత్వ వ్యవస్థలో ప్రభావవంతమైన వ్యక్తిగానే కొనసాగుతున్నారని ట్రంప్ తెలిపారు. అతను పూర్తిగా వ్యవహారాల్లో భాగస్వామిగా ఉన్నాడు. ఇరాన్‌లో అతనికి చాలా గౌరవం ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో కమ్యూనికేషన్ ప్రస్తుతం కొంత క్లిష్టంగా మారిందని తెలిపారు. ఖమేనీ బహిరంగ జీవితానికి దూరంగా ఉండటంతో సంప్రదింపులు మధ్యవర్తుల ద్వారా సాగుతున్నాయని చెప్పారు. నేను ఇప్పటివరకు ఆయనను కలిసే అవకాశం దొరకలేదు. కానీ భవిష్యత్తులో కలిసే అవకాశ ముంది. పరిస్థితులు ఎలా మారతాయన్నదానిపై అది ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. ఇరాన్ నాయకుడిని వ్యక్తిగతంగా కలిసేందుకు సిద్ధమేనా అనే ప్రశ్నకు ట్రంప్ సానుకూలంగా స్పందించారు. నేను ఆయనను కలవాలను కుంటున్నాను. అందరినీ కలవడానికి నేను సిద్ధంగానే ఉంటాను. ఏదో ఒక దశలో మేమిద్దరం కలుసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇది ట్రంప్ గతంలో వ్యక్తం చేసిన అభిప్రాయాలకు భిన్నంగా ఉండటం గమనార్హం. గతంలో మొజ్తబా ఖమేనీ నాయకత్వ సామర్థ్యంపై ట్రంప్ విమర్శలు చేశారు. తాజా ఇంటర్వ్యూలో ఆయనతో నేరుగా చర్చలకు సిద్ధమని, ముఖాముఖి సమావేశం కూడా జరగవచ్చని పేర్కొనడం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ట్రంప్ తాజా వ్యాఖ్యలు అమెరికాఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలను తగ్గించే దిశగా కొత్త దౌత్య ప్రయత్నాలకు సంకేతంగా భావించవచ్చు. ఇరాన్ అణు కార్యక్రమం, ప్రాంతీయ భద్రత, పశ్చి మాసియా స్థిరత్వం వంటి అంశాలపై భవిష్య త్తులో మరిన్ని చర్చలకు మార్గం సుగమం కావ చ్చని అంతర్జాతీయ నిపుణులు అభిప్రా య పడుతున్నారు.

## ఎన్టీఆర్‌పై కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు

### టిడిపి తెలంగాణ రాష్ట్ర నేతల ఆగ్రహం



బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న నర్సి రెడ్డి, అర్వింద్ కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** ఎన్టీఆర్ వచ్చాక బడుగు బలహీన వర్గాల జీవి తాల్లో మార్పు వచ్చిందని టీడీపీ పొలిట్‌బ్యూరో మెంబర్ అర్వింద్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ గురించి తెలియక కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ సమాధి తొలగిస్తామని, విగ్రహాలు కూలుస్తామంటున్నారని అన్నారు. తెలంగాణ వాళ్లు కాదని అంబేద్కర్, పూలే విగ్రహాలు తీసేస్తారా అని ప్రశ్నించారు. తెలం గాణ కోసం చంద్రబాబు నాయుడు ఆనాడు లేఖ ఇచ్చారని గుర్తు చేశారు.టీడీపీ తెచ్చిన సంస్కరణల వల్లే తెలంగాణ ఇప్పుడు నంబర్ వన్‌గా ఉం దని అర్వింద్ అన్నారు. కొత్తగా పెట్టిన పార్టీ వాళ్లు తాము ముఖ్యమంత్రి అవు తామని విగ్రహాలు తొలగిస్తామని అంటున్నారని వ్యాఖ్యానించారు. ఎవరైనా ఎక్కడైనా మీటిం గ్‌లు పెట్టుకోవచ్చని, పోటీ చేయవచ్చన్నారు. కానీ ఇక్కడ మీటింగ్‌లు పెట్టుకోవద్దని పెడితే అడ్డుకుంటామని అనడం ఎంతవరకు సమంజ సమని ప్రశ్నించారు. రాష్ట్రాలు వేరైనా తెలుగు వాళ్లంతా ఒక్కటిగా ఉందామని అర్వింద్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ తమ వల్లనే వచ్చిందన్న కేసీఆర్ పదేళ్లు పాలన చేశారని టీడీపీ నేత నన్నూరి నర్సా రెడ్డి అన్నారు. తెలం గాణ ఇచ్చింది తామే అన్న పార్టీ రెండు న్నరేళ్ళుగా అధికారంలో ఉందన్నారు. ఈ రెండు పార్టీల పాలనపై చర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పెద్ద ఎత్తున దోపిడి జరిగిందని, మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో అంతకుమించి దోపిడీ జరిగిందని వ్యా ఖ్యానించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏం తప్పుగా మాట్లాడారని ఆయనపై విమర్శలు చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి కోసం జనసేనతో కలిసి పోటీ చేస్తామని.. మరో పార్టీతో అయినా పోటీ చేస్తామని స్పష్టం చేశా రు. తెలంగాణ గడ్డ అభి వృద్ధికి బాటలు వేసింది టీడీపీ అని నర్సా రెడ్డి అన్నారు. చంద్రబాబును, టీడీపీని అప్రతిష్ఠ పాలు చేసే కుట్రలు ఇక్కడ నుంచి జరుగుతు న్నాయని ఆరోపించారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన విద్యా సంస్థలు, సేవా కార్యక్రమాలు తెలంగాణ ప్రజలకు మేలు చేస్తున్నాయని తెలిపారు. ప్రశ్నించే తత్వాన్ని ప్రజలకు నేర్పుతున్న పార్టీని ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. అడ్డుకుంటాం, దాడులు చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. పొత్తుల అంశం ఎన్నికల సమ యంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుం టుందని నర్సా రెడ్డి పేర్కొన్నారు.

## పెద్ది సినిమా టికెట్ ధరలు పెంపు

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** రామ్ చరణ్ బుచ్చిబాబు కాంబినేషన్లో రూపొంది, త్వరలో విడుదల కానున్న "పెద్ది" టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతినిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల్లో వెల్లడించిన వివరాలు ప్రకారం సింగిల్ స్క్రీన్ థియేటర్లలో సాధారణ టికెట్ ధరపై అదనంగా రూ.100 వరకు పెంచుకునేందుకు అనుమతినివ్వగా, మల్టీ ప్లెక్స్ థియేటర్లలో ప్రతి టికెట్ ధరపై అదనంగా రూ.125 వరకు పెంచు కోవచ్చునని పేర్కొంది. ఈ సినిమాకు సంబంధించి బుధవారం రాత్రి ప్రద ర్శించే ప్రత్యేక ప్రీమియర్ షోల టికెట్ ధరను ఏకంగా రూ.600 వరకు పెం చుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ టికెట్ ధరల పెంపు సినిమా విడుదలైన రోజు నుండి గరిష్టంగా 10 రోజుల వరకు మాత్రమే వర్తిస్తుం దని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఆ తర్వాత ధరలు యథావిధిగా సాధారణ స్థితికి వస్తాయి.

## పోలింగ్‌శాతం పెరగడమే ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపై పెరిగిన నమ్మకం

### కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్



**న్యూఢిల్లీ,జూన్ 3:** ఐదురాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు భారీ ఎత్తున నమోదయిన పోలింగ్ శాతమే ఎన్నికల సంఘం నిర్వహించిన ఎన్నికల ప్రక్రియపట్ల నమ్మకం పెరిగిందనడానికి నిదర్శనమని కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. 90శాతాని కిపైగా పెరిగిన ఓట్లశాతం ప్రజల్లో ఎన్నికల ప్రక్రియపట్ల పెరిగిన నమ్మకానికి నిదర్శనమని అన్నారు. ఎన్నికల ప్రచారంలో అత్యున్నత కార్యాచరణలు అన్న అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో జ్ఞానేష్‌కుమార్ ప్రసంగించారు. ఎన్నికల సంఘం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నవారికి శిక్షణ నిచ్చి చైతన్యం అవగాహన పెంచిందని, బూత్‌లెవెల్ అధికారులు, బూత్‌లెవల్ సహాయకులకు కూడా శిక్షణ ఇవ్వడంవల్లనే 100 కోట్ల మంది ఓటర్లకు ఎలాంటి భయం లేకుండా నిర్భీతిగా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం వచ్చిం దన్నారు. ఎన్నికల నిర్వహణలో వివిధ దృక్కోణాలు, ప్రపంచస్థాయి విజ్ఞాన వనరులు, అభ్యాసరీతిలో అవగాహన వంటి అంశాలపై జ్ఞానేశ్ విస్తృతంగా ఉదాహరణలు ఇచ్చారు. ఈ ఏడాది జనవరి 23వ తేదీ ఢిల్లీ డిక్లరేషన్‌లోనే సూచించినట్లు తెలిపారు. అంతేకాకుండా ప్రజాస్వా మ్యం, ఎన్నికల నిర్వహణపై భారత్ అంతర్జాతీయ సదస్సులోనే ఢిల్లీ డిక్లరేషన్ ఇచ్చామన్నారు.

## ఆదాయం కంటే అప్పులు ఎక్కువ లేవు

### ఏప్రిల్‌లో రుణం రూ.11,414 కోట్లు కాదు
### కేవలం రూ.6,900 కోట్లు మాత్రమే
### రాబడి రూ.10,974 కోట్లు బదులు రూ.13.098 కోట్లు
### రాష్ట్ర ఆర్థిక శాఖ వివరణ

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవ త్సరం మొదటి నెల ఏప్రిల్‌లోనే రాబడిని మించిన రుణాలకు సం బంధించిన నివేదికపై తెలంగాణ ఆర్థికశాఖ ఒకవివరణ జారీ చేసింది. ఏప్రిల్ 2026 కోసం ప్రచురించిన రుణ, ఆదాయ గణాంకాలను ఈ వివరణలో ఆర్థిక శాఖ ఖండించింది. ఈ వివరణలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి వెల్లడిస్తూ ఏప్రిల్ నెలలో రాష్ట్రం రూ.11,414 కోట్ల అప్పు చేసిందని నివేదికలో తప్పుగా పేర్కొ న్నారని స్పష్టం చేశారు. ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓపెన్ మార్కెట్ బారోయింగ్స్ ద్వారా కేవలం రూ.6,900 కోట్ల మేర రుణాలు మాత్రమే సమీకరించబడ్డాయని స్పష్టం చేశారు. ఆ నెలలో అసలు, వడ్డీ కింద రూ.7,949 కోట్లు తిరిగి చెల్లించామని, దీని ఫలితంగా నికర రుణ పరిస్థితి ప్రతికూలంగా ఉందని కూడా పేర్కొంది. ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ ఫ్రేమ్‌వర్క్ కింద నిర్దేశించిన పరిమితులకు లోబడి, కేంద్ర ప్రభుత్వ ఆమోదంతోనే అన్ని అప్పులు తీసుకుంటున్నామని తేల్చి చెప్పింది. అలాగే నివేదికలో పేర్కొ న్న రూ.10,974 కోట్ల ఆదాయ వ సూళ్లను కూడా ఈ ఖండనలో వ్యతిరేకించింది,



## సూర్యప్రభపై సారంగపాణిగా కల్యాణ వేంకటేశ్వరుడు

**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా నారాయణవనంలో పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్స వాల్లో బుధవారం ఉదయం స్వామి సారంగపాణి అలంకారంలో సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చి అనుగ్రహించారు. సూర్యకిరణాల తేజస్సు ను తలపించే ఈ వాహనసేవలో స్వామివారి అపూర్వ రాజసం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. కర్పూరహారతులతో మార్మోగిన నారాయణవనం స్వామివారి విహార మార్గమంతా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణలతో ఆలయ పరిసరాలను మార్మోగించారు. భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు, మంగళ వాయిద్యాలు ఉత్స వాలకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్స వాల్లో భాగంగా బుధవారం రాత్రి 7 గంటలకు స్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరించి భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్‌రాయులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## త్వరలో తిరుమలకు మరిన్ని ఇవి బస్సులు



**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలను పూర్తిస్థాయిలో పర్యావరణ హితంగా మార్చేందుకు, కాలుష్యనియంత్రణలో భాగంగా విద్యుత్‌తో నడిచే బస్సు లను తీసుకువచ్చేందుకు ఆర్టీసి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే ప్రభుత్వం కూడా తిరుమల ఘాట్‌లో పూర్తిగా విద్యుత్ బస్సు లనే నడపాలని కూడా సూచించింది. ప్రస్తుతం 50 విద్యుత్ బస్సు లు తిరుమల- తిరుపతి, తిరుపతి- తిరుమల మధ్య నడుస్తు న్నాయి. ఈ బస్సు ల వల్ల నిర్వహణ వ్యయం కూడా బాగా తగ్గడమేగాక ఘాట్‌లో పూర్తిగా కాలుష్యరహితంగా దోహదపడుతోంది. ఇప్పుడు త్వరలోనే ప్రధానమంత్రి ఇ బస్ సేవ పథకం క్రింద రాష్ట్రానికి విద్యుత్ బస్సు లు రానున్నాయి. జులైలో అందుబాటులోకి సరికొత్త పర్యావరణ అనుకూల బస్సు లు రాబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఈబస్ సేవ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు 750 ఎలక్ట్రిక్ బస్సు లు మంజూరయ్యాయి. వీటిలో తొలి విడతగా 300 బస్సు లు ఈ ఏడాది జులై నెలలోనే రోడ్డెక్కడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇందులో మరో 50 బస్సు లు తిరుమలకు రానున్నాయనేది సమాచారం. దీనివల్ల పూర్తిగా ఘాట్‌లో పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలకు చాలావరకు నియంత్రించవచ్చనేది టిటిడి, రవాణా, ఆర్టీసి, పోలీస్ వర్గాలు ఆలోచన. పర్యావరణ హిత ఎలక్ట్రిక్ బస్సు లు రానున్న బ్రహ్మోత్స వాలకు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. తిరుమల ఘాట్ రోడ్డులో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సు ల స్థానంలో 300 ప్రత్యేక ఎలక్ట్రిక్ బస్సు లను కేటాయించారు. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ వేగంగా జరుగుతోందనేది ఆర్టీసి వర్గాల సమాచారం.

వార్త

దుఃఖం అనేది శిక్ష కాదు, సంతోషం అనేది వరమూ కాదు. రెండూ ఫలితాలే. అవి మన చర్యలననుసరించి మాత్రమే.

న- ఆర్.జి ఇంగర్సాల్

# శాంతికి మార్గమేది?

నా కోడి కుంపటి లేకుంటే తెల్లవారదులే అనుకుంటుండేది వెనుకటికో ఓ ముసలవ్వ. ఇప్పుడు శ్వేతాధినేత ట్రంప్ కూడా అదే ధోరణిలో మాట్లాడుతున్నాడు. ఇజ్రాయెల్ మిత్రత్వ కారణంగా ఇరాన్‌తో పోరుకు తలబడిన ఆయన ఇప్పుడు తలగోక్కుంటున్నాడు. ఇజ్రాయెల్ ప్రధాని నెతనాహ్యును వదిలిపెట్టనూ లేడు,తాజా యుద్ధం మీద ఎలాంటి నిర్ణయం తేల్చనూ లేడు. అలా అని సమర్ధించే పరిస్థితీ లేదూ. అయినా ఊబిలో పడ్డ దున్న మాదిరి పెనుగులాడుతున్నాడు. పరిస్థితుల్లో ట్రంప్ మరింత వాచాలత ప్రదర్శిస్తున్నారు. జరిగిందేదో జరిగిపోయిందిలే అని ఊరుకునే మనస్తత్వంలోనూ లేడాయన. ఇరాన్‌తో సంధి చేసుకుంటే తనకు అవమానమని భావిస్తూ ఎప్పటి కప్పుడు వగచడం తప్ప ఏం చేయలేని పరిస్థితిఆయనది.. నిర్యుద్ధ ప్రకటన జరిగే చర్చలను ముందుకు సాగకుండా ఉండటంతో ట్రంప్‌కు నెతన్యాహు నుంచి ఒత్తిడిలుండట మేనని ఇరాన్ భావన. అందుకే ఇక చర్చల్లేవ్! చర్చించు కోటాల్లేవ్! అనే మాటలు యధాలాపంగా వినపడుతున్నాయి. ఇరాన్ ఎప్పుడూ ఒక మాట మీదనే ఉంది. కానీ ట్రంప్ మాత్రమే జరుగుతున్న భీకర యుద్ధానికి, కాల్పుల విరమణ అమలులో ఉన్నట్లేనని రెండు విరుద్ధ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మధ్యలో ఏ విషయమూ తెలనివ్వడం లేదు. ఎవరిది చిత్తచాంచల్యమో, భ్రాంతో ఇప్పుడిప్పుడే తేల్చలేని పరిస్థితి ఉంది. ఒకపక్క తీవ్ర స్థాయిలో శతఘ్నులు పేలుతున్నా ఇంకా కాల్పుల విరమణ అమల్లోనే ఉందంటూ సర్దుబాటు సమర్థింపులు జరుగుతున్నాయి. అణు కార్యక్రమం, హార్మూజ్ జలసంధి వంటి అంశాలపై ఎడతెగని చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు. మరోపక్క ఇజ్రాయెల్ లెబనాన్‌పై చేస్తున్న భారీ దాడుల విషయంలో ట్రంప్ ప్రతిపాదనలేమీ ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు వినడం లేదు. వారిద్దరి మధ్య కొంత 'మిత్రబేధం' ఏర్పడిందా! అని అనిపిస్తోంది. ఇజ్రాయెల్ మంకుపట్టు వీడకపోవడంతో అమెరికా ఆగ్రహం చెందింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో చర్చించిన అంశాలన్నిటినీ బహిర్గతం చేయడంలో కూడా అమెరికా అత్యుత్సాహం చూపిస్తోంది. అవి కూడా నిర్దిష్టంగా లేవు. రష్యా చమురును కొనుగోలు చేస్తూ వచ్చిన భారత్‌పై ఆంక్షలు పెట్టిన అమెరికా ఇప్పుడు స్వరం మార్చింది. రష్యా చమురు ప్రపంచ దేశాలకు అందుబాటులోకి వస్తేనే పశ్చిమాసియా చమురు సంక్షోభానికి కొంతైనా పరిష్కారం చూపినవారమవుతామని ఇటీవల భారత్‌లో పర్యటించి వెళ్లిన అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో వ్యాఖ్యానిస్తున్నారు. ఇవన్నీ గమనిస్తున్న ఇరాన్ ఎలాంటి పరిస్థితుల్లోనూ అమెరికా, ఇజ్రాయెల్‌తో చర్చలే ఉండవన్న రీతిలో అమెరికాను హెచ్చరిస్తోంది. అసలు యుద్ధం జరుగుతోందా, కాల్పుల విరమణ ఉన్నట్లా? లేదా! యుద్ధం మిధ్యేనా ఇలాంటి సంగతులన్నీ ఆయా దేశ ప్రజల ఊహాగానాల్లోని అంశాలుగా ఉండిపోయాయి. లెబనాన్‌లోని హిజ్‌బొల్లా లక్ష్యాలపై దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ బీరుట్ మీద కూడా దాడులకు తెగబడటం ఇరాన్ వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలోనే కాల్పుల విరమణ ఒప్పందంపై ఇరాన్ పాకిస్థాన్‌తో చర్చలు మానేసింది. ఈ అంశాలను ఇరాన్ వార్తా సంస్థలు ధృవీకరించాయి. అమెరికాతో కాల్పుల విరమణ అంశంలో లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగు తున్న పోరుకు ఏ మాత్రం సంబంధం లేదని ఇజ్రాయెల్ వాదిస్తోంది. ఎటువంటి రాజీ అయినా ఇజ్రాయెల్‌తో సంబంధమున్న అంశాలకూ వర్తిస్తుందని, ఇజ్రాయెల్ దాడులు కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనేనని ఇరాన్ మండిపడుతోంది. లెబనాన్ దక్షిణ ప్రాంతంపై ఇజ్రాయెల్ జరిపిన దాడులో 8 మంది చనిపోయారు. ఇరాన్,అమెరికాల మధ్య చర్చలతో తమ ప్రమేయమేమీ లేదన్నట్లు వ్యవహరిస్తున్న ఇజ్రాయెల్ తన యుద్ధతంత్రాన్ని ఆపే పరిస్థితిలో లేదు. ఇదే సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కి ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు మీద చిర్రెత్తుకొచ్చి మాట్లాడారు.తాను లేకుంటే నెతన్యాహు జైల్లో ఉండేవాడవని అన్యాపదేశంగా ట్రంప్ అనేసారు. ఏదీ తెగదు, నెతాన్యాహ్యు తెగనివ్వడు అనే ధోరణిలో మాట్లాడారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్‌కలిసి రావడం లేదంటూ ట్రంప్ అభ్యంతరకర భాషలో నేరుగా ఫోన్‌లోనే విరుచుకుపడ్డారు. నిజానికి అమెరికా ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందమేమీ కుదరలేదు. వారిద్దరి మధ్య చర్చలంటే ఒకరు వేలికేస్తే మరొకరు కాలికేస్తారు. అలాగే కాలికేసేది ఒకరైతే వేలికేసేది మరొకరు. అంతే తప్ప చర్చలు సజావుగా సాగనివ్వరు. ఒప్పందాన్ని ఓ కొలిక్కి రానీయరు. అన్న చందంగా సాగుతోంది. వీళ్ల చర్చలు స్థిరమైన శాంతి ఒప్పందానికి భరోసా ఇవ్వలేకపోతున్నాయి. మధ్యలో ఇజ్రాయిల్ చీకాకులు కొన్ని. వీటన్నిటితో ట్రంప్ సతమత మవుతున్నట్లు కనపడుతోంది. పరస్పర అవిశ్వాసం, చర్చల పురోగతి ప్రధాన అడ్డంకిగా మారింది. ఒకవైపు దౌత్యం, మరోవైపు సైనిక చర్చలు, ఒప్పందాల ఉల్లంఘనలతో చర్చలకు మార్గం సుగమమయ్యే పరిస్థితి కనపడుట లేదు. పరిస్థితులను సంక్లిష్టం చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధ మంటే ప్రపంచ దేశాలన్నిటినీ చమురు సంక్షోభంలో ముంచిన ఓ సైనిక ప్రక్రియలాగే కనపడుతోంది. యుద్ధం ముగిసినా ప్రపంచ జనాభా నెత్తిన ధరల పిడుగు ప్రభా వం నుంచి తప్పించలేరు. బిడ్డ చచ్చినా పురిటికంపు పోదన్న రీతిలో జనం యావత్తూ ఆర్థిక సమస్యలతో మునిగిపోయారన్నది జగద్విదితం. ఒకవేళ దీర్ఘకాలిక శాంతి ఒప్పందం కుదిరినా అంతర్జాతీయ చమురు మార్కెట్లు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రభావం నుంచి ఏ దేశమూ తప్పించుకోలేదు. అమెరికా ఆది నుంచీ చెప్పున్నట్లు ఈ యుద్ధం ఇరాన్ 'అణు కార్యక్రమం ఆపాలనే' అని అయితే ఈ పాటికే 'శాంతి రేఖలు' విలసిల్లేవి.

ప్రవర్తన అనేది తెల్లకాగితం లాంటిది. ఒక్కసారి దాని మీద మరక పడితే, మళ్లీ తెలుపు కావడం కష్టం.



బెంజిమెన్ ఫ్రాంక్లిన్

సమకాలికులు ఎప్పుడూ వ్యక్తి ప్రతిభ కన్నా, వ్యక్తినే ఎక్కువగా పొగుడుతారు. ఆ తర్వాత తరంవారే ప్రతిభను గౌరవిస్తారు.



కొల్లిన్

# బాల్యానికి స్వేచ్ఛతోనే చదువులకు పండుగ!

*ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తూనే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువుపట్ల అవగాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పిం చేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికిసంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధారపడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.*



రామ కిష్టయ్య సంగన భట్ల

ఇష్టం లేని పనిని వివిధ కారణాల వల్ల బలవంతంగా చేయిస్తూ శ్రమ దోపిడీకి గురి చేయడమే బానిసత్వం. పిల్లలతో బలవంతంగా పని చేయించుకోవడం, బలవంతపు పెళ్ళిళ్లు, ఇళ్ళల్లో వెట్టిచాకిరి, వ్యవసాయ కూలీలు, పిల్లలను అమ్మడం, ఇటుక బట్టీలు, బలవంతపు పడుపు వృత్తి, పిల్లల అక్రమ రవాణా లాంటి వివిధ రూపాలలో బానిసత్వం కనిపిస్తున్నది. భయపెట్టీ, హింసించి, మోసగించి, బెదరించి, వివిధ రకాలుగా శ్రమ దోపిడీ జరగడం అనునిత్యం జరుగుతున్నదే. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి జరిగితే తప్ప పరిష్కారం లేదని విజ్ఞుల భావన. ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులుగానే ఉండిపోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడిపడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగంలోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరిపోతున్నాయి. పాలబుగ్గల లేత వయ



సులో వారు కార్మికులుగా మారడం బాధాకరం.కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించకపోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించుకోవడం అపరాధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించరాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియమించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశించింది. 1959 నవంబర్ 20న బాలల హక్కుల ప్రకటనను ఐరాస సర్వసభ్య సభ రూపొందించిన సందర్భంగా బాలల దినోత్సవాన్ని ప్రపంచ మంతటా జరుపుకోవాలని నిర్ణయించారు. 1989లో పిల్లల హక్కులపై నవంబర్ 14న ఓ బిల్లును ఐరాస ఆమోదించింది. ఈ బిల్లును ఆమోదిస్తూ 191 దేశాలు సంతకాలు పెట్టాయి కూడా. బాలల హక్కుల సంబంధిత కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలిపోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య నేటికీ ఫలించని కలగానే మిగిలిపోతున్నది. ప్రపంచ బాలకార్మికుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా.దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాలలోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు.పాఠశాలలో నమోదుకాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆతర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తూనే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువుపట్ల అవగాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పిం చేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికిసంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధారపడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

# ఎల్‌నినో పట్ల రైతులకు అవగాహన అవసరం!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

తరతరాలుగా, భారత వ్యవసాయం రుతుపవనాలపై ఆధారపడి కొనసాగుతున్నది. వర్షాలు సకాలంలో కురిసి, రుతుపవనాలు సమానంగా విస్తరించినపుడు మాత్రమే పంటలు బాగా పండుతాయి. పర్యావరణ భూగోళంపై ఈ ఏడాది అతి బలమైన ఎల్‌నినో ఏర్పడవచ్చనే చేదు విషయాన్ని నివేదిక బహిర్గతం చేసింది. పసిఫిక్ మహా సముద్రంలో జలాలు సాధారణం కన్నా అధికంగా వేడెక్కడాన్ని 'ఎల్‌నినో' అని అంటారు. సాధారణం కన్న 2.5 డిగ్రీల ఎక్కువగా సముద్ర నీటి ఉష్ణోగ్రతలు పెరగడాన్ని సూపర్ ఎల్‌నినో అని పిలుస్తున్నారు. ఎల్‌నినో వల్ల జూన్ 2026 నుంచి వాతావరణ ప్రతికూల మార్పులు జరగవచ్చని, ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి అసాధారణ రుతుపవనాల గమనం జరుగుతుందని నివేదిక రూపంలో స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో గాలుల దిశ మారిపోయి ప్రతికూల వాతావరణ మార్పులకు ఆజ్యం పోయవచ్చని అంచనా వేశారు. మే మాసంలో ఏర్పడే ఎల్‌నినో ఆగష్టు నాటికి బలపడి సూపర్ ఎల్‌నినో ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో ప్రతికూల మార్పులు, సముద్ర తుఫాన్లు, కరవు కాటకాలు లాంటి దుష్ప్రభావాలు జరుగుతాయని గమనించాలి. ఎల్‌నినో ప్రభావం వల్లవర్షాభావం, సకాలంలో వర్షాలు పడకపోవడం, సుదీర్ఘ పొడిగాలులు వీయడం, వరి,పత్తి, వేరుశనగ లాంటి వర్షాధార పంటల దిగుబడులు భారీగా పడిపోవడం, తెగుళ్ల బెడద (రసం పీల్చే పేనుబంక, తెల్లదోమ, బూడిద తెగులు) పెరగడం, నీటి కొరత వల్ల చెరువులు,బావులు, చిత్తడి నేలలు ఎండిపోవడం లాంటి దుష్ప్రభావాలు జరిగే అవకాశం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావానికితట్టుకునే



విధంగా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.తక్కువ నీటితో పండే గోరుచుక్కుడు, మినుములు, కందులు, చిరు ధాన్యాలు లాంటి పంటలను ఎంచుకోవాలి. నేలలో తేమను సంరక్షించుకోవడానికి ఆకులతో కప్పడం(మల్చింగ్) లాంటి విధానం పాటించాలి. నేల సారానికి అనుగుణంగా ఎరువులు, సేంద్రియ పదార్థాలు వాడడం మంచిది. సస్య రక్షణలో భాగంగా తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలతో సకాలంలో పురుగుమందులు పిచికారీ చేయాలి. సూక్ష్మసేద్యం ద్వారా ఉద్యాన రైతులకు కొంత మేర ఉపశమనం లభించవచ్చు. ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం, యుద్ధాలతో యూరియా లాంటి ఎరువుల కొరత ఏర్పడనుందని గమనించాలి. రానున్నరోజుల్లో ఎల్‌నినో ప్రభావం పట్ల అవగామన పెంచుకొని రైతులు తగు పంటలపై దృష్టిని కేంద్రీకరించాలి. పంటల అవశేషాలను కాల్చడంతో భూసారం దెబ్బతినడం, దిగుబడులు తగ్గడం, ఎరువులు వేసినా తగిన ప్రయోజనం లభించకపోవడం లాంటి తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతాయని తెలుసుకోవాలి. ఇప్పటికే సూరన్న సుర్రుమంటున్నాడు. అకాల వర్షాలు అన్నదాత రోదనలకు ఆజ్యం పోస్తున్నాయి. చేతికి వచ్చిన పంట నేలపై వాలిపోయింది. పండ్లతోటల్లో కాయలు రాలుతున్నాయి. ఆరుగాలం కష్టపడిన రైతన్న కంట కన్నీటి వరదలు పారుతున్నాయి. అతివృష్టి, అనావృష్టి, అకాల వర్ష వడగళ్లతో హలధారి విలవిల్లాడుతున్నాడు. పుండు మీద కారం చల్లినట్లు రానున్న రోజుల్లో సూపర్ ఎల్‌నినో బలపడితే కరవు కరాళ నృత్యం చేయవచ్చు. ఆహార అభద్రత రాజ్యమేలవచ్చు. ఇలాంటి వాతావరణ ప్రతికూల మార్పులకు కారణాలను తెలుసుకొని, అరికట్టే ప్రయత్నాలు చేయనియెడల విశ్వమానవాళి సంక్షోభ సంకెళ్ల లో బంధించబడి హాహాకారాలతో ఆఖరి శ్వాస తీసుకోవచ్చు. ఈ పరిస్థితులను ఆలకించరు చేసుకొని రాబోయే కరవుల ను ఎదుర్కొనే చర్యలను నేటి నుండే మొదలు పెడదాం, రేపటి ఆరోగ్యకర వాతావరణానికి నేటి నుంచే హారతి పడదాం.

# ఫలించని సంస్కరణలతో పేదలు భూమికి దూరం!

బొల్లిముంతసాంబశివరావు

తెలంగాణ రాష్ట్రంలో 25లక్షల గ్రామీణ కుటుంబాలకు సాగు భూమి లేదని, వీరిలో దళిత కుటుంబాలు ఎక్కువని,వీరంతా కూలిపనులు చేసుకొంటున్నారని ధరణి కమిటీ రిపోర్టులో పేర్కొంది. ఈకుటుంబాలకు ప్రస్తుత ప్రభుత్వం భూములు పంపిణీ చేయటమే కాకుండా ఏటా 12వేల ఆర్థిక సహాయం అందించే ఆలోచన చేస్తున్నది. భూమికి, గ్రామీణ ప్రజలకు విడదీయరాని బంధం ఉంది. రైతుకు సమాజంలో హోదాని, గౌరవాన్ని ఇచ్చేది సేద్యపు భూమే. అంతటిప్రాధాన్యత ఉన్న భూమి కొద్దిమంది వ్యక్తుల వద్ద ఎక్కువగా పోగుపడి ఉంది. అత్యధిక మందిపేదలు భూమి కిదూరమయ్యారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో 65లక్షల మంది రైతులున్నారు. సేద్యపు భూమి కోటి52లక్షలుఉంది. 73శాతం మంది రైతులు 2.5ఎకరాలకన్నా తక్కువ భూమి కలిగి ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వ అధికార లెక్కల ప్రకారం లక్షలోపు జనాభా కలిగిఉన్న వారి వద్ద 14.97లక్షల ఎకరాల భూమి ఉంది. మూడు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులు 42.22 లక్షల మంది ఉంటే, వారి వద్ద 60.60 లక్షల ఎకరాల భూమి ఉంది. మూడు నుంచి ఐదుఎకరాల లోపు ఉన్న రైతులు 10.08 లక్షల మంది ఉండగా, వారి వద్ద 40లక్షల ఎకరాల భూమి ఉంది. ఐదునుంచి 10 ఎకరాలున్న వారు 4.65 లక్షల మంది రైతులుండగా, వారు 30.94 లక్షల ఎకరాలు కలిగి ఉన్నారు. 20ఎకరాల భూమి ఉన్న రైతులు 84.606 మంది ఉండగా, వారి వద్ద11.09 లక్షల ఎకరాల భూమిఉంది. 20ఎకరాలపైన ఉన్న భూకామందులు 14.46 వేల మంది ఉంటే వారి వద్ద 3.87 లక్షల ఎకరాల భూమి ఉంది. ఈగణాంకాలను గమనిస్తే భూస్వాముల, ధనిక, రైతుల వద్ద భూకేంద్రీకరణ ఎక్కువగా ఉందని, చిన్న, సన్నకారు రైతులు తక్కువ భూమి కలిగి ఉన్నారని, అసలు సెంటు భూమి లేని పేదలు 25 లక్షలమంది ఉన్నారని వెల్లడౌతుంది. దేశంలో బ్రిటిష్ వలస పాలన కాలంలోనే భూమికోసం అనేక పోరాటాలుజరిగాయి. 10లక్షల ఎకరాల భూములు స్వాధీనం చేసుకుని పంపిణీ చేసుకున్నారు. వేలాది గ్రామాల్లో ప్రజాపాలన ఏర్పడింది. ఈపోరాటంలో 4 వేలమంది కమ్యూనిస్టు పార్టీ వారు ప్రాణాలు కోల్పోయారు.తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రజల ప్రధాన సమస్య అయిన భూమి సమస్యను ముందుకు తెచ్చింది. భూపోరాటాలకు భయపడిన నెహ్రూ ప్రభుత్వం 1947 నవంబర్ 28న జమీందారీ విధానం రద్దు బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టింది. 1948లో వ్యవసాయ సంస్కరణలపై కుమారప్ప కమిటీని వేసింది. ఈ కమిటీ 1949లో తన నివేదిక అందచేసింది. అందులో కొన్ని సూచనలు చేసింది. ఈ కమిటీ సూచనల మేరకు 1949లోహైద్రాబాద్ జాగీర్దార్ల రద్దుచట్టాన్నిచేసింది. 1950లో సంస్థానాలను రద్దుచేసి ఒక్కో సంస్థానానికి 18కోట్లు భరణంగా ఇచ్చింది. వీటికింద లక్షలాది ఎకరాల భూములున్నాయి. ఈ భూములు పేదలకు దక్కలేదు. రైతులపేరుతో దలారులుగా ఉన్నవారు భూములు పొంది భూస్వాములుగా మారారు. కుమారప్ప కమిటీ సూచనలకు అనుగుణంగా వ్యవసాయం చేయని భూయజమానుల దోపిడీ నుండి కౌలుదారులకు రక్షణ కల్పించటం పేరుతో 1950లో తెలంగాణ కౌలుదారీ చట్టం చేశారు. వివిధ చారిటబుల్



మతసంబంధమైన ఈనాం భూములకు (వీటికింద లక్షల ఎకరాల భూమి ఉంది) తప్ప ఈచట్టం అన్నిరకాల భూములకు వర్తిస్తుంది.1933 నుంచి 1943 మధ్యకాలంలో వరుసగా ఆరుసంవత్సరాలు కౌలుకు చేస్తున్న వారిని రక్షిత కౌలుదారులుగా చట్టం గుర్తించింది. రక్షిత కౌలుదారునికి సేద్య అవసరాల కోసం భూమిని బ్యాంకుల తనకా పెట్టే హక్కు కల్పించబడింది.నిబంధన ప్రకారం కౌలుచెల్లించినంత కాలం కౌలుదారుగా కొనసాగుతాడు. కౌలుచెల్లించకపోతే కౌలు ఒప్పందం రద్దు అవుతుంది. భూయజమాని సొంత సేద్యం చేసుకునేందుకు చట్టంలో హక్కు కల్పించారు. ఈ హక్కుతో సొంత సేద్యం పేరుతో భూకామందులు కౌలుదారులను భూముల నుండి తొలగించారు. ఆచరణలో కౌలుదారీ చట్టం అలంకారప్రాయంగా మారింది. ఎటువంటి హక్కులు లేకుండా కౌలుదారులు అధిక కౌలుతో నేడు కౌలుసేద్యం చేస్తున్నారు. భూకేంద్రీకరణను, ఆర్థిక, సాంఘిక, అసమానతలను తగ్గించటానికని భూకమతాలపై గరిష్ట పరిమితి విధించారు. దీన్ని అమలు చేయటానికి హైద్రాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీ నియమించబడింది. ఈకమిటీ భూకమతాల గరిష్టపరిమితికి కొన్ని సూచనలు చేసింది. వ్యవసాయదారులకు నెలకు రూ.150 వచ్చే విధంగా వివిధ ప్రాంతాల్లోని భూములను ఆర్థిక కమతంగా గుర్తించాలి.రెండు ఎకరాల మాగాణి లేదా 15 ఎకరాల మెట్ట భూమిని బేసిక్ ఆధారంగా కమతం గరిష్ఠ పరిమితిని నిర్ణయించాలి.గరిష్ఠ పరిమాణం ఆర్థిక కమతానికి 5రెట్లు ఉండాలని సూచించింది. కమిటీ సూచనల ప్రకారం మధ్య వర్తుల తొలగింపు చట్టం, జమీందార్ల, జాగీద్దార్లను తొలగించటం వరకే పరిమితమైంది. దున్నేవానికే భూమి అన్న నినాదం వదిలివేయబడింది. తెలంగాణ రైతాంగ పోరాటం తర్వాత నక్సల్బరీ గిరిజన రైతాంగ పోరాటం, శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం మరలా భూసమస్యను ఎజెండాలోకి తెచ్చాయి. వ్యవసాయ కూలీల్లో, పేదరైతుల్లో భూమి సాధించుకోవాలనే పట్టుదల రోజురోజుకి పెరిగింది. ఈవాస్తవాన్ని గ్రహించిన ఆనాటి ఇందిరాప్రభుత్వం, భూపోరాటాలను దారిమళ్లించేందుకు పూనుకుంది.1970లోముఖ్యమంత్రుల సమావేశంలో మనరాజకీయ వ్యవస్థ రక్షించబడాలంటే భూసంస్కరణల చట్టం చేయక తప్పదని ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ చెప్పింది. భూపరిమితికి ఐదుగురు సభ్యుల కుటుంబాన్ని యూనిట్ తీసుకోవాలి. సంవత్సరానికి రెండు పంటలు పండే భూమి 10 నుంచి 18ఎకరాలు, మెట్టభూమి27ఎకరాలు గరిష్ట పరిమితిగా, కాఫీ, తేయాకు, రబ్బరు,కోకో మొద్కలైన తోటలు పండించే తోటలకు చట్టం నుంచి మినహాయింపు ఇచ్చి, నూతన సవరణలతో భూసంస్కరణ చట్టాలను డిసెంబర్ 31,1972 నాటికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలని ఆదేశించింది. కేంద్రం ప్రభుత్వ సూచనల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1972మేలో భూపరిమితి కుదిస్తూ ఆర్డినెన్ విడుదల చేసింది. దానిలో కుటుంబానికి 10 ఎకరాల మాగాణి, 25 ఎకరాల మెట్టభూమిని భూపరిమితిగా విధించి 1973 జనవరిలో శాసనసభ ఆమోదంపొంది భూసంస్కరణల చట్టంగా మారినా 1975 జనవరిలోగాని ఆచరణలోకి రాలేదు. ఈ చట్టం ద్వారా మొదట 18 లక్షల ఎకరాల మిగులు భూమి ఉందని ప్రకటించి దాన్ని కదిస్తూ చివరికి 7.8 లక్షల ఎకరాలుగా తేల్చి అందులో 6.47 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని 5.82లక్షల ఎకరాలను 4 లక్షల,79 వేలమందికి పంపిణీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది.ఇందులో కూడా చట్టానికి ముందే పేదలు సాగుచేసుకుంటున్న భూములు ,సేద్యానికి ఉపయోగపడని భూములే ఎక్కువగా ఉన్నాయి. చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకుని భూస్వాములు చట్టపరిధిలోకి రాకుండా కాపాడుకున్నారు.జాతీయ స్థాయిలో ఒకేసీలింగ్విధానం రూపొందించిన తర్వాత 67 లక్షలుగా, మిగులు భూమిగా ప్రకటించగా, ప్రభుత్వ విధానాలు, పాలసీలపైపరిశోధన, క్రమశిక్షణ నిమిత్తం ఏర్పాటైనలఅకాడమి దేశంమొత్తంలో మిగులు భూమి 5 కోట్ల 20 లక్షల ఎకరాలు ఉంటుందని అంచనా వేసింది. భూ సంస్కరణల చట్టం అమలు జరగకపోవటం వల్ల భూకామందుల వద్ద లక్షలాది ఎకరాల మిగులు భూమి ఉంది.

# ప్రజావాక్కు

## రీల్స్‌కు బానిస కావొద్దు

నేడు చిన్నాపెద్దా అనేతేడా లేకుండా చాలామంది రీల్స్ కు బానిసలుగా మారుతున్నారు. చేతిలో ఫోన్ ఉంటే చాలు, గంటల తరబడి రీల్స్ చూస్తూ కాలం గడిపేస్తున్నారు. కొద్దిసేపు చూడాలని ప్రారంభించిన రీల్స్ గంటల తరబడి సమయాన్ని వృథా చేస్తాయి. దీనివల్ల చదువు, పని, కుటుంబానికి కేటాయించాల్సిన సమయం తగ్గిపోతుంది. అంతేకాకుండా ఏకాగ్రత తగ్గి, సృజనాత్మక ఆలోచనలు కూడా మందగిస్తాయి. సమయం అమూల్యమైనది. కాలాన్ని వృథా చేసే రీల్స్ కంటే, భవిష్యత్తును నిర్మించే పనులకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. రీల్స్ కు బానిస కాకండి, మీ లక్ష్యాలకు మాత్రమే బానిసలుగా మారండి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## ఆర్థిక వ్యవస్థకు పునాది

పర్యాటక రంగంకేవలం వినోదసాధనం మాత్రమే కాదు, అది ఆర్థికవ్యవస్థకు ఊపిరిపోసే శక్తివంతమైన యంత్రం. భారతదేశం పర్వతాలు,అరణ్యాలు, తీరప్రాంతాలు, చారిత్రక కట్టడాల వంటి అపారమైన వైవిధ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ,మౌలిక సదుపాయాల లోపం, కనెక్టివిటీ సమస్యలవల్ల పర్యాటక రంగం తన పూర్తిసామర్థ్యాన్ని అందుకోలేకపోతోంది. కేవలం హోటళ్లు నిర్మించడమే కాకుండా, మెరుగైన రవాణా, పారిశుద్ధం,భద్రత డిజిటల్ మార్కెటింగ్ సదుపాయాలను కల్పించినప్పుడే అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించగలం. ముఖ్యంగా పర్యావరణ సున్నిత ప్రాంతాల్లో స్థిరమైన టూరిజం నమూనాలను అనుసరించడం అనివార్యం. అభివృద్ధి పేరుతో ప్రకృతిని దెబ్బతీస్తే అది దీర్ఘకాలిక నష్టానికి దారితీస్తుంది.

- కె.రామారావు, నల్గొండజిల్లా

## గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లోరోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదే విధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగి వాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు ప్రమాదకరంగా దెబ్బతిన్నరోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేప ట్టాలి. కనీసం గుంతలలో మట్టినైనా నింపి వాహన దారులు ప్రమాదాలకు గురికాకుండా తగుచర్యలు తీసుకోవాలి. గ్రామాల్లోనే కాకుండా నగరాల్లో కూడా రోడ్లను బాగు చేయాలి.

-టి. యోగేందర్, నల్గొండ

## పెరుగుతున్న డిజిటల్ మోసాలు

డిజిటల్ యుగంలోసాంకేతికత జీవితం సులభతరం చేస్తున్న కొద్దీ, అదే సాంకేతికతను ఆయుధంగా మలచుకుని మోసాలకు పాల్పడేశక్తులు కూడా పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత ప్రమాదకరంగా మారుతున్న సైబర్ నేరాలలో కృత్రిమ మేధ ఆధారిత నకిలీ రూపకల్పన మోసాలు ముఖ్యమైనవి. మనిషి ముఖం,స్వరం, మాటతీరు, భావప్రకటనలను అసలైనట్లే అనుకరించి నకిలీ దృశ్యాలు, ధ్వనులు సృష్టించడం ఇప్పుడు నేరగాళ్లకు సులభమైంది. వినోదం, పరిశోధన కోసం ఉపయోగించాల్సిన ఈ సాంకేతికత, ప్రజల నమ్మకాన్ని దోచుకునే సాధనంగా మారడం ఆందోళనకరం. మాట్లాడని మాటలను మాట్లాడినట్లుగా, చేయని పనులను చేసినట్లుగా చూపించే నకిలీ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖులు, నాయకులు, ఉన్నతాధికారుల స్వరాలను అనుకరించి అత్యవసర పరిస్థితి పేరిట డబ్బులు కోరడం వంటి మోసాలు సాధారణమవుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పేదలకు వరం

నేడు ఉరుకుల పరుగులజీవితంలో ఉదయం నుండి సాయంత్రం వరకు కుటుంబ భవిష్యత్ జీవితం దృష్ట్యా సరిగ్గా ఆహారం తీసుకోకుండా, ఉద్యోగానికి ఆలస్యం అవుతుందనే కారణాలతోగడిపే ఉద్యోగులకు చిరువ్యాపారులకు ఇందిరమ్మ క్యాంటీన్, అన్నపూర్ణ సెంటర్స్ సదరు పేదవాడి ఆకలి తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇవి నగరంలోనే కాకుండా గ్రామాలకు వ్యాప్తి చెందితే ప్రజలకు మరింత మేలు చేసినవాళ్లవుతారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## బిసిల అభ్యున్నతికి కృషి చేయాలి

బిసి కుటుంబాలు చాలా వరకు దిగువ స్థాయి ఆదాయంలోనే ఉంటారు. వృత్తులు బాగా పడిపోయిన తర్వాత కుటుంబ ఆదాయం బాగా తగ్గినది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కొన్ని పథకాలు పెడుతున్న కూడా బిసిలు నిరుద్యోగులుగా ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ఏ మాత్రం రిజర్వేషన్ ఇచ్చినాఅది సమంజసమే. పోటీ పరీక్షల ఎంపికలో వీరికి పరీక్ష ఫీజురాయితీ, హాజరు అయ్యేందుకు ఉచిత ట్రైన్ రిజర్వేషన్ ఇవ్వడం న్యాయమైన కోరిక. ప్రస్తుతం ప్రభుత్వం నడుపుతున్న కోచింగ్ కేంద్రాలలో కూడా నామమాత్రపు ఫీజు ఉంటే ఎంతో మంది పోటీలో తప్పక నెగ్గుతారు.

- బి.మేఘనాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# రూ.10 వేల కోట్లతో ఇంధన ధరల స్థిరీకరణ నిధి

- విమానయాన సంస్థలకు ఆర్థిక ప్యాకేజీ - కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం
- ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో కాలుష్య నివారణకు రూ.9,585 కోట్ల కొత్త పథకం - రూ.8300 కోట్లతో రామేశ్వరం- పరదీప్ కోస్టల్ హైవే ప్రాజెక్టుకు ఆమోదం - తెలంగాణలో రూ.7,597.16 కోట్లతో 190 కి.మీ. హైవే ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ :కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్



**న్యూఢిల్లీ, జూన్ 3:** పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయ విపణిలో పెరుగుతున్న ఇంధన ధరలతో భారత్‌పై ఆ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉపశమన చర్యలకు శ్రీకారం చుట్టింది. రూ.10 వేల కోట్లతో 'ఇంధన ధరల స్థిరీకరణ నిధి' ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చించి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ నిధి ఏర్పాటుకు విమానయాన రంగానికి ఒక ప్రధాన ఉపశమన చర్యగా అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కొనసాగుతున్న పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన ధరల వల్ల ప్రభావితమైన షెడ్యూల్డ్ భారతీయ విమానయాన సంస్థల కోసం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలను స్థిరీకరించడంలో సహాయపడటానికి బడ్జెట్ మద్దతు ప్యాకేజీని ఆమోదించినట్లు వివరించారు. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ద్వారా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసిలకు) వడ్డీ లేని అడ్వాన్సుల రూపంలో ఈ సహాయం అందించబడుతుంది. ఈ నిధి, దేశీయ, అంతర్జాతీయ విమాన కనెక్టివిటీకి అంతరాయం కలగకుండా చూస్తూనే, అపూర్వమైన ఇంధన ధరల అస్థిరత నుండి విమానయాన సంస్థలను కాపాడటాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా పాత బస్సులు, ట్రక్కుల స్థానంలో కొత్తవి తీసుకు రావడానికి రూ.9,585 కోట్లతో ప్రతిపాదించిన కొత్త పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. రెండేళ్లలో ఈ పథకం కింద పూర్తిగా బి-6 లేదా ఇవి వాహనాలను తీసుకు రావడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే, తమిళనాడులోని రామేశ్వరం నుంచి ఒడిశాలోని పరదీప్ వరకు 160.18 కిలోమీటర్ల కోస్టల్ హైవే ప్రాజెక్టును రూ.8300.79 కోట్లతో రెండు దశల్లో చేపట్టాలనే ప్రతిపాదలకు కేంద్ర కేబినెట్ అనుమతిచ్చింది. పూర్తిగా హైబ్రిడ్ అన్యుటి మోడల్ (హెచ్ఎఎం)లో నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇదిలా ఉండగా, తెలంగాణలో ఎన్‌హెచ్-63లో ఆర్మూర్ - జగిత్యాల - మంచిర్యాల సెక్షన్, ఎన్‌హెచ్-563లో జగిత్యాల - కరీంనగర్ మొత్తం 190 కి.మీ. నాలుగు వరుసలతో హైబ్రిడ్ అన్యుటీ మోడల్‌(హెచ్ఎఎం)లో రూ.7,597.16 కోట్లతో విస్తరణ పనులకు ఎన్‌హెచ్ఎఐ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మధ్యప్రదేశ్‌లో ఎన్‌హెచ్ 347బిలో హివార్‌ఖేడి - రోష్ని -ఆషాపూర్- రధీ మధ్య 125.01 కి.మీ, దేశ్‌గావ్ –జూల్వానియా మధ్య 108.65 కి.మీ మేర నాలుగు వరుసల రహదారి విస్తరణ కోసం రూ.4,415.60 కోట్ల ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అలాగే బీహార్‌లో రూ.3, 936.05 కోట్లతో ఎన్‌హెచ్-31, ఎన్‌హెచ్-231 రహదారి విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వివరించారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధించవచ్చు

## తమిళనాడు, కర్ణాటక చట్టాలను సమర్థించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జూన్ 3:** ఆటలపై ఆన్‌లైన్ బెట్టింగ్, పందెం కాయడాన్ని నిషేధించే తమిళనాడు, కర్ణాటక చట్టాల రాజ్యాంగబద్ధతను సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఆట నైపుణ్యానికి సంబంధించినది అయినప్పటికీ, బెట్టింగ్‌పై చట్టాలు చేసేందుకు రాష్ట్ర శాసనసభలకు అధికారం ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లోని రెండవ జాబితాలోని 34వ అంశం ప్రకారం, "బెట్టింగ్, జూదం"పై చట్టాలు చేసేందుకు రాష్ట్రాలకు అధికారం ఉందని, దీని కింద నైపుణ్యంతో కూడిన ఆటలపై బెట్టింగ్‌ను నియంత్రించే, నిషేధించే అధికారం రాష్ట్రాలకు ఉందని జస్టిస్ జె.బి. పర్దీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నైపుణ్యపు ఆటలకు లభించే రాజ్యాంగ రక్షణ, అటువంటి ఆటలపై నిర్వహించే పందెం కాయడానికి లేదా బెట్టింగ్‌కు వర్తించదని కోర్టు స్పష్టం చేసింది. నైపుణ్యంతో కూడిన ఆటలు 'జూదం' అనే పదం పరిధిలోకి రాకపోవచ్చు అనేది నిజమే అయినప్పటికీ, నైపుణ్యంతో కూడిన ఆటలపై 'పందెం' వేయడం కూడా రాష్ట్ర శాసనసభ చట్టసభ పరిధిలోకి రాదని చెప్పడం సరికాదు" అని కోర్టు పేర్కొంది. పందెం, జూదంతో కూడిన వ్యాపారం చేయడానికి ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు ఆర్టికల్ 19(1)(జి) కింద ప్రాథమిక హక్కు లేదని కూడా కోర్టు స్పష్టం చేసింది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొన్నది. ఆన్‌లైన్ వ్యసనాలవల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది. సమాజ హితం, శాంతిభద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది.

# ముఖ్యమంత్రిగా డికె పదవీ ప్రమాణం

## ఆయనతోపాటే 13 మంది సీనియర్ ఎమ్మెల్యేలు కేబినెట్‌లోకి

## యతీంద్ర, యుటిఖాదర్‌లకు కూడా ఛాన్స్



**బెంగళూరు, జూన్ 3:** కర్ణాటకలో నెలకొన్న కాంగ్రెస్ సంక్షోభానికి తెరపడింది. ముఖ్యమంత్రిగా 64 ఏళ్ల దొడ్డలహళ్లి కెంపెగౌడ శివకుమార్ 18వ ముఖ్యమంత్రిగా బుధవారం లోక్‌భవన్‌లోజరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారంచేసారు. రాజ్యాంగం పుస్తకాన్ని చేతబట్టి ఆయన ప్రమాణ పత్రాన్ని చదివారు. అంతకుముందు వేదికపైనుంచే ఆయన ఆహూతులందరికీ సాష్టాంగప్రణామం చేయడం కాంగ్రెస్‌నేతలను ఆకర్షించింది. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యే అయిన శివకుమార్ ముఖ్యమంత్రిగాను, డిప్యూటి సిఎంగా జికె పరమేశ్వరలు ప్రమాణస్వీకారంచేసారు. మరో 13 మంది సీనియర్ ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులగా ప్రమాణంచేసారు. లోక్‌భవన్‌లోని గ్లాస్ హౌస్‌లో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లోత్ వీరితో ప్రమాణంచేయించారు. సీఎంగా శివకుమార్ వీరగంగాధర అజ్జయ్యపేరును పఠించి ప్రమాణంచేసారు. అంతకుముందు అజ్జయ్యకు పూలతో నివాళి అర్పించారు. మంత్రులుగా సిద్ధరామయ్య తనయుడు యత్రీంద్ర, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే,కేహెచ్ మునియప్ప, కె.జె.జార్జ్, ఎంబీ పాటిల్, సతీశ్ జర్కిహోళి, రామలింగారెడ్డి, కృష్ణబైరె గౌడ, మాజీ స్పీకర్ యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌తో గవర్నర్ ప్రమాణం చేయించారు. సాధారణంగా సీఎం ప్రమాణ స్వీకార వేదిక ద్వారాలు, కార్యాలయంలోని ఆసనాలన్నీ జ్యోతిషశాస్త్ర ప్రకారమే మార్చడ విశేషం. ఏఐసీసీ నుంచి విశిష్ట అతిథులు, రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ప్రత్యేక అతిథులుగా పలు రంగాల ప్రముఖులను గౌరవ అతిథులుగా ఆహ్వానించారు. మొత్తం 1100 మందికి లోక్‌భవన్ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి 3 వేల మంది పోలీసులతో భద్రత కల్పించారు. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి, అధికారం చేపట్టింది. ఆ సమయంలోనే సీఎం పదవి కోసం డీకే తీవ్రంగా ప్రయత్నించారు. సీనియర్ నేత సిద్ధరామయ్యకు అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. రెండున్నరేళ్ల తర్వాత అవకాశం కల్పిస్తామని అప్పట్లో హైకమాండ్ మాట ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. గతేడాది నవంబరుతో సగం కాలం పూర్తికాగా నాయకత్వ మార్పుపై తీవ్ర చర్చ జరిగింది. ఆ సంక్షోభాన్ని నివారించిన కాంగ్రెస్ సిద్ధరామయ్యను ఒప్పించి రాజీనామా చేయించారు.

# మమతా బెనర్జీకి షాక్.. 58 మంది ఎమ్మెల్యేల తిరుగుబాటు..

**కోల్‌కత్తా,జూన్ 3:** అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీకి షాక్ తగిలింది. 58 మంది ఎమ్మెల్యేలు పార్టీపై తిరుగుబాటు చేశారు. వారంతా కలిసి ఏకంగా అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ సమర్పించారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన రితబ్రతా బెనర్జీని తమ పార్టీ తరఫున అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించాలని స్పీకర్‌ను కోరారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం వీరంతా ప్రత్యేక బస్సుల్లో బెంగాల్ అసెంబ్లీకి చేరుకున్నారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలకు రితబ్రతా బెనర్జీ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం టీఎంసీలో 60 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరిలో 58 మంది ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నేతగా రితబ్రత పేరు సూచిస్తూ మద్దతు నిలిచారు. ఆయన చెప్పినట్లు పార్టీపై 60 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేస్తే మమత పార్టీలో 20 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మిగులుతారు. ఈ అంశంపై ఇప్పటివరకు మమతా బెనర్జీకానీ, టీఎంసీ అగ్రనాయకత్వం కానీ స్పందించలేదు. మరోవైపు టీఎంసీ అగ్రనేత అభిషేక్ కల్యాణ్ బెనర్జీ తాజాగా ఎక్స్‌లో స్పందించారు. తన పార్టీ తరఫున అసెంబ్లీలో హోదాలకు సంబంధించి కీలక ప్రతిపాదనల్ని స్పీకర్‌కు పంపించారు. శోభన్‌దేవ్ ఛట్టోపాధ్యాయను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని కోరారు. కానీ, ఇప్పుడు అత్యధిక శాతం ఎమ్మెల్యేలు రితబ్రతకు మద్దతు పలకడంతో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి. రితబ్రతనే ప్రతిపక్ష నేతగా గుర్తిస్తే మమత ఆధ్వర్యంలోని టీంఎసీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. ఇటీవలే రితబ్రతతోపాటు సందీపన్ సాహాను కూడా టీఎంసీ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. పార్టీ అగ్రనాయకత్వం తమ సంతకాలను ఫోర్జరీ చేసిందని వీరు ఫిర్యాదు చేయడంతో టీఎంసీ వీరిని సస్పెండ్ చేసింది.

## పార్టీలోని అన్ని కమిటీలను రద్దుచేసిన టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ



**కోల్‌కత్తా,జూన్ 3:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మాజీ సీఎం మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పార్టీ ఆవిర్భావం తర్వాత టీఎంసీకి ఇటువంటి గడ్డు పరిస్థితి ఎదురుకావడం ఇదే మొదటిసారి. అంతర్గత సంక్షోభం, భారీ తిరుగుబాటు నేపథ్యంలో అధినేత్రి మమతా బెనర్జీ బుధవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. టీఎంసీ రాష్ట్ర కమిటీతో పాటు అనుబంధ సంఘాలన్నింటినీ తక్షణమే రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ అన్ని కమిటీలు, అలాగే దాని అనుబంధ సంస్థలన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించడం జరిగిందని తన అధికారిక సోషల్‌మీడియా ఖాతాలో టీఎంసీ పోస్ట్ పెట్టింది. టీఎంసీ నుంచి ఎన్నికైన కనీసం 58 మంది ఎమ్మెల్యేలు అధినేత్రి నిర్ణయానికి వ్యతిరేకంగా రీతబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్న గంటలోపే ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడారనే ఆరోపణలపై టీఎంసీ ఎమ్మెల్యేలు రీతబ్రత బెనర్జీ, సాందీపన్ సాహాలను మమతా బెనర్జీ సోమవారం పార్టీ నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే. పార్టీ నుంచి సస్పెండ్ గురయ్యేంత వరకు తృణమూల్ ట్రేడ్ యూనియన్ విభాగానికి రీతబ్రత నాయకత్వం వహించారు. పదిహేనేళ్ల పాటు బెంగాల్‌ను పాలించి టీఎంసీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత శరవేగంగా కుప్పకూలుతోంది. ఆ పార్టీ నాయకులలో చాలామంది కీలక సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. మరోవైపు, జిల్లా పరిషత్‌లు, మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలలోని ఎన్నికైన ప్రజాప్రతినిధులలో చాలామంది సామూహికంగా రాజీనామా చేయడం లేదా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులలో అరెస్టు అయ్యారు. ఆత్మపరిశీలన చేసుకుని, సంస్థను కొత్తగా పునర్నిర్మిస్తామని తృణమూల్ తెలిపింది. "పార్టీ ప్రతి స్థాయిలో సమగ్రమైన ఆత్మపరిశీలన, పనితీరు సమీక్ష, సంస్థాగత మదింపు ప్రక్రియను చేపడుతుంది ఈ ప్రక్రియ ఫలితాల ఆధారంగా సంస్థాగతంగా అన్ని విభాగాలను పునర్నిర్మించి, తగిన సమయంలో ప్రకటన చేస్తామన్నారు.

# దేశంలో భారీ కుట్రలకు తెరలేపిన దావూద్ గ్యాంగ్

**ముంబయి, జూన్ 3:** దేశంలో లక్ష్యనిర్దేశిత ప్రాంతాల్లో దాడులకోసం దేశీయంగా యువతను రిక్రూట్ చేసుకుంటున్నట్లు దావూద్ గ్యాంగ్ గుట్టును పోలీసులు ఛేదించారు. ఢిల్లీ స్పెషల్ పోలీసులు, మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఈ సమాచారం బయటకు వచ్చింది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ ఐఎస్ఐ, అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం గ్యాగ్ కలిసి భారత వ్యతిరేక కుట్రలకు తెరలేపాయి. దేశంలోని యువతను డబ్బు ఆశ చూపి గ్యాంగ్‌లో చేర్చుకుంటున్నట్లు వెల్లడైంది. ఇటీవల ఢిల్లీ పోలీసులు, మహారాష్ట్ర ఏటీఎస్ కలిసి ముంబై సమీపంలోని భయందర్ ప్రాంతంలో 26 ఏళ్ల హుజైఫా ఫారూక్ అహ్మద్ హష్మి అనే వ్యక్తిని అరెస్టు చేశాయి. అతడిని విచారించగా సంచలన విషయాలు బయటపడ్డాయి. ఈ విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం పాకిస్తాన్‌లోని ఐఎస్ఐ, ముంబైకి చెందిన దావూద్ గ్యాంగ్ కలిసి దేశంలోని కొందరు యువతను తమ గ్యాంగ్‌లో చేర్చుకుంటున్నాయి. వారికి డబ్బును ఆశగా చూపుతున్నాయి. అనంతరం అండర్‌వరల్డ్ సిండికేట్‌లో చేర్చుకుని రకరకాల నేరాల్లో భాగస్వాములుగా చేస్తున్నాయి. వీరంతా కలిసి ఢిల్లీలోని ఒక కీలక నేతను లక్ష్యంగా ఎంచుకున్నారు. అయితే, ఆ నేత ఎవరు అనేది ఇంకా వెల్లడించలేదు. హష్మికి, పాకిస్తాన్‌కు చెందిన యవార్ ఖాన్‌తో సంబంధాలున్నాయి. హష్మికి యవార్ ఖాన్ ఒక కాంటాక్ట్ ఇచ్చాడు. యవార్ హష్మితోపాటు కుర్లాకు చెందిన సాజిద్, ముంబ్రాకు చెందిన తౌఖిర్‌లను గ్యాంగ్‌గా ఏర్పాటు చేసి, ఒక ఢిల్లీ నేతను టార్గెట్‌గా ఇచ్చారు.

# నేనే సుస్మితపై ఆధారపడేవాడిని!

## సేన్ గోల్డ్ డిగ్గర్ అన్న వ్యాఖ్యలకు లలిత్‌మోడీ కౌంటర్

**లండన్, జూన్ 3:** మాజీ విశ్వసుందరి సుస్మితా సేన్‌తో తన గత బంధం గురించి ప్రముఖ వ్యాపారవేత్త లలిత్ మోదీ చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సుస్మితను గోల్డ్ డిగ్గర్ (డబ్బు కోసం ఆశపడే వ్యక్తి) అని విమర్శించిన వారికి గట్టి సమాధానం ఇస్తూ, అసలు తానే ఆమెపై ఆధారపడిన ప్రియుడిలా ఉండేవాడినని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఇంటర్వ్యూ వైరల్ అయిన తర్వాత సుస్మితా సేన్ చేసిన మొదటి సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు మరింత చర్చనీయాంశంగా మారింది. ఇటీవల హ్యూమన్స్ ఆఫ్ బాంబేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో లలిత్ మోదీ మాట్లాడుతూ సుస్మిత చాలా అందమైన, బాగా సంపాదించుకున్న మహిళ. ఈ గ్రహం మీద నేను చూసిన ఎవరికన్నా ఆమె దగ్గరే ఎక్కువ వజ్రాలున్నాయి. అవన్నీ ఆమె స్వయంగా సంపాదించుకున్నవే. ఒకానొక సమయంలో నేను ఆమెతో బయటకు వెళ్లినప్పుడు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం రాలేదు. అన్నీ ఆమెనే చూసుకునేది. నేను ఆమెపై ఆధారపడిన ప్రియుడిలా ఉండేవాడిని. ఆమె అద్భుతమైన మహిళ అని వివరించారు.

# ఫలించిన వ్యూహం..

## విపక్షనేతగా రెబెల్ నేత రితబ్రత బెనర్జీ

### ఆమోదించిన స్పీకర్ రతీంద్రనాథ్ బోస్

### చీఫ్‌విప్, విప్ , డిప్యూటీల నియామకానికీ ఓకే!



**కోల్‌కత్తా,జూన్ 3:** పశ్చిమబెంగాల్ టిఎంసిలో రోజురోజుకూ తిరుగుబాటు పెరుగుతోంది. తాజాగా 58 ఎమ్మెల్యేలు రాష్ట్ర స్పీకర్ రతీంద్రనాద్‌బోస్‌కు లేఖ ఇచ్చారు. వీటిని వెంటనే స్పీకర్ ఆమోదించడంతో టిఎంసి రెబెల్ ఎమ్మెల్యేల గ్రూప్ మరింత దూకుడు పెంచింది. రితబ్రత బెనర్జీ ఆధ్వర్యంలో 58 మంది ఎమ్మెల్యేలు తాము శాసనసభా పక్ష నేతగా రితబ్రత బెనర్జీనే ఎన్నుకున్నట్లు లేఖ ఇవ్వడంతో ఆగ్రూపు నేతగా రితబ్రత ఎన్నికయ్యారు. స్పీకర్‌ను కలిసిన అనంతరం రెబెల్‌నేత మాట్లాడుతూ తమకు 58 మంది ఎమ్మెల్యేలు మద్దతు ఉందని, మేమంతా సమిష్టిగా స్పీకర్‌ను కలిసి లేఖ ఇచ్చామని వెల్లడించారు. అలాగే శాసనసభలో విపక్షనేతగా బందోపాధ్యాయ్‌ను ఎన్నుకున్నట్లు కూడా తెలిపారు. అంతకుముందు పార్టీ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు, ఎంపి అభిషేక్ బెనర్జీ స్పీకర్‌కు లేఖరాస్తూ శోభన్‌దేవ్ ఛటోపాధ్యాయ్‌ను శానసభలో విపక్ష నేతగా ఎన్నుకున్నట్లు లేఖ ఇచ్చారు. అయితేఈ ప్రతిపాదనను స్పీకర్ ఆమోదించలేదు. అనేకమంది టిఎంసి ఎమ్మెల్యేల సంతకాలను ఫోర్జరీచేసారన్న ఆరోపణలు, ఫిర్యాదులు స్పీకర్‌కు రావడంతో అభిషేక్ లేఖను తిరస్కరించారు. ఈపరిణామాలిలా ఉంటే కోల్‌కత్తామేయర్ టిఎంసి సీనియర్ నాయకుడు ఫిర్హాద్ హాకీమ్‌కూడా తన పదవికి రాజీనామాచేసారు. అంతకుముందే మమతాను తాను రాజీనామాచేస్తానని కోరినట్లు వినికిడి. బిజెపి ప్రభుత్వంలో బాద్యతలునిర్వహించడం కష్టమేనని తాను తప్పుకుంటానని చెప్పినట్లు సమాచారం. పదేపదే విజ్ఞప్తులుచేయడంతో మమతా బెనర్జీ కూడా పదవినుంచి దిగిపోయేందుకు సుముఖత వ్యక్తంచేసారని ఎమ్మెల్యే కునాల్‌ఘోష్ తెలిపారు. ఇదిలా ఉంటే రితబ్రత బెనర్జీ పార్టీ చీఫ్ విప్‌గా జావేద్ అహ్మద్‌కాన్, సాదీపన్ సాహా, సబినా యాస్మిన్,షియులి సాహాలు డిప్యూటీలుగా నియమించినట్లుప్రకటించారు. లేఖలను ఇప్పటికే స్పీకర్‌కు అందచేసామని రితబ్రత వివరించారు.

# సంక్షిప్తంగా..

## అద్దెలు పెంచవద్దని ఎమిరేట్స్ భవన యజమానులకు ఆదేశాలు



**అబూదాబి, జూన్ 3:** ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అబుదాబి ప్రభుత్వం అక్కడి నివాసితులకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇళ్లు, దుకాణాలు, పారిశ్రామిక భవనాల అద్దెలను ప్రస్తుతానికి పెంచొద్దని ఆదేశాలు జారీ చేసింది. అబుదాబి రియల్ ఎస్టేట్ సెంటర్ తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని అధికారికంగా ప్రకటించింది. కొత్త నిబంధనల ప్రకారం ప్రస్తుతం అద్దెకు ఉంటున్న వారి కాంట్రాక్టులను పునరుద్ధరించుకునే సమయంలో అద్దెను అస్సలు పెంచకూడదు. ఒకవేళ పాత వాళ్లు ఖాళీ చేసి వెళ్లినా ఆ స్థానంలోకి వచ్చే కొత్త వాళ్లకు కూడా పాత అద్దెనే వర్తింపజేయాలి. గతంలో ఏడాదికి గరిష్ఠంగా ఐదు శాతం వరకు పెంచుకునేందుకు యజమానులకు ఉన్న అవకాశాన్ని ప్రభుత్వం తాత్కాలికంగా రద్దు చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నివసించే ప్రవాస భారతీయులకు ఈ నిర్ణయం పెద్ద ఊరటను ఇచ్చింది.

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు గోటబయపై విదేశీ టూర్ల బ్యాన్!



**కొలంబో, జూన్ 3:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు గోటబయ రాజపక్షపై శ్రీలంకకోర్టు విదేశీ టూర్‌లపై నిషేధం విధించింది. 2019లో జరిగిన ఈస్టర్ సన్‌డే బాంబింగ్స్ అరాచకానికి సంబంధించి దర్యాప్తు వేగం అవుతున్నందున ఆనాటి అధ్యక్షుడిపై విదేశీ టూర్లు చేయడానికి ఆంక్షలు విధించింది. రాజపక్ష హయాంలోని ఇంటెలిజెన్స్ చీఫ్ సురేష్ సల్లాయ్‌ను ఫిబ్రవరినుంచే అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులకు వ్యూహరచన చేసింది ఆతడేనన్న అభియోగాలున్నాయి. ఆనాటి దాడుల్లో 279 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఆరోపణలను ఐజిచీఫ్ ఖండించారు. కొలంబో ఫోర్ట్ మేజిస్ట్రేట్ ఇందుకు సంబంధించి రాజపక్షతోపాటు మరో ఇద్దరు మిలిటరీ ఇంటెలిజెన్స్ అధికారులు దేశం వీడి వెళ్లకుండాచూడాలని ఇమ్మిగ్రేషన్ అధికారులకు కూడా ఆదేశాలిచ్చారు.

## అనుమతుల్లేకుండా జపాన్‌లో పాకిస్థానీల అక్రమ మసీదునిర్మాణం

**టోక్యో, జూన్ 3:** ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా జపాన్‌లోని పాకిస్తానీయులు మసీదు నిర్మించడం ఇపుడు పెద్ద వివాదం అయింది. రాజధాని టోక్యో సమీపంలోని కావాగోయ్‌లో నిర్మించిన ఈ మసీదును జపాన్‌లోని పాకిస్థాన్ రాయబారి అబ్దుల్ హామీద్ ప్రారంభించారు. జపాన్ సిటీ ప్లానింగ్ యాక్ట్ ప్రకారం సరైన అనుమతులు పొందకుండానే మసీదును నిర్మించారని అధికారుల తనిఖీల్లో తేలింది. దీంతో ఈ మసీదు కూల్చివేత ముప్పును ఎదుర్కొంటోంది. కావాగోయ్ సిటీలో ఈ మసీదును నిర్మించిన ప్రాంతంలో ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే ముందుగానే అనుమతులు పొందాలి, లేకపోతే అక్కడ నిర్మాణాలు చేపట్టడంపై నిషేధం ఉంది. ముందస్తు అనుమతులు తీసుకోకుండా మసీదు నిర్మాణాన్ని చేపట్టారని కవాగోయ్ సిటీ అధికారులు తెలిపారు. దీంతో ఈ భవనాన్ని కూల్చివేయాలని కోరుతూ వచ్చిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

## ఖాన్‌సార్ కోచింగ్ సెంటర్‌పై ఆగంతకుల దాడి!



**పాట్నా,జూన్ 3:** దేశవ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిన ప్రముఖ అధ్యాపకుడు ఖాన్ సర్ కోచింగ్ సెంటర్‌పై మంగళవారం రాత్రి కొందరు దుండగులు దాడికి తెగబడ్డారు. పాట్నాలోని సంస్థలోకి అక్రమంగా చొరబడిన కొందరు వ్యక్తులు అక్కడ ఉన్న గార్డుపై తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. విపరీతంగా గొడవ చేస్తూ లోపల ఉన్న వస్తువులను, ఆస్తులను ధ్వంసం చేశారు. గాయపడిన సెక్యూరిటీ గార్డు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడి జరిగిన విషయం తెలియగానే ఖాన్ సర్ రాత్రి 11:30 గంటల సమయంలో కోచింగ్ సెంటర్‌కు చేరుకున్నారు. కొందరు సంఘ విద్రోహ శక్తులు లోపలికి వచ్చి గార్డును కొట్టారని, ఆఫీస్ వస్తువులు ధ్వంసం చేశారని చెప్పారు. మొదట అక్కడ కాల్పులు జరిగాయని ప్రచారం జరిగినప్పటికీ పోలీసులు దాన్ని ఖండించారు. కేవలం తోపులాట, వస్తువుల ధ్వంసం మాత్రమే జరిగాయని స్పష్టం చేశారు.

# కువైట్ ఎయిర్‌పోర్టుపై ఇరాన్ భీకర దాడి

**కువైట్ సిటీ, జూన్ 3:** గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో భీకర దాడికి పాల్పడింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఎయిర్‌పోర్ట్‌లోని ఒక ప్యాసింజర్ టెర్మినల్ తీవ్రంగా దెబ్బతింది. ఎయిర్‌పోర్ట్‌లోని టీ1 ప్యాసింజర్ భవనంపై ఇరాన్‌కు చెందిన డ్రోన్లు దాడి చేశాయి. విమానాశ్రయ భవనానికి భారీగా నష్టం వాటిల్లినట్లు కువైట్ ప్రభుత్వం వెల్లడించింది. దాడి నేపథ్యంలో అధికారులు విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసి, అన్ని విమాన సర్వీసులను నిలిపివేశారు. ఈ దాడిని కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి, బ్రిగేడియర్ జనరల్ సౌద్ అబ్దుల్‌అజీజ్ అల్‌ఒతైబీ మాట్లాడుతూ, ఇది ఇరాన్ చేసిన నేరపూరిత దురాక్రమణ. శత్రు డ్రోన్లు నేరుగా ప్రయాణికుల భవనాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడి వల్ల భవనానికి తీవ్ర నష్టం కలగడంతో పాటు పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారికి అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నామని తెలిపారు. పరిస్థితిని భద్రతా దళాలు నిశితంగా గమనిస్తున్నాయని, ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోవడానికి పూర్తి సన్నద్ధతతో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడుల్లో తమ సైనికులకు ఎలాంటి నష్టం జరగలేదని ఇరాన్ స్పష్టం చేసింది. దాడి సమయంలో కువైట్, బహ్రెయిన్ దళాలు కూడా తమ రక్షణ వ్యవస్థలను యాక్టివేట్ చేశాయి. ఫిబ్రవరిలో మొదలైన ఘర్షణల తర్వాత, ఇటీవలే కువైట్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయి. తాజా దాడితో గల్ఫ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. కువైట్ అధికారులు సైనిక బలగాలను హై అలర్ట్‌లో ఉంచారు.

# లక్ష డాలర్ల ఫీజు నిర్ణయించినా హెచ్1బి వీసాలకోసం 2.86 లక్షల దరఖాస్తులు



## హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి మార్క్‌వేన్ ముల్లిన్

**వాషింగ్టన్, జూన్ 3:** హెచ్1బి వీసాలపై ఆంక్షలు పెంచేందుకు డొనాల్డ్‌ట్రంప్‌ప్రభుత్వం ఫీజును లక్ష డాలర్లకు పెంచినప్పటికీ దరఖాస్తులు మాత్రం వెల్లువలా వస్తూనే ఉన్నాయి. హెచ్1బి వీసాలకోసం దరఖాస్తులు రెండులక్షలకుపైగా వచ్చినట్లు డిపార్టుమెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి మార్క్‌వేన్ ముల్లిన్ వెల్లడించారు. సెనెట్ అప్రాప్రియేషన్స్ సబ్‌కమిటీ ముందు వివరణ ఇచ్చిన మార్క్‌వేన్ ముల్లిన్ హెచ్1బి వీసాకోసం దరఖాస్తులు 2.86 లక్షలవరకూ అందినట్లు తెలిపారు. వీటిలో రెండులక్షల దరఖాస్తులకు అభ్యర్థులు లక్ష డాలర్ల ఫీజును కూడా చెల్లించారు. దీనితో మేం వేగంగా ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సెనేటర్ సుసాన్ కొల్లిన్స్ వేసిన ప్రశ్నలకు మార్క్‌వేన్ ముల్లిన్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. దరఖాస్తుదారులు 15రోజుల్లోనే తమ దరఖాస్తులను క్లియర్‌చేసేందుకు వీలుగా మొత్తం ఫీజు చెల్లించారని చెప్పారు. సాధారణ దరఖాస్తులు సుమారుగా 7.5 నెలలకాలం పడుతుందని కూడా డిహెచ్ఎస్ కార్యదర్శి వివరించారు. గ్రామీణ హెల్త్‌కేర్ ప్రొవైడర్లకు భారం పెరుగుతోందని, ప్రిస్క్ ఐల్ అనే ఉత్తరమైన్ ప్రాంతంలో ఇటీవలే విదేశీ సర్జన్‌కోసం నిర్దేశిత ఫీజు మొత్తం చెల్లించిందని చెప్పారు. ఇప్పటివరకూ సేవలు అందని ప్రాంతాల్లో నియామకాలకు స్కిల్డ్ వర్కర్లు అవసరం అవుతారని, దేశీయ ట్యాలెంట్ పూల్స్‌నుంచే వారిని ఎంపికచేసుకోవాలనిసూచించారు. ఈ ఫీజునుంచి వైద్య వృత్తినిపుణులను మినహాయిస్తారా అన్న ప్రశ్నపై ముల్లిన్ స్పందిస్తూ వైద్యనిపుణులు అందుబాటులో లేనట్లు నిర్ధారణ అయితేనే సాధ్యం అవుతుందని చెప్పారు. కొన్ని ప్రత్యేక కేసుల్లో మినహాయింపులు ఇచ్చే అంశంపై నిపుణులు కొరత తీవ్రంగా ఉన్నపుడు మాత్రమే వీలవుతుందని ముల్లిన్ చెప్పారు. ఐటిరంగంలో ఒక కంప్యూటర్ నిపుణుడిని ఇతర దేశంనుంచి కాలిఫోర్నియా, సిఇకాన్ వ్యాలీల్లో నియమించుకున్నంత సులువుగా ఒక వైద్యనిపుణుడిని మాత్రం గ్రామీణ ఆసుపత్రుల్లో నియమించుకోవడం అంత సులువుకాదన్నారు. అలాస్కా రిపబ్లికన్ సెనేటర్ లీసా మరెకోవ్‌స్కీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనేక జిల్లాల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని సభ దృష్టికి తెచ్చారు. గతంలో కూడా హెచ్1బి వీసా టీచర్లకు సమస్య ఎదురవుతోందని డిహెచ్ఎస్ దృష్టికి తెచ్చినట్లు గుర్తుచేసారు.

# విద్యుత్ ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమా

## చెక్కు అందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, మే 3, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో మృతి చెందిన ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) ఉద్యోగి కుటుంబానికి బీమా కింద రూ.కోటి చెక్కును ప్రభుత్వం అందించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఈ చెక్కును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అందించారు. ఈ మేరకు ఒక ప్రకటనలో వీటి వివరాలను వెల్లడించారు. ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో బాసర పరిధిలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న ఎస్ ప్రమోద్ కుమార్ 2024 సెప్టెంబర్‌లో బ్యాంక్‌లో శాలరీ నిమిత్తం ఖాతాను ప్రారంభించారు. అయితే దురదృష్టవశాత్తూ 2025 మార్చి 24న విధి నిర్వహణలో ఉండగా జరిగిన ప్రమాదంలో మరణించారు. ఆయన మరణం తర్వాత, మృతుని నామినీ అయిన భార్య స్వప్న క్లెయిమ్ దరఖాస్తును బాసర శాఖలో సమర్పించారు. ఈ క్రమంలో రూ. కోటి బీమా మొత్తం మే నెలాఖరు నాడే స్వప్న సేవింగ్స్ ఖాతాలో జమ అయింది. కాగా యూనియన్ బ్యాంక్‌తో ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ మధ్య కుదిరిని ఒప్పందం ప్రకారం ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన ఖాతా నేపథ్యంలో రూ. కోటి బీమా పథకం అమలు చేస్తోంది. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, ఫైనాన్స్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, యూనియన్ బ్యాంక్ సీఈవో అశిష్ పాండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమరేష్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఈగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడిలో పట్టుబడ్డ గంజాయితో స్మగ్లర్లు, వారు ప్రయాణించిన బస్సు.

### ఈగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

# నలుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు

## గంజాయి రవాణా చేస్తున్న బస్సు జప్తు

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** ఈగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఖమ్మం జిల్లాలో నిర్వహించిన మెరుపుదాడుల్లో ఒడిషా నుంచి హైదరాబా ద్‌కు రవాణా అవుతున్న 20 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ సందర్భంగా నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు వారు ప్రయాణిం చిన ప్రైవేటు బస్సును కూడా జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా బుధవారం మీడియాకు వెల్లడించారు. ఒడిషాలోని మల్కన్‌గిరి నుంచి ఓ ప్రైవేటు బస్సు ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కు వస్తుండగా ఇందులో గంజాయి రవాణా అవుతుందని ఈగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఈ బస్సును ఎపి నుంచి తెలంగాణలోకి వస్తున్న క్రమంలో ఈగల్ పోలీసు లు వెంబడించారు. ఈ బస్సు మంగళవారం రాత్రి ఖమ్మం జిల్లాలో ప్రవేశించగానే ఈగల్ పోలీసులు దానిని ఆపి సోదా చేయగా 20 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ సందర్భంగా ఒడిషా జిల్లా మల్కన్‌గిరికి చెందిన రమేష్ నాగుల్ (25), రంజన్ కోరా(21), బిసాంక మాలిక్ (52), అరవింద్ గైన్ (52)లు పట్టుబడ్డారు. ఈ గంజాయిని వీరు హైదరాబాద్‌లో తమకు తెలిపిన లోకల్ స్మగ్లర్లకు అందించేందుకు తెస్తున్నట్లు అంగీ కరించా రు. నిందితుల వద్ద ఐదు సెల్‌ఫోన్లు వుండగా వాటిని జప్తు చేశారు. దీంతో పాటు వీరు ప్రయాణిం చిన బస్సును కూడా జప్తు చేశారు.




## రూ.79 లక్షల విలువైన 158 కిలోల

# ఎండు గంజాయి స్వాధీనం

## సిఐఎస్ఎఫ్ సస్పెండెడ్ కానిస్టేబుల్ అరెస్ట్

**సంజీవరెడ్డి నగర్, జూన్ 3, ప్రభాతవార్త:** హైదరాబాద్ సిటీ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ (జూబ్లీహిల్స్ జోన్ టీమ్), ఎస్ఆర్ నగర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో భారీ ఎత్తున ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రూ.79 లక్షల విలువైన 158 కిలోల ఎండు గంజాయిని తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, కారు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, అరెస్టు అయిన నిందితుడు పనగూడు శివ కృష్ణ (39) ఇతను ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందినవాడు కాగా, ప్రస్తుతం కేరళ రాష్ట్రంలోని త్రివేంద్రం జిల్లాలో నివసిస్తున్నాడు. 2009లో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్)లో కానిస్టేబుల్‌గా చేరిన శివకృష్ణ, అనంతరం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్)లో కూడా విధులు నిర్వహించాడు. ప్రస్తుతం అతను 2025 నుంచి సస్పెన్షన్‌లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి ఎస్ఆర్ నగర్‌లోని నేచర్ క్యూర్ హాస్పిటల్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కారును తనిఖీ చేసిన పోలీసులు, అందులో 158 కిలోల ఎండు గంజాయిని గుర్తించారు. నిందితుడి వద్ద నుంచి గంజాయితో పాటు ఒక చేవ్రొలెట్ సెయిల్ కారు, మూడు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు ఒడిశా రాష్ట్రంలోని గంజాయి సాగుదారుల నుంచి మత్తుపదార్థాన్ని సేకరించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని డ్రగ్ పెడ్లర్లకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. తన సీఐఎస్ఎఫ్ హోదాను దుర్వినియోగం చేస్తూ చెక్‌పోస్టుల వద్ద అధికారిక గుర్తింపు కార్డు చూపించి తనిఖీల నుంచి తప్పించుకునేవాడని పోలీసులు తెలిపారు. ఇప్పటికే 2025లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసులో శివకృష్ణ అరెస్ట్ అయి జైలు శిక్ష అనుభవించినట్లు పోలీసులు వెల్లడించారు. ఆ కేసు అనంతరం విధుల నుంచి సస్పెండ్ అయినప్పటికీ తన నేర కార్యకలాపాలను కొనసాగించినట్లు విచారణలో తేలింది. మత్తుపదార్థాలు యువత భవిష్యత్తును, కుటుంబాలను నాశనం చేస్తున్నాయని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో డ్రగ్స్ వ్యాపారంలోకి వెళ్లొద్దని, మత్తుపదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని యువతకు సూచించారు. నగరంలో ఎక్కడైనా డ్రగ్స్ విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

ఈ కేసును కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. యదేందర్, ఎస్ఐ డి. రవిరాజ్, వారి బృం దం, ఎస్ఆర్ నగర్ పోలీసుల సహకారంతో ఛేదించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, ఐపీఎస్ వెల్లడించారు.

# సచివాలయం వద్ద దంపతుల ఆత్మహత్యాయత్నం

## అడ్డుకున్న పోలీసులు..సైఫాబాద్ పిఎస్‌కు తరలింపు

**హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త:** తెలంగాణ సెక్రటేరియట్ వద్ద బుధవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ భూమి సమస్యకు న్యాయం చేయాలని కోరుతూ వచ్చిన ఓ దంపతులు సెక్రటేరియట్ ప్రధాన ద్వారం సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించడం కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కొండా పోచమ్మపల్లి గ్రామానికి చెందిన పుట్ట కృష్ణయ్య, ఆయన భార్య సైదమ్మ తమ భూమికి సంబంధించిన సమస్యపై న్యాయం కోసం గత మూడు రోజులుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అయితే తమ వినతిని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దంపతులు పెట్రోల్ డబ్బాతో సెక్రటేరియట్ వద్దకు చేరుకుని ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. అక్కడ భద్రతా విధుల్లో ఉన్న



ఎస్పీఎఫ్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దంపతుల చేతిలో ఉన్న పెట్రోల్ డబ్బాను లాక్కొని వారిని అదుపులోకి తీసుకున్నారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. తర్వాత దంపతులను విచారణ నిమిత్తం సైఫాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారి భూమి సమస్యకు సంబంధించిన వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

# తెలంగాణ,తురింగియా మధ్య ఎంఓయు

## టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం కీలక ఒప్పందం

### తెలంగాణ రైజింగా దార్శనికతపై జర్మనీ ప్రతినిధుల ప్రశంసలు

### అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దుతున్నాం: సిఎం రేవంత్ రెడ్డి



బుధవారం సిఎం రేవంత్‌రెడ్డి, తురింగాయా ముఖ్యమంత్రి మారియో ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న దృశ్యం. చిత్రంలో మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి చర్యలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రమైన తెలంగాణతో, జర్మనీలోని తురింగియా రాష్ట్రం పలు కీలక రంగాల్లో భాగస్వామ్యానికి ముం దుకొచ్చింది. టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పరస్పర సహకారం కోసం తెలంగాణ ప్రభుత్వం, తురింగియా రాష్ట్ర ప్రభుత్వం మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. జర్మనీ తురింగియా రాష్ట్ర ముఖ్యమంత్రి మారియో వోయిట్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో బుధవారం ప్రత్యేకంగా సమావేశం కాగా, ఈ భేటీలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకట స్వామి,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రగ తిశీల పనులను జర్మనీ ప్రతినిధులు ప్రశం సించారు. ఈ సమావేశంలో తురింగియా రాష్ట్ర ముఖ్యమంత్రి మారియో వోయిట్ తెలంగాణను భారతదేశంలో అభివృద్ధి, ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజ న్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ సాధించిన అభివృద్ధి ప్రత్యేకమైనదిగా వ్యాఖ్యానించారు. భారత-జర్మనీ సంబంధాల్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. ఇంతటి వృద్ధి సాధించిన రాష్ట్రంతో భాగస్వామ్యం కావడం తమకు గౌరవంగా ఉందని వివరించారు. రెండు ప్రాంతాలకు ప్రయోజనం చేకూరేలా కలిసి పనిచేయాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉపాధి రంగంలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయని గుర్తు చేశారు. ముఖ్యంగా ఆర్టిఫీషియల్ ఇంటెలి జెన్స్(ఏఐ) ప్రభావంతో సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో కొత్త అవకాశాలు వస్తున్నాయని వివరించారు. జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలకు అవసరమైన నైపుణ్యాలతో తెలంగాణ యువతను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీలు), పాలిటెక్నిక్ కళాశాలల్లో బోధన విధానాలను మార్చేందుకు తురింగియా సహకారం కావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు స్పందించిన తురింగియా ముఖ్యమంత్రి మారియో వోయిట్... తెలంగాణ అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు రూపొందించేందుకు తమ పరిశ్రమలు, విద్యాసంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని తెలిపారు. జర్మనీలో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు ఏమిటో గుర్తించి, వాటికి అనుగుణంగా తెలంగాణ యువతకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణ యువత ప్రపంచవ్యాప్తంగా తమ ప్రతిభను చాటుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అమెరికాలోని సిలికాన్ వ్యాలీ విజయాల్లో తెలంగాణ యువత కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. ప్రపంచంలోని అనేక అగ్రశ్రేణి సంస్థల్లో హైదరాబాద్‌కు చెందినవారే కీలక పదవుల్లో ఉన్నారని చెప్పారు.

ఈ నేపథ్యంలో జర్మన్ భాషా పరిజ్ఞానం కూడా ఎంతో అవసరమని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో జర్మన్ భాషా శిక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంలో సహకరించాలని తురింగియా ప్రతినిధులను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ గురించి కూడా ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి వివరించారు. ప్రపంచం లోని ఫార్చ్యూన్-500 కంపెనీలను తెలంగాణకు ఆకర్షించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును రూపొంది స్తున్నామని తెలిపారు. వ్యాపారాలకు అవసరమైన ప్రపంచ స్థాయి వసతులు హైదరాబాద్‌లో ఉన్నాయని చెప్పారు. ఇటీవల మిస్ వరల్డ్-2025 పోటీలకు వందకు పైగా దేశాల ప్రతిని ధులు హైదరాబాద్‌కు రావడం రాష్ట్ర ప్రతిష్టకు నిదర్శనమన్నారు. జర్మనీలోని తురింగియా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ సెమీకండక్టర్ రం గానికి చెందిన జర్మన్ కంపెనీల ప్రత్యేక బృం దాన్ని తెలంగాణకు పంపేందుకు సిద్ధంగా ఉన్నా మని తెలిపారు. ఇక్కడి అవకాశాలను పరిశీలించి పెట్టుబడులపై చర్చలు జరుపుతామన్నారు. అయితే, ఈ ప్రతిపాదనను మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు స్వాగతిస్తూ ఇప్పటికే హైదరాబాద్‌లో అనేక అంతర్జాతీయ సెమీ కండక్టర్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. త్వరలోనే తయారీ రంగంలో కూడా తెలంగాణ ముందంజలో నిలుస్తుందని తెలిపారు. తెలంగాణ కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లా డుతూ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) ద్వారా ఇప్పటికే జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయని తెలిపారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో యువతకు అత్యాధునిక నైపుణ్యాలు అందిస్తున్నామని, తురింగియా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా వెళ్లి పరిశీలించవచ్చని సూచించారు. పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞా నం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తెలం గాణకు కొత్త అవకాశాలు అందజేయనున్న ఈ ఒప్పందం రాష్ట్ర యువతకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందించే దిశగా కీలక అడుగుగా మారనుంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షిస్తుండగా, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల రాష్ట్రాలు తెలంగాణతో భాగస్వామ్యం కోసం ముందుకు రావడం రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తురింగియా స్టేట్ సెక్రెటరీలు డా. టైచార్ట్, సకెర్ట్, జర్మన్ కాన్సుల్ జనరల్ హాస్పర్ సహా వివిధ రంగాలకు సంబంధించిన జర్మనీ పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, సీఎం స్పెషల్ సెక్రటరీ బి అజిత్ రెడ్డి, టీజీఐఐసి ఎండి శశాంక కూడా పాల్గొన్నారు.

# విత్తన రంగ అనుభవం నైజీరియా యువతకు ఉపయోగపడాలి

## తెలంగాణలో శిక్షణ పొందిన టరాబా రాష్ట్ర యువతకు సర్టిఫికెట్ల ప్రదానం

### వ్యవసాయం, విత్తన రంగాల్లో తెలంగాణ - టరాబా రాష్ట్రాల మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం

### అంతర్జాతీయ విత్తన విద్య, పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు తుమ్మల, వివేక్



బుధవారం శామీర్‌పేటలో అంతర్జాతీయ విత్తన విద్య, పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు తుమ్మల, వివేక్ తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జూన్3:** శామీర్‌పేట్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ లో నిర్వహించిన 'అంతర్జాతీయ విత్తన విద్య, పారిశ్రామిక అభివృద్ధి శిక్షణ కార్యక్ర మం' బుధవారం ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి కార్మిక శాఖ మంత్రి జి.వివేక్ వెం కటస్వామితో కలిసి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం దేశంలోనే విత్తన రంగానికి కేంద్రంగా గుర్తింపు పొందిందని, ఆ అనుభవాన్ని నైజీరియాలోని టరాబా రాష్ట్ర యువతతో పంచుకోవడం సంతోషకరమన్నారు. ఈ శిక్షణ ద్వారా యువత విత్తన ఉత్పత్తి, హైబ్రిడ్ సీడ్ టెక్నాలజీ, విత్తన శుద్ధి, ప్రాసెసింగ్, వ్యవసాయ వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో ప్రాయోగిక పరిజ్ఞానం పొందారని తెలిపారు. టరాబా రాష్ట్ర ప్రభుత్వం తమ యువతకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ కల్పించేందుకు చూపుతున్న చొరవ అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. తెలం గాణ ప్రభుత్వం కూడా టరాబా రాష్ట్రంతో వ్యవసాయం, విత్తన సాంకేతికత, రైతు శిక్షణ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధంగా ఉందన్నారు.తెలంగాణ, టరాబా రాష్ట్రాల మధ్య "సిస్టర్ స్టేట్" భాగస్వామ్యానికి సంబం ధించి చర్చలు కొనసాగుతున్నాయని, ఇది ఇరు ప్రాంతాల మధ్య పరస్పర అభివృద్ధికి దోహదపడుతుందని మంత్రి తెలిపారు.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఈ రెండు సంవత్సరాలలో సాధించిన ప్రగతిని మంత్రి వివరించారు. టరాబా రాష్ట్ర యువత ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలను తమ ప్రాంత అభివృద్ధికి వినియోగించి వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలను సృష్టించాలని మంత్రి తుమ్మల ఆకాంక్షి ంచారు.

ఈ కార్యక్రమంలో సీడ్ కార్పోరేషన్ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, నైజీరియాలోని టరాబా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ అగ్బు కెఫాస్, టరా బా సీడ్స్ లిమిటెడ్, ప్రసాద్ సీడ్స్ ప్రైవేట్ లిమి టెడ్, ఇంటర్నేషనల్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ ప్రతిని ధులు, శిక్షకులు, అధికారులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసిన యువతకు సర్టిఫికెట్లు అందజేశారు.

# పట్టాలెక్కనున్న రాజీవ్ వికాసం

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన ముఖ్యమైన హామీల్లో ఒకటి రాజీవ్ యువ వికాసం పథకం. ఈ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశం కల్పించేందుకు బ్యాంకు రుణం మంజూరు చేస్తారు. పథకం కోసం పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇప్పటి వరకు దీని అమలుపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అయితే తాజాగా రేవంత్ సర్కార్ రాష్ట్రంలోని 91 వేల మంది గిరిజన యువతకు రాజీవ్ యువ వికాసం ద్వారా ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చింది.

రాష్ట్రంలో గిరి జనుల ఆర్థికాభివృద్ధికి రేవంత్ సర్కార్ రూ. 2,546.24 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను ఆమోదించినట్లు గిరిజన ఆర్థిక సహకార సంస్థ అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఆమోదించిన ఈ మొత్తంలో రూ.2,085 కోట్ల సబ్సిడీ కాగా మిగతా మొత్తం రూ.461.24 కోట్ల బ్యాంకు రుణంగా సమకూర్చనుంది. ఈ వార్షిక ప్రణాళికతో 1,36,184 మంది గిరిజన యువతకు లబ్ధి చేకూ ర్చేలా చర్యలు తీసుకోబోతున్నట్లు వివరించారు. ఇందిరా సౌరగిరి జలవికాసం, రాజీవ్ యువ వికాసం, గ్రామీణ రవాణా పథకం, ఆదిమ గిరిజ నులకు జీవనోపాధి, గిరిజన రైతులకు యాంత్రీ కరణ పథకం, సీఎం ఎస్టీఈఐ, క్యూర్ ప్రాం తంలో ఆటోల రెట్రోఫిటింగ్, నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు వంటివి ఉండేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రాజీవ్ యువ వికాసం కింద 91,687 మంది ఎస్టీ యువతకు స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.1,225.79 కోట్లు కేటాయించారు. ఇందులో రాయితీ నిమిత్తం రూ.1000 కోట్లు, మిగతా రూ.225.79 కోట్లు బ్యాంకు రుణంగా ఉంటుంది. అలానే 13,897 మందికి జీవనోపాధి పథకం అమలు చేయబోతున్నారు.

ఇందుకుగాను రూ.521.24 కోట్లు ఖర్చు చేయనుండగా, దీనిలో బ్యాంకు రుణం 311.24 కోట్లు, రాయితీ రూ.210 కోట్లను ఇస్తుంది. ఇక క్యూర్ ఏరియాలో 7,500 మంది లబ్ధిదారుల ఆటోలను నూరు శాతం రాయితీతో రెట్రోఫిటింగ్ పథకం కింద పూర్తి స్థాయి విద్యుత్తు వాహనాలుగా మార్చుతారు. ఇందుకు గాను రూ.150 కోట్లు వ్యయం చేయ నున్నారు. అంతేకాకుండా సీఎం ఎస్టీఈఐ పథకం ద్వారా యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిం చనున్నారు. దీని కోసం 100 యూనిట్లు మం జూరు చేయనున్నారు. మొత్తం రూ.200 కోట్లతో పథకాన్ని అమలు చేయబోతున్నారు. ఇందులో సబ్సిడీ రూ.50 కోట్లు, బ్యాంకు రుణం రూ.130 కోట్లు. అయితే ఈ పథకంలో లబ్ధిదారులు కూడా రూ.20 కోట్ల మేర భరించాల్సి ఉంది. ఇదే సమయంలో ప్రభుత్వం గిరిజన యువత నైపుణ్యాభివృద్ధి కోసం రూ.75 కోట్లు ఖర్చు చేయనుంది. ఇందులో 13 వేల మంది లబ్ధిదారులకు నైపుణ్య శిక్షణ అందిస్తుంది. దీంతో పాటు, ఇందిరా జలవికాసం కింద 10వేల మంది లబ్ధిదారులకు రూ.600కోట్ల ఖర్చుతో సోలార్ బోరు బావులతోపాటు పోడు భూములను సాగుయోగ్యంగా మార్చి నీటివసతి కల్పిస్తుందని అధికారవర్గాలు వెల్లడించాయి.

### గిరిజన యువతకు స్వయం ఉపాధి

### 91 వేల మందికి అమలు

### ఒక్కొక్కరికి రూ.4 లక్షలు

# తెలంగాణలోని ప్రిన్స్‌టన్ విద్యాసంస్థలకు

# సుప్రీంకోర్టులో చుక్కెదురు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** తెలంగాణలోని ప్రిన్స్‌టన్ విద్యాసంస్థలకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. అమెరికా ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ పేరు వాడటంపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా వర్సిటీతో తమకు సంబంధం లేదని బోర్డులు పెట్టాలని తెలంగాణ కాలేజీలకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులు మోసపోకుండా ఉండేందుకే ఈ కఠిన నిర్ణయమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జూన్ 12వ తేదీ లోగా ప్రముఖ దినపత్రికల్లో పావు పేజీ ప్రకటనలు ఇవ్వాలని కాలేజీ యాజమాన్యాన్ని ఆదేశించింది. అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక ప్రిన్స్‌టన్ యూనివర్సిటీ దాఖలు చేసిన ట్రేడ్‌మార్క్ కేసుపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ మేరకు తెలంగాణలో ప్రిన్స్‌టన్ పేరుతో కాలేజీలు నడుపుతున్న వాగ్దేవి ఎడ్యుకేషనల్ సొసైటీకి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కాలేజీ వెబ్‌సైట్లలో పెద్ద అక్షరాలతో డిస్‌క్లెయిమర్ నోటీసు ప్రదర్శించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. కాలేజీ ప్రాస్పెక్టస్, అడ్మిషన్ ఫారాలు, విద్యార్థుల సర్టిఫికెట్లపై తప్పనిసరిగా డిస్‌క్లెయిమర్ ముద్రించాలని స్పష్టం చేసింది.

ప్రతి కాలేజీ క్యాంపస్ వెలుపల స్పష్టంగా కనిపించేలా డిస్‌క్లెయిమర్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. నూతన విద్యాసంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యేలోపే నిబంధనలన్నీ తప్పనిసరిగా అమలు చేయాలని డెడ్‌లైన్ విధించింది. అంతర్జాతీయ బ్రాండ్ల పేరుతో విద్యార్థులు అయోమయానికి గురికాకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది. పేరు మార్పుపై ప్రధాన కేసు ఇంకా ఢిల్లీ హైకోర్టులోనే పెండింగ్‌లో ఉందని సుప్రీంకోర్టు ప్రస్తావించింది.

# ఇద్దరు మహిళల అనుమానాస్పద మృతి

## భూక్యా తండాలో విషాదం

**మరిపెడ, జూన్ 3 ప్రభాత వార్త:** మరిపెడ మండలంలోని భూక్యా తండాలో ఇద్దరు మహిళలు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన మాలోత్ శారద (36) ఈ నెల 1వ తేదీన సూర్యాపేటలోని కంటి ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని, ఆ రాత్రి బంధువుల ఇంట్లో బస చేసింది. అనంతరం జూన్ 2న సాయంత్రం స్వగ్రామానికి చేరుకుంది. ఇంటికి వచ్చిన అనంతరం తన ఇంటి సమీపంలో నివసించే మాలోత్ నీలా వద్దకు వెళ్లి ఇద్దరూ ఇంటి బయట మాట్లాడుకుంటుండగా, మాలోత్ నీలా ఒక్కసారిగా కళ్లుతిరిగి స్పృహ తప్పి పడిపోయినట్లు సమాచారం.

దీంతో మాలోత్ శారద ఆమెకు సీపీఆర్ చేయడానికి ప్రయత్నించగా, కొద్దిసేపటికే శారద కూడా అపస్మారక స్థితికి చేరినట్లు గ్రామస్తులు తెలిపారు. విషయాన్ని గమనించిన తండావాసులు ఇద్దరినీ వెంటనే ఆటోలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే వారు మృతి చెందినట్లు నిర్ధారించారు. మాలోత్ నీలా కుమారుడు వెంకటేష్ తమ తల్లి, శారద మరణాలపై




మృతి చెందిన మహిళలు (ఫైల్)

అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీ సులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోస్ట్‌మార్టం నివేదిక ఆధార ంగా పూర్తి వివరాలు వెల్లడిస్తామని, మరణాలకు గల కారణాలపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇద్దరు మహిళల ఆకస్మిక మృతితో భూక్యా తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# నేడు పాలమూరుకు సీఎం రేవంత్

**ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను సందర్శించనున్న ముఖ్యమంత్రి**

**ఉదండాపూర్‌లో భారీ బహిరంగ సభ**

**ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 3, ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జూన్ 4, 5 తేదీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. రెండు రోజుల పాటు ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల స్థితిగతులపై సమీక్షించనున్నారు. ముందుగా నారాయణపేట జిల్లా మక్తల్ నుంచి జోగులాంబ గద్వాల జిల్లా మీదుగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రవేశించి రాత్రి సోమశిల వద్ద బసచేయనున్నారు. మరుసటి రోజు (శుక్రవారం) నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రాజెక్టులను సందర్శిస్తూ మహబూబ్‌నగర్ జిల్లాలోని కరివెన ఉదండాపూర్ రిజర్వాయర్ల సందర్శనలతో పర్యటనముగించనున్నది. శుక్రవారం సాయంత్రం ఉదండాపూర్ వద్ద భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్నారు.

**మంత్రి జూపల్లి ఏర్పాట్ల పరిశీలన :** జూన్ 5న మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి.జానకి, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఓ.ఎస్.డి కమలాసన్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి జడ్చర్లలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభా ప్రాంగణాన్ని సందర్శించి ఏర్పాట్లపై సమీక్షించారు. జడ్చర్ల మండల పరిధిలోని ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద హెలిప్యాడ్లను సిద్ధం చేయాలని అధికారులను మహబూబ్‌నగర్ కలెక్టర్ కుష్బూ గుప్తా ఆదేశించారు. ప్రాజెక్టు వద్ద హెలిప్యాడ్ల నిర్మాణం, ముఖ్యమంత్రి సందర్శన కోసం ఏర్పాటు చేయనున్న వ్యూ పాయింట్ వద్ద బారికేడ్ల నిర్మాణం, పోలీస్ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, అలాగే రిజర్వాయర్ వద్ద వాహనాల పార్కింగ్, నీడ కొరకు టెంట్లు ఏర్పాటు, త్రాగునీటి సదుపాయం, వి.ఐ.పి సమావేశానికి గ్రీన్ రూముల ఏర్పాటు, మరుగుదొడ్ల తదితర ఏర్పాట్లను జిల్లా అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రితో పాటు వచ్చే వీవీఐపీ వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి, సందర్శకుల సౌకర్యార్థం అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా నారాయణపేట జిల్లా మక్తల్‌లో పర్యటిస్తారు. 'హెలికాప్టర్‌లో మక్తల్‌కు చేరుకొని అక్కడ మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం (ఎంఎన్‌కేఎల్ ఐఎస్), భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదిత బ్యారేజీల పనుల పురోగతి సమీక్షించనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి వాకిటి శ్రీహరి ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో పాలమూరు దశదిశ మారనుందన్నారు.

# నైపుణ్యాలకు నెలవు

>> కంపెనీలు తమ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నాయని స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు హైదరాబాద్‌ను నాలెడ్జ్ సిటీగా మార్చాయని స్పష్టం చేశారు. వైద్య రంగంలో తెలంగాణ సాధించిన పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. తక్కువ ఖర్చుతో అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో మధ్యప్రాచ్య దేశాలతో పాటు అనేక దేశాల ప్రజలు చికిత్స కోసం హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. అత్యాధునిక ఆసుపత్రులు, నిపుణులైన వైద్యులు, మెరుగైన ఆరోగ్య మౌలిక వసతులు తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి మెడికల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఈ రంగంలో దక్షిణాఫ్రికాతో కలిసి పనిచేసే అవకాశాలను పరిశీలించవచ్చని సూచించారు. గత ఏడాది నిర్వహించిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025' భారీ విజయాన్ని సాధించిందని సీఎం గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు, దౌత్యవేత్తలు, పారిశ్రామికవేత్తలు పాల్గొనడంతో తెలంగాణకు కొత్త పెట్టుబడి అవకాశాలు లభించాయని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2026'లో పాల్గొనాలని దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలేతో పాటు అక్కడి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలను ముఖ్యమంత్రి ఆహ్వానించగా, దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు వెంటనే స్పందించి పెద్ద సంఖ్యలో బృందంతో ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ సదస్సు ద్వారా ఇరు దేశాల మధ్య వ్యాపార, పారిశ్రామిక సంబంధాలు మరింత బలపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశం ద్వారా తెలంగాణ-దక్షిణాఫ్రికా మధ్య విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పెట్టుబడులు, పరిశ్రమల రంగాల్లో కొత్త సహకార అవకాశాలకు మార్గం సుగమమైందని అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును గురించి కూడా సీఎం వివరించారు. పూర్తిగా పర్యావరణహితంగా, నెట్ జీరో విధానంలో, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఈ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ పరిశ్రమలు, సాంకేతిక సంస్థలు, పరిశోధనా కేంద్రాలకు ఇది కేంద్రంగా మారుతుందని చెప్పారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పారదర్శక పారిశ్రామిక విధానాలు, వేగవంతమైన అనుమతుల వ్యవస్థ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని ఆహ్వానించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ బల్క్ డ్రగ్స్, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం మెగా ఆసుపత్రులను నిర్మిస్తోందని చెప్పారు. ఆరోగ్య రంగంలో తెలంగాణదక్షిణాఫ్రికా భాగస్వామ్యం ఇరు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. భారతదేశంతో దక్షిణాఫ్రికాది చారిత్రక బంధమని ఆ దేశ ఉపాధ్యక్షుడు పాల్ మషాటిలే అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్, దక్షిణాఫ్రికాల మధ్య దశాబ్దాలుగా బలమైన సాంస్కృతిక సంబంధాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా భారత కంపెనీలు ఆఫ్రికా మార్కెట్లలోకి విస్తరించేందుకు దక్షిణాఫ్రికా కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఫార్మా, ఆరోగ్య రంగాల్లో భారత కంపెనీలకు అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని, భవిష్యత్తులో మరింత సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కాగా, ఈ సమావేశానికి దక్షిణాఫ్రికా అంతర్జాతీయ సంబంధాల ఉప మంత్రి మొరాకా, భారతదేశానికి దక్షిణాఫ్రికా రాయబారి ఎ.సూక్‌లాల్, ఆరోగ్య మంత్రి డాక్టర్ ఎ.మోట్సోలెడీ, చిన్న పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి ఎస్.ఎండాటేని, విజ్ఞాన సాంకేతిక శాఖ ఉప మంత్రి ఎన్.గినా, కమ్యూనికేషన్స్, డిజిటల్ టెక్నాలజీ శాఖ మంత్రి ఎం.గుంగుబెలే, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి వి. శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్ ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం

**ఆయిల్ పామ్ ఉద్యాన పంటలే రైతుల భవిష్యత్‌కు భరోసా**

**వ్యవసాయం నుంచి తాగునీటి వరకు ప్రతిరంగంలో ముందస్తు ప్రణాళిక అవసరం: మంత్రి తుమ్మల**



బుధవారం ఖరీఫ్ ప్రణాళికపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం,జూన్ 3 ప్రభాత వార్త:** ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వ్యవసాయం నుంచి త్రాగునీటి వరకు ప్రతి రంగంలో ముందస్తు ప్రణాళిక అవసరమని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖరీఫ్2026 వ్యవసాయ ప్రణాళిక, ఖమ్మం నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్, వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి దయానంద్ లతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఖరీఫ్2026 సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో అన్ని ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వచ్చే వారం నుంచే రైతు వేదికల ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతాలు, ఇతర సాగు ప్రాంతాలను గుర్తించి రైతులకు తగిన ప్రత్యామ్నాయ పంటలను సూచించాలని తెలిపారు. వర్షపాతం పరిస్థితులపై నిరంతరం రైతులకు సమాచారం అందించాలని, క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. రైతు వేదికలను పూర్తి స్థాయిలో వినియోగిస్తూ వ్యవసాయ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా యూరియా లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, ఇతర ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. పచ్చిరొట్టె విత్తనాల సబ్సిడీ నిజమైన రైతులకు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంట కోత అనంతరం వరి కొయ్యలు, పంట అవశేషాలకు నిప్పు పెట్టడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొంటూ, అధికారుల సూచనలను పట్టించుకోకుండా పొలాల్లో నిప్పు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు విస్తృత అవగాహన కల్పించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను పునఃసమీక్షించాలని, స్థానిక ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుని రైతు వేదికల ద్వారా ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఆయిల్ పామ్ సాగులో దేశంలో అగ్రస్థానంలో ఉందని, ఖమ్మం జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. మరో మూడు సంవత్సరాలలో దేశవ్యాప్తంగా తెలంగాణను మరింత ముందంజలో నిలిపేందుకు అధికారులు, రైతులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం ఉద్యాన పంటల విస్తరణేనని, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగును ఎంత విస్తీర్ణంలో చేపట్టినా ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని, ఎలాంటి పరిమితి లేదని స్పష్టం చేశారు. జిల్లాలో త్రాగునీటి సమస్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భారత వాతావరణ శాఖ సమాచారం ఆధారంగా నాగార్జునసాగర్‌కు నీటి లభ్యతపై అంచనాలు వేసుకుంటూ ఖరీఫ్ కాలువల నిర్వహణపై వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

కాలువలలో ఉన్న బ్రీచ్‌లు, మరమ్మతు పనులు, నిర్వహణ పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీతారామ ఎత్తిపోతల పథకంలోని జూలూరు పాడు టన్నెల్ పనులను ప్రాధాన్యతతో చేపట్టడంతో పాటు అవసరమైన అటవీ అనుమతులు పొందాలని సూచించారు. సత్తుపల్లి పట్టణంలో నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు నీటి వనరు ఉందా లేదా అనే అంశాన్ని పరిశీలించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నీటి వనరు లేకపోతే ప్లాంట్ వినియోగంపై ప్రత్యామ్నాయ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. త్రాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వర్షాకాలానికి ముందే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. నగర సుందరీకరణ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణను పూర్తి స్థాయిలో అమలు చేయాలని సూచించారు. ప్రజల అంగీకారం ఉన్న ప్రాంతాల్లో నగర అభివృద్ధి పనులు, రోడ్ల విస్తరణ మాస్టర్ ప్లాన్ ప్రకారం చేపట్టాలన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న ఐదు యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ విద్యా సంస్థల పనులను వేగవంతం చేయాలని సూచించారు. నగరంలోని డివైడర్లపై అందమైన మొక్కలు నాటేందుకు అటవీ శాఖతో సమన్వయం చేసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల, ఖమ్మం నగర పరిధిలోని ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు. మిగిలిన పనులకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో ఒక్క గుడిసె కూడా మిగలకుండా చూడాలని, మొదటి దశలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మంజూరు పొందినప్పటికీ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల స్థానంలో అర్హులైన పేద కుటుంబాలకు అవకాశం కల్పించాలని సూచించారు. రెండవ దశలో అత్యంత పేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# సర్కార్ ఖజానా నింపుతున్న ఇంధనం పన్నులు

## చమురు ధరలపై కేంద్రం నియంత్రణ వదులుకున్నా పన్నులతో ప్రజల నడ్డి విరుస్తున్న వైనం

**హైదరాబాద్, జూన్ 3, ప్రభాతవార్త:** పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించిన పన్నులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాకు బంగారు బాతు గుడ్డులా మారాయి. అంతర్జాతీయంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరిగినా, తగ్గినా భారత్‌లో మాత్రం దాని ధరల పెరుగుదల కొనసాగు తూనే వుంటోంది. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు పెరిగిన ప్రతీసారి లేదా మధ్య ఆసియాలో యుద్ధ మేఘాలు నెలకొన్న సమయంలో, గల్ఫ్ దేశాల్లో సంక్షోభం ఏర్పడినపుడు భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశానంటుతుండగా, అక్కడ వీటి ధరలు పతనం అయిన సమయ ంలో ఇక్కడ మాత్రం పన్నుల పేరిట సర్దుబాటు చేయడం పరిపాటిగా మారింది. పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్‌టి పరిధిలోకి తేవాలని నిపు ణులు చెబుతున్నా కేంద్రం ససేమిరా అంటుండగా దీని కారణంగా వాహదారుల జేబులకు చిల్లులు పడుతూనే వుంది. భారత్‌లో చమురు ధరల పై ప్రభుత్వ నియంత్రణ వదులు కోవడం అనేది వాస్తవ పరిస్థితుల్లో కనిపించదు. గతంలో లాగా చమురు ధరల నియంత్రణను కేంద్రం అంతర్జాతీయ మార్కెట్‌కు చాలా కాలం క్రితమే అనుసంధానం చేయగా వాస్తవంలో మాత్రం దీనికి భిన్నంగా వుండడం ఒక్క భారత్‌లోనే చెల్లుబాటు అవుతుందని చెప్పాలి. ప్రపంచ వ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరిగినపుడు ఆ భారాన్ని వినియోగదారులు పంచుకుంటున్నారు. అ యితే ధరలు పతనమైన సందర్భాలలో వినియోగదారులకు ఎలాంటి ప్రమోజనం కలగడం లేదు. దీనికి అసలు కారణం ఏమిటంటే కేంద్ర, రా ష్ట్ర ప్రభుత్వాలు హఠాత్తుగా పలురకాల సుంకాలు విధించి వినియోగదారులకు ప్రయోజనం లేకుండా చేస్తున్నాయి. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలకు అదనంగా ఆదాయం అందుతున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినపుడు భారత్‌లో ధరలు తగ్గిన సందర్భాలు వేళ్లమీద లెక్కించవచ్చు. ఒకవేళ తగ్గిన పది పైసల నుంచి పావులా వరకే అని చెప్పాలి. అనేకసార్లు అవే ధరలను కొనసాగిస్తారు. కరోనా సమయ ంలో 2020 ఫిబ్రవరి నెలలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా తగ్గినా భారత్‌లో దాని ప్రభావం వాహనదారులకు నయాపైసా కూడా అందలేదంటే కేంద్రం సహా రాష్ట్రాలు పన్నులను ఎంతగా వసూలు చేశాయో అర్థం చేసుకోవచ్చు. గతంలో చమురు ధరలను కేంద్రం పూర్తిగా నియంత్రించేది. ఏడాదికి ఒక సారి లేదా రెండుసార్లు ధరలను పెంచడం జరిగేది. కిరోసిన్‌తో పాటు ఎల్‌పిజి కూడా సర్కారు నియంత్ర ణలోనే వుండేవి. 2002లో తొలిసారిగా విమానాలకు వినియోగించే ఇంధనంపై నియంత్రణను కేంద్రం వదులుకుంది. ఆ తరువాత 2010లో పెట్రోల్‌పై 2014లో డీజిల్‌పై నియంత్రణను వదులుకుంది. కిరోసిన్, ఎల్‌పిజి నియంత్రణను మాత్రం కేంద్రం తన ఆధీనంలోనే వుంచుకుంది. పెట్రల్, డీజిల్ ధరలపై నియంత్రణను కేంద్రం వదులుకున్నా దాని ప్రభావం వాహనదారులకు లేక పోవడం గమనార్హం. 2022 అక్టోబర్ నెల లో భారత్‌లో పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదల భారీగా వుండడం తెలిసిందే. ఇప్పుడు తాజాగా మరోదఫా ఆ స్థాయిలో పెరుగుదల వుండడం గమనార్హం. ఈసారి రెండు వారాల్లో ఎనిమిది రూపాయలకు పైగా ధరలు పెరగగా ఇది 25 రూపాయలను దాటనుందని వార్తలు వ స్తున్నాయి.

**ధరలు ఎందుకు తగ్గడం లేదంటే...?**

ఇక భారత్‌లో చమరు ధరలు తగ్గక పోవడం వెనుక సవాలక్ష కారణాలు వున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల ఒక కారణంగా చూపుతున్నారు. దీంతో పాటు గల్ఫ్ సంక్షోభం, ఇరాన్‌పై అమెరికా దాడి, హర్మూజ్ జల సంధి మూసివేత వంటి కారణాలు తాజా పెరుగుదలకు కారణంగా వున్నాయి. ఇరాన్‌పై అమెరికా దాడి కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్‌ఆయిల్ ధర 91డాలర్లను దాటగా బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు 98 డాలర్లను దాటింది. అయితే గతంలో ఈ ధరలు వంద డాలర్లను దాటిన ఘటనలు వున్నాయి. ఆ సమయంలో భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు ఇంతలా పెరగక పోవడం గమనార్హం. కరోనా సమయంలో 2020మార్చిలో ముడి చమురుధర 35 డాలర్లకు పడిపోయింది. మార్చి చివరినాటికి ఇది ఇదివరకెన్నడూ లేనంతగా 20 డాలర్ల కనిష్టస్థాయికి పడిపోయింది. అయితే అంతర్జాతీ య మార్కెట్లో ముడిచమురు ధరలు అతి తక్కు వగా వున్న 82 రోజుల సమయంలో భారత్‌లో వినియోగదారుడికి ఎలాంటి లాభం చేకూరలేదు. ఇదే సమయంలో కేంద్రం తన పన్నుల వాటాను పెంచుకునేందుకు ఎక్సైజ్ డ్యూటీని రెండుసార్లు పెంచింది.

## పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు ఇరు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే: కూనంనేని సాంబశివరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేయడం ప్రజా ద్రోహమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ పరిపక్వత లేని వ్యాఖ్యలు తెలుగు ప్రజల మధ్య అనవసర ఉద్రిక్తతలు సృష్టించేలా ఉన్నాయని, తెలంగాణ అవతరణ దినోత్సవం రోజునే వచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం వెనుక దాగి ఉన్న అజెండా ఏమిటో ప్రజలకు చెప్పాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహాతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఆంధ్ర ప్రజలు అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని కమ్యూనిస్టులు కోరుకుంటున్నారని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎవరో వ్యక్తిగతంగా చేసిన వ్యాఖ్యలను పెద్దదిగా చేసి, రాష్ట్రాల మధ్య వివాదంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. రాజకీయాలు చేయడం ఎవరికైనా హక్కు ఉంటుందని, ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం మాత్రం సమర్థనీయం కాదని, రెండు రాష్ట్రాల ప్రజల మధ్య ఉన్న సోదరభావాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ప్రజల సమస్యలు ఉన్నంత కాలం కమ్యూనిస్టు భావజాలం సజీవంగానే ఉంటుంది ःపవన్ కళ్యాణ్ కమ్యూనిజం చచ్చిపోయిందంటూ వ్యాఖ్యానించడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయ ప్రవేశం సందర్భంగా పవన్ చేగువేరా బొమ్మతో రావడం జరిగిందన్నారు. ప్రజల సమస్యలు ఉన్నంతకాలం కమ్యూనిస్టు భావజాలం సజీవంగానే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల బాధలకు స్పందించి ప్రశ్నించే ప్రతి మనిషిలో కమ్యూనిస్టు ఆలోచన ఉంటుందని, దానిని ఎవరూ అంతం చేయలేరని వ్యాఖ్యానించారు. గతంలో కమ్యూనిస్టు భావజాలం గురించి మాట్లాడిన పవన్ కళ్యాణ్ ఎర్ర కండువా వేసుకున్న వ్యక్తి ఇప్పుడు కమ్యూనిస్టులనే లక్ష్యంగా చేసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలతో పొత్తులు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. గద్దర్‌కు తానే కారు ఇచ్చానంటూ పవన్‌కళ్యాణ్ ప్రచారం చేసుకోవడంసరికాదని, ప్రజల ప్రేమాభిమానాలే గద్దర్‌ను నిలబెట్టాయని వ్యాఖ్యానించారు. ఒక చేత్తో చేసిన సహాయాన్ని మరో చేతికి తెలియకుండా చేయాలనే సంస్కారం ఉండాలని సూచించారు. దివంగత గద్దర్ కుమార్తె వెన్నెల ఈ విషయాన్ని ఖండించడం కూడా జరిగిందన్నారు.

## జనసేన పార్టీలో చేరిన పబ్లిక్ హెల్త్ మాజీ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** తెలంగాణ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మాజీ డైరెక్టర్, డాక్టర్ గడల శ్రీనివాసరావు జనసేన పార్టీలో చేరారు. బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో గడల శ్రీనివాసరావుకు పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, డాక్టర్ గడల శ్రీనివాసరావు కుటుంబంతో తమ కుటుంబానికి ఎంతో కాలంగా సన్నిహిత అనుబంధం ఉందన్నారు. ప్రజాసేవ పట్ల అంకితభావం, నిజాయతీ, పరిపాలనా దక్షత కలిగిన అధికారిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు ప్రజల్లో విశేష గౌరవం సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యుడిగా ప్రారంభమైన ఆయన సేవా ప్రస్థానం ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ స్థాయికి చేరుకోవడం ఆయన కృషి, నిబద్ధతకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. డాక్టర్ గడల శ్రీనివాసరావు వంటి అనుభవజ్ఞులు, సేవాభావం కలిగిన వ్యక్తులు జనసేనలో చేరడం పార్టీకి మరింత బలాన్ని, విశ్వసనీయతను తీసుకువస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలపై అవగాహన, పరిపాలనా అనుభవం, సమాజంలోని వివిధ వర్గాలతో ఆయనకు ఉన్న అనుబంధం తెలంగాణలో పార్టీ విస్తరణకు దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజ సేవను లక్ష్యంగా పెట్టుకుని రాజకీయాల్లోకి వస్తున్న డాక్టర్ గడల శ్రీనివాసరావును హృదయపూర్వకంగా జనసేన కుటుంబంలోకి ఆహ్వానిస్తూ, తెలంగాణలో పార్టీ బలోపేతానికి ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్‌తో తన అనుబంధం మెగాస్టార్ చిరంజీవి ద్వారా ప్రారంభమైందని తెలిపారు. కాలక్రమేణా పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వం, నిజాయతీ, ప్రజా సమస్యల పట్ల ఆయనకున్న నిబద్ధత తనను ప్రభావితం చేశాయని పేర్కొన్నారు. తాను జనసేనలో చేరడం భావోద్వేగపూరిత నిర్ణయం కాదని, సమాజానికి మరింత విస్తృత స్థాయిలో సేవ చేయాలనే సంకల్పంతో తీసుకున్న ఆలోచిత నిర్ణయమని స్పష్టం చేశారు. యువతకు ఆశయాలను, దిశానిర్దేశాన్ని అందించే నాయకత్వం పవన్ కళ్యాణ్‌లో కనిపించిందన్నారు.

## బీసీ గురుకులాల్లో 6,7,8,9 తరగతుల బ్యాక్‌లాగ్ రెండవ దశ సీట్ల జాబితా విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ గురుకుల విద్యాసంస్థల్లో 6,7,8,9 తరగతుల బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల రెండో జాబితా బుధవారం విడుదల చేశామని సొసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ గురుకుల పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ సీట్లు కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ ఫలితాలను సొసైటీ అధికారిక వెబ్ సైట్‌లో పరిశీలించవచ్చు అని ఆయన పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు సంబంధిత గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఫోన్ ద్వారా సమాచారం అందిస్తారని, విద్యార్థులు ఏ తేదీన పాఠశాలకు హాజరు కావాలి అన్న వివరాలు తెలియ చేస్తారని పేర్కొన్నారు. మెరిట్ లిస్ట్‌లో ఎంపికైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. సీట్ల కేటాయింపు, భర్తీ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది అని ఆయన తెలిపారు. బీసీ గురుకుల ఇంటర్ కోర్సుల్లో ఫస్ట్ లిస్ట్ లో సీట్లు వచ్చిన విద్యార్థులు ఈనెల 4వ తేదీ లోగా సంబంధిత కాలేజీలో రిపోర్ట్ చేయాలని డాక్టర్ మల్లయ్య భట్టు తెలిపారు.

## కాంగ్రెస్ చేతల పార్టీ.. బిఆర్ఎస్ చేతకాని పార్టీ: మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** కాంగ్రెస్ చేతల పార్టీ, బిఆర్ఎస్ చేతకాని పార్టీ అని, తాను చేసిన సవాల్‌ను కెటిఆర్‌కు స్వీకరించే దమ్ములేదని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి, పార్లమెంట్ ఎన్నికల్లో సున్నాకు పడిపోయి సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికల్లోనూ చిత్తుచిత్తుగా బిఆర్ఎస్ ఓడిపోవడం వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌పార్టీదే అధికారం అని స్పష్టత రావడంతో డ్రామా రావుకు ఫ్రస్టేషన్‌పెరిగిపోయిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ట్వీట్ (ఎక్స్ వేదికగా) పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై తాను చేసిన సవాల్ గురించి జర్నలిస్టులు కెటిఆర్‌ను ప్రశ్న అడిగితే దానిపై సమాధానం చెప్పలేదని, తాను చేసిన సవాల్‌ను స్వీకరించే దమ్ము కెటిఆర్‌కు లేదని మంత్రి పొంగులేటి ఆరోపించారు. 'మూసుకొని ఇంట్లో కూర్చో' అంటూ దొరతనం, అహంకారంతో మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి అన్నారు. రెండున్నర సంవత్సరాల్లోనే సిఎం నాయకత్వంలో అతి తక్కువ సమయంలోనే లక్షలాది మంది పేదవారికి ఇళ్లు అందించామని మంత్రి తెలిపారు.

## ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్ రూపొందించండి

**పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ఎస్టీయూటీఎస్ వినతి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయ సర్వీస్ రూల్స్ రూపొందించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్‌ను ఎస్టీయూటిఎస్ కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధానకార్యదర్శి జుట్టు గజేందర్ ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు సంబంధించి ఉమ్మడి సర్వీస్ రూల్స్ లేకపోవడం వల్ల రాష్ట్రంలో వందలాది ఎంఈవో, డిప్యూటీ ఈవో, డీఈవో, డైట్ లెక్చరర్ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. దీనివల్ల పాఠశాలల పర్యవేక్షణ వ్యవస్థ దెబ్బతింటోందనిఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వులు-2018 ప్రకారం ఎటువంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా సర్వీస్ రూల్స్ రూపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఉపాధ్యాయ, విద్యారంగ పరిపాలనా వ్యవహారాలు సక్రమంగా నిర్వహించేందుకు ఉమ్మడి సర్వీస్ రూల్స్ అత్యంత అవసరమని ఎస్టీయూటీఎస్ అభిప్రాయపడింది.

## ఓటర్లు అసౌకర్యానికి గురికాకుండా చూడాలి అసదుద్దీన్ ఒవైసీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** ఎస్ఐఆర్ పురోగతిపై పార్టీ ఎమ్మెల్యేలతో మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ సమీక్షించారు. ఎస్ఐఆర్‌పై క్షేత్రస్థాయిలో సవాళ్లు, ప్రజల ఇబ్బందులపై చర్చించారు. ఎస్ఐఆర్ వేళ అర్హులైన ఓటర్లు అసౌకర్యానికి గురికాకుండా చూడాలని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూడాలని అసదుద్దీన్ పార్టీ నేతలకు సూచించారు. పౌరుల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు మజ్లిస్ కట్టుబడి ఉందని అసదుద్దీన్ తెలిపారు.

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం: జాన్‌వెస్లీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్3:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కమ్యూనిజంపై, ప్రజా పోరాటాలపై చేసిన వ్యాఖ్యలను సిపిఎంతెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి జాన్ వెస్లీ తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రాంతీయ విద్వేషాలను, భాషా విభేదాలను రెచ్చగొట్టేలా, పీడిత ప్రజల వర్గ పోరాటాలను అవమానించేలా మాట్లాడటం ఒక బాధ్య తాయుతమైన పదవిలో ఉన్నవ్యక్తికి తగదన్నారు. తనపై వచ్చిన 10 ఎకరాల చెరువు భూమి ఆక్రమణ ఆరోపణలపై వివరణ ఇచ్చుకోవడానికి లేదా ఇతర ప్రజాసమస్యలపై మాట్లాడటానికి పవన్‌కు పూర్తి హక్కు ఉంది. కానీ సిపిఎం పార్టీ తెలంగాణను వ్యతిరేకించిందంటూ బురదజల్లడం ఆరోపణలపై దృష్టి మళ్లించడమేనన్నారు.

# నార్వే చెస్‌లో ప్రజ్ఞానంద గెలుపు

## దివ్య, గుకేష్ ఓటమి



**న్యూఢిల్లీ:** నార్వే చెస్ 2026 యొక్క ఎనిమిదవ రౌండ్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రమేష్‌బాబు మరోసారి మాగ్నస్ కార్ల్‌సెన్‌ను ఓడించి, టైటిల్ రేసుకు మరో ముఖ్యమైన ఫలితాన్ని సాధించాడు. గత వారం తెల్ల పావులతో కార్ల్‌సెన్‌ను ఓడించిన ఈ 20 ఏళ్ల ఆటగాడు, 8వ రౌండ్‌లో నల్ల పావులతో తన విజయాన్ని పునరావృతం చేసి, అదే టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ 1 ఆటగాడిపై తన రెండవ క్లాసికల్ విజయాన్ని నమోదు చేశాడు. అలాగే ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజుపై అలీరెజా ఫిరౌజ్జా విజయాన్ని సాధించాడు. తెల్ల పావులతో ఆడుతూ, ఉత్కంఠభరితమైన ఎండ్‌గేమ్‌లో ఫిరౌజ్జా కీలకమైన విజయాన్ని దక్కించుకున్నాడు. ఇక నార్వే చెస్ మహిళల 8వ రౌండ్‌లో రెండు నిర్ణయాత్మక క్లాసికల్ గేమ్‌లు, ఒక ఆర్మాగెడాన్ టైబ్రేకర్ జరిగాయి, ఇందులో బిబిసారా అసౌబాయేవా తన ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. దివ్య దేశ్‌ముఖ్‌పై అసౌబాయేవా ఒక ముఖ్యమైన క్లాసికల్ విజయాన్ని సాధించింది. నల్ల పావులతో ఆడుతూ, ఆమె ఒత్తిడిని తట్టుకుని, దివ్యకు సమయం తక్కువగా ఉన్నప్పుడు ఆధిక్యాన్ని సంపాదించి, చివరికి పూర్తి పాయింట్‌ను కైవసం చేసుకుంది. అన్నా ముజిచుక్ మరియు హంపీ కోనేరుల ఆట క్లాసికల్ డ్రాగా ముగిసింది. ఆర్మాగెడాన్ టైబ్రేక్ కూడా హోరాహోరీగా సాగింది, కానీ చివరకు హంపీ కోనేరు నల్ల పావులతో గెలిచి, అదనపు పాయింట్లను సంపాదించారు.

# సెమీస్‌కు భారత్ హాకీ మహిళా జట్టు

## 25-0 తో సింగపూర్ చిత్తు



**న్యూఢిల్లీ:** హాకీ అండర్18 ఆసియా కప్‌లోని పూల్ ఎ చివరి గేమ్‌లో భారత మహిళల జట్టు సింగపూర్‌ను 25-0 తేడాతో చిత్తుగా ఓడించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో నౌషిన్ నాజ్ ఏడు గోల్స్ (8, 13, 17, 18, 40, 52, 58) చేసి అగ్రస్థానంలో నిలిచింది. గీతాశ్రీ నమ్మి ఐదు గోల్స్ (13, 28, 47, 48, 60) సాధించగా, కెప్టెన్ స్వీటీ కుజుర్ నాలుగు గోల్స్ (2, 24, 38, 45) జోడించింది. ప్రియాంక మింజ్ హ్యాట్రిక్ (22, 37, 53), దియా (27), నాన్సీ సరోహా (36), శ్రుతి కుమారి (40), పుష్పా మాంఝీ (47), రష్మీన్ కౌర్ (47), సందీప్ కుమారి (47) సందీప్ కుమారి 5 గోల్స్ చేశారు. ఆట ఆరంభంలోనే భారత్ దూకుడును ప్రదర్శించింది. రెండవ నిమిషంలో కెప్టెన్ స్వీటీ గోల్ చేసింది. ఆ తర్వాత ఎనిమిదవ నిమిషంలో నౌషీన్ ఆధిక్యాన్ని పెంచగా, గీతాశ్రీ, నౌషీన్ ఇద్దరూ (13) స్కోరును సమం చేసి, భారత్ ఆధిపత్యాన్ని నెలకొల్పారు. రెండవ క్వార్టర్‌లో నౌషీన్ 2 గోల్స్ చేయడంతో భారత తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఆ తర్వాత ప్రియాంక, స్వీటీ భారత్ ఆధిక్యాన్ని పెంచడంలో సహాయపడ్డారు. మూడో క్వార్టర్ ఆరంభంలోనే దియా, గీతాశ్రీ గోల్స్ చేయగా, నాన్సీ, ప్రియాంక, స్వీటీ, నౌషీన్, శృతి గోల్స్ సాధించడంతో భారత్ సింగపూర్ రక్షణ శ్రేణిని ఛిన్నాభిన్నం చేసింది. ఆఖరి క్వార్టర్‌లో కూడా భారత్ అదే తీవ్రతను కొనసాగించి, అదనంగా 10 గోల్స్ సాధించింది. స్వీటీ తన 4 గోల్స్, గీతాశ్రీ మరో 3 గోల్స్‌తో మొత్తం 5 గోల్స్ సాధించింది. అలాగే, నౌషీన్ 7 గోల్స్‌తో అద్భుతమైన ప్రదర్శనచేసింది. పుష్ప, రష్మీన్, సందీప, ప్రియాంక కూడా గోల్స్ సాధించారు.

# బరిలో సిరాజ్, తిలక్ వర్మ

## 7న టిజి 20 ప్లేయర్ల వేలం

### 21నుంచి ఉప్పల్ వేదికగా మ్యాచ్‌లు

**హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త:** తెలంగాణ క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరలేస్తూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ ప్లేయర్ల వేలానికి సర్వం సిద్ధమైంది. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఫ్రాంచైజీ ఆధారిత పద్ధతిలో జరగనున్న ఈ లీగ్ ప్రారంభ ఎడిషన్ వేలం పాటను ఆదివారం రామోజీఫిల్మ్ సిటీలోని ప్రిన్సెస్ కన్వెన్షన్ సెంటర్లోనిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు తలపడనుండగా.. 21 రోజుల పాటు ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మొత్తం 32 మ్యాచ్‌లు జరగనున్నాయి. 1,300 మంది ఆటగాళ్లు.. వేలంలో స్టార్లు హెచ్‌సీఏలో రిజిస్టర్ అయిన 1,300 మందికి పైగా క్రికెటర్లు ఈ వేలంలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. భారత క్రికెట్ జట్టు స్టార్ ఆటగాళ్లు మహ్మద్ సిరాజ్, తిలక్ వర్మల ఈ వేలంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. వీరితో పాటు రోహిత్ రాయుడు, రాహుల్ బుద్ధి, సి.వి. మిలింద్, తన్మయ్ అగర్వాల్ వంటి సీనియర్ దేశవాళీ ప్లేయర్లు ఫ్రాంచైజీల హాట్ కేక్‌లుగా మారే అవకాశం ఉంది. అండర్-19ప్రపంచ కప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆరోన్ జార్జ్, ఇటీవల వినూ మన్కడ్ ట్రోఫీ గెలిచిన హైదరాబాద్ యువ జట్టు సభ్యులు కూడా వేలం పూల్‌లో ఉన్నారు. బరిలో మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు పాల్గొననుండగా.. 1.హైదరాబాద్ ఈఛాంపియన్స్ 2.ప్రణవ రంగారెడ్డి రైజర్స్ 3.వరంగల్ వారియర్స్ 4.మెదక్ ఫాల్కన్స్ 5.అనురాగ్ నల్గొండ నైట్స్ 6.కరీంనగర్ డైమండ్స్ 7.పాలమూరు స్ట్రైకర్స్ 8.అన్విత ఖమ్మం ఏసెస్ ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో.. ప్రతి ఫ్రాంచైజీ తమ 20 మంది సభ్యుల జట్టులో కనీసం నలుగురు జిల్లా ఆటగాళ్లను చేర్చుకోవాలి. అలాగే తుది జట్టులో కనీసం ఇద్దరు జిల్లా ప్లేయర్లు ఆడటం తప్పనిసరి. టీమిండియా మాజీ ఆటగాడు, హెచ్‌సీఏ క్రికెట్ ఆపరేషన్స్ కమిటీ చైర్మన్ అంబటి రాయుడు నేతృత్వంలోని బృందం నిర్వహించిన ఓపెన్ ట్రయల్స్ ద్వారా ఈ యువ ప్రతిభను వేలం వరకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. ఈ మెగా లీగ్ మ్యాచ్‌లు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. అన్ని మ్యాచులు ఉప్పల్ స్టేడియంలో జరుగుతాయి.




# అత్యంత క్లిష్టంగా టీమిండియా ఫైనల్

## వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో 7 మ్యాచ్‌లు తప్పక గెలవాల్సిందే

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ చేరాలనే భారత క్రికెట్ జట్టు కల ఇప్పుడు అత్యంత క్లిష్టమైన దశకు చేరుకుంది. ప్రస్తుత పాయింట్ల పట్టిక సమీకరణాల ప్రకారం టీమ్ ఇండియా కేవలం అద్భుత విజయాలు సాధించడమే కాకుండా, ప్రత్యర్థి జట్ల ఓటములపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాయింట్ల పట్టికలో ప్రస్తుతం భారత జట్టు పరిస్థితి అంత ఆశాజనకంగా ఏమీ లేదు. కేవలం 48.15 శాతం పాయింట్లతో టీమ్ ఇండియా ప్రస్తుతం ఆరో స్థానంలో కొట్టుమిట్టాడుతోంది. ఇంగ్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్ జట్ల కంటే మాత్రమే భారత్ ముందుంది. ప్రతిష్టాత్మక ఫైనల్ పోరుకు అర్హత సాధించాలంటే, భారత్ తన ముగింపు దశలో ఆడబోయే 9 టెస్ట్ మ్యాచ్‌లలో కనీసం 7 మ్యాచ్‌ల్లో ఖచ్చితంగా విజయం సాధించాల్సి ఉంటుంది. ఇందులో ఏ ఒక్క మ్యాచ్ చేజారినా ఫైనల్ ఆశలు దాదాపు గల్లంతైనట్లే. భారత జట్టు రాబోయే రోజుల్లో మూడు ప్రధాన సవాళ్లను ఎదుర్కోవలసి ఉంది. ముందుగా టీమ్ ఇండియా శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది, అక్కడ రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడాల్సి ఉంది. ఆ వెంటనే న్యూజిలాండ్ గడ్డపై మరో రెండు టెస్టుల కఠినమైన సవాలు ఎదురుకానుంది. ఈ రెండు విదేశీ పర్యటనలు ముగిసిన తర్వాత, 2027 ప్రారంభంలో ఆస్ట్రేలియా జట్టు భారత పర్యటనకు రానుంది. భారత్ వేదికగా ఇరు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ జరగనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే క్రమంలో దాదాపు 64 నుంచి 68 శాతం పాయింట్లను సొంతం చేసుకోవాలంటే ఈ సిరీస్ భారత్‌కు జీవన్మరణ సమస్యగా మారనుంది. టీమ్ ఇండియా కేవలం తన మ్యాచ్‌లలో గెలిస్తేనే సరిపోదు. పాయింట్ల పట్టికలో మొదటి వరుసలో ఉన్న శ్రీలంక, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్ల పరాజయాలపై కూడా మన అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

# భారత్‌కు ఘోర పరాజయం!

## 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ గెలుపు




**న్యూఢిల్లీ:** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 ముందు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టుకు ఘోర పరాజయం ఎదురైంది. నేడు జరిగిన మూడో టీ20లో సమష్టిగా రాణించిన ఇంగ్లండ్ 6 వికెట్ల తేడాతో టీమిండియాను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(40 బంతుల్లో 7 ఫోర్లతో 56 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా, యస్తిక భాటియా(32), దీప్తి శర్మ(32), జెమీమా రోడ్రిగ్స్(29) పర్వాలేదనిపించారు. ఓపెనర్లు స్మృతి మంధాన(8), షెఫాలీ వర్మ(11) తీవ్రంగా నిరాశపర్చారు. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్ 2 వికెట్లు తీయగా, స్మిత్, చార్లీ డెన్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం ఇంగ్లండ్ 18.3 ఓవర్లలోనే 4 వికెట్లకు 184 పరుగులు చేసి గెలుపొందింది. అలిస్ క్యాప్సే(43 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 82), హీథర్ నైట్(42 బంతుల్లో 10 ఫోర్లతో 70 నాటౌట్) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్ రెండేసి వికెట్లు తీసారు. ఈ నెల 12 నుంచి ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుండగా, భారత్ తమ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో ఈ నెల 14న ఆడనుంది. టీ20 ప్రపంచకప్ ముందు ఇంగ్లండ్‌తో జూన్ 10న వార్మప్ మ్యాచ్ ఆడనుంది.

# ఆస్ట్రేలియాపై పాకిస్థాన్ ఓటమి

**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై పాకిస్థాన్‌కు పరాభవం ఎదురైంది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా లాహోర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో సమష్టిగా విఫలమైన పాకిస్థాన్ 41 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దాంతో మూడు వన్డేల సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 231 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లీస్ (51), కామెరూన్ గ్రీన్ (53) హాఫ్ సెంచరీలతో రాణించగా, మ్యాట్ రేన్‌షా (43) పర్వాలేదనిపించాడు. పాకిస్థాన్ బౌలర్లలో షాహీన్ షా అఫ్రిది 3 వికెట్లు తీయగా, హారిస్ రౌఫ్, మిన్‌హాస్, అబ్రార్ అహ్మద్, రెండేసి వికెట్లు పడగొట్టారు. ఇక 232 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 44 ఓవర్లలో 190 పరుగులకు కుప్పకూలింది. షాదాబ్ ఖాన్ (71) అరఫత్ మిన్హాస్ (33), ఘాజి ఘోరి (37) పోరాడినా ఫలితం లేకపోయింది. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ (4/33), మాథ్యూ షార్ట్ (3/36) పాక్ పతనాన్ని శాసించగా, మాథ్యూ కుహ్నెమన్, ఆడమ్ జంపా, తన్వీ సంగా తలో వికెట్ తీసారు. టాప్3 బ్యాటర్లు షాహిబ్‌జాద ఫర్హాన్(3), మాజ్ సదాకత్(0), బాబర్ ఆజామ్(16) తీవ్రంగా నిరాశపర్చారు. సల్మాన్ అఘా(7), అబ్దుల్ సమద్(2) వరుసగా పెవిలియన్ చేరడంతో పాక్ 58 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఆ కాసేపటికే ఘాజీ ఘోరి కూడా ఔటవ్వడంతో ఆ జట్టు కష్టాలు రెట్టింపు అయ్యాయి. కెప్టెన్ షాహీన్ షా అఫ్రిది(0), హారిస్ రౌఫ్, అబ్రార్ అహ్మద్(0) విఫలమవడంతో పాకిస్థాన్ 190 పరుగులకే పరిమితమైంది.

# నష్టాలబాటలో సెన్సెక్స్, నిఫ్టీ

## మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే ఎఫెక్ట్



**ముంబయి, జూన్ 3:** దేశీయ ఈక్విటీ మార్కెట్‌సూచీలు మరోసారి నష్టాలబారిన పడ్డాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 303.67 పాయింట్లు క్షీణించి 74,346.17 పాయింట్లకు చేరగా నిఫ్టీ 50 సూచీ 77.95 పాయింట్లు నష్టపోయి 23,405.60 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. ఐటిఎఫ్‌ఎంసిజి స్టాక్స్ నీరసించడంతో నష్టాలు తప్పలేదు. టిసిఎస్ 8.39శాతం, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 5.19, ఇన్ఫోసిస్ 3.79శాతం చొప్పున నష్టపోయాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.50 నష్టపోగా స్మాల్‌క్యాప్ సూచీ 0.01శాతం స్వల్పలాభం నమోదుచేసింది. మార్కెట్లపరంగా ప్రతికూలంగానే ఉంది. బిఎస్‌ఇలో 1573 షేర్లుపెరిగితే 2732 షేర్లు పతనం చెందాయి. 217 షేర్లు స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 95.68 వద్ద నమోదుకాగా ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్‌ఐదు సెటిల్‌మెంట్‌ధరలు 0.93శాతం క్షీణించి రూ.1,54,100గా నడిచింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఆగస్టు నెల సెటిల్‌మెంట్‌ధరలు 2.35 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 98.35 డాలర్లుగా కొనసాగింది. యూరోపియన్‌షేర్లు దిగువస్థాయిలోనే ముగిసాయి. అమెరికా 60 దేశాలపై విధించతలపెట్టిన సుంకాలకు ప్రతికూలంగా మార్కెట్లు కొనసాగాయి. ఆసియా సూచీలు బుధవారం ఎగువకు నమోదయ్యాయి. వాల్‌స్ట్రీట్ షేర్లు రాత్రికిరాత్రే రికార్డుగరిష్టాలను నమోదుచేసాయి. ఎస్అండ్‌పి 500 0.13శాతంపెరిగితే డౌజోన్స్ పారిశ్రామిక సగటు 228.91 పాయింట్లు లాభపడింది. ఇక నాస్‌డాక్ కాంపోజిట్ కూడా 0.03శాతం పెరిగినట్లు తేలింది. ఇక దేశీయ మార్కెట్ల పరంగాచూస్తే ఇండస్ ఇండ్‌బ్యాంకు 1.38శాతం క్షీణించింది. టిసిఎస్ కూడా 8.39శాతం దిగజారింది. జాన్ కాక్‌ఎరిల్ ఇండియా 20శాతంపెరిగింది. వార్రాక్ ఇంజినీరింగ్ 3.36శాతం, ఎన్ఎండిసి 0.77శాతంచొప్పున పెరిగాయి. కాంకార్డ్ బయోటెక్ 3.03శాతంపెరిగితే జైడస్ లైఫ్‌సైన్సెస్ 0.16శాతం దిగజారింది. ఇక డైమండ్ పవర్ ఇన్‌ఫ్రా 3.07శాతం, మార్సన్స్ 7.32శాతం, కపాసైట్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ 0.65శాతం, ఆర్ఐఆర్ పవర్ ఎలక్ట్రానిక్స్ 0.46శాతం క్షీణించాయి.

# 59.8 పాయింట్లకు పెరిగిన సేవలరంగ పిఎంఐ సూచీ




**న్యూఢిల్లీ,జూన్ 3:** భారత్‌సేవలరంగ పిఎంఐ సూచీ మేనెలలో స్వల్పంగా పెరిగింది ఏప్రిల్‌లో 58.8పాయింట్లుకు రాగా మేనెలలో 59.8 పాయింట్లకు పెరిగింది. భారత్‌లోసేవలరంగ పిఎంఐ కేవలం బిజినెస్ కార్యకలాపాలు విస్తరణవల్లనే పెరిగిందని అంచనా. మొత్తం 400 సేవలరంగ కంపెనీల స్పందనను క్రోడీకరించి పిఎంఐ సూచీని రూపొందించినట్లు నిపుణులు వెల్లడించారు. 50 పాయింట్లకుపైన ఉంటే పెరుగుతున్నట్లు దిగువకు వెళితే క్షీణించినట్లు పరిగణిస్తారు. రవాణారంగం, సమాచార వ్యవస్థ, ఇన్‌ఫర్మేషన్, ఫైనాన్స్, బీమా, రియల్‌ఎస్టేట్ ఇతర బిజినెస్ సేవల కంపెనీలనుంచి గణాంకాలను సేకరించి సర్వేచేసింది. ఎస్అండ్‌పి గ్లోబల్ పరంగాచూస్తే రవాణా, డిజిటల్‌పరిష్కారాలు, ఈకామర్స్, వినోదరంగం, ఐటి వంటిరంగాలు పిఎంఐకు మద్దతుగా ఉన్నాయి. పేరోల్స్ గణాంకాలపైనా సానుకూల స్పందన లభించింది. ఉపాధి సృష్టిపరంగాచూస్తే ఏడాదిలోనే స్వల్పంగా మెరుగుపడినట్లు అంచనావేసింది. ప్యానలిస్టుల్లో ఏడుశాతం మంది నియామకాలు పెరుగుతాయని, కంపెనీల ఉద్యోగులసంఖ్య గణనీయంగా పెరగవచ్చని తెలిపారు. సేవలరంగంలో రికవరీ కనిపిస్తే ఉత్పత్తిరంగంపై ప్రభావం పడుతుంది. 54.7నుంచి మేనెలలో 55శాతానికి ఉత్పత్తిరంగ పిఎంఐ నమోదుకావడం గమనార్హం. హెచ్‌ఎస్‌బిసి ఇండియా కాంపోజిట్ పిఎంఐ ఉత్పత్తిసూచీ, సర్వీసెస్ బిజినెస్ కార్యకలాపాల సూచీలు ఆరునెలల గరిష్టానికి నమోదయ్యాయి. 58.2నుంచి 59.3పాయింట్లకు పెరిగినట్లు ప్యానల్ నిపుణులు తెలిపారు. కొత్త ఆర్డర్లు రావడం భారత సేవలరంగ సంస్థలకు ఊతం ఇచ్చింది.

# గిటార్‌విజ్ యాప్‌కు యాపిల్ డిజైన్ అవార్డు




**న్యూఢిల్లీ, జూన్ 3:** టెక్ దిగ్గజం యాపిల్ నుంచి భారతీయ యాప్‌కు అరుదైన గౌరవం లభించింది. ఇండియాకు చెందిన గిటార్ విజ్ యాప్, 2026 సంవత్సరానికి గాను ప్రతిష్మాత్మకమైన యాపిల్ డిజైన్ అవార్డును గెలుచుకుంది. విభిన్న సామర్థ్యాలు గల వినియోగదారులకు సంగీతాన్ని అందుబాటు లోకి తీసుకురావడంలో చేసిన కృషికి గాను ఇన్‌క్లూజివిటీ (సమ్మిళిత) కేటగిరీలో ఈ పురస్కారం దక్కింది. భారతీయ డెవలపర్ బిజోయ్ తంగరాజ్ ఈ అద్భుతమైన యాప్‌ను రూపొందించారు. గిటార్ నేర్చుకునే కొత్తవారికి, ఇప్పటికే అనుభవం ఉన్నవారికి ఒక సమగ్రమైన టూల్‌కిట్‌గా ఈ యాప్ ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా స్వరాలు, కార్డ్స్, వేళ్ల స్థానం వంటి అంశాలపై మాటల ద్వారా సూచనలు ఇవ్వడం దీని ప్రత్యేకత. దీనివల్ల సంగీతకారులు ఎలాంటి సహాయం లేకుండా స్వతంత్రంగా గిటార్ వాయించడం నేర్చుకోవచ్చు. విభిన్న నేపథ్యాలు, సామర్థ్యాలు, భాషలకు చెందిన ప్రతీ ఒక్కరికీ సంగీతాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతో దీనిని రూపొందించినట్లు యాపిల్ ప్రశంసించింది. ఈ యాప్‌లో ఆపిల్‌కు చెందిన డైనమిక్ టైప్, ఇంక్రీజ్డ్ కాంట్రాస్ట్, డిఫరెన్షియేట్ వితౌట్ కలర్ వంటి అనేక యాక్సెసిబిలిటీ ఫీచర్లను సమర్థవంతంగా వినియోగించుకున్నారు. ప్రతీ ఏటా యాపిల్ సంస్థ ఇన్నోవేషన్, సోషల్ ఇంపాక్ట్, విజువల్స్ వంటి పలు విభాగాల్లో అత్యుత్తమ యాప్స్, గేమ్స్‌కు ఈ డిజైన్ అవార్డులనుఅందిస్తుంటుంది. గతంలోనూ లూమీ, డెనిమ్,ఎవాల్వ్, మెడిటేట్‌వంటి భారతీయ యాప్‌లు ఈ అవార్డుల జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఇప్పుడు గిటార్ విజ్ సాధించిన ఈ విజయం, ప్రపంచ వేదికపై భారతీయ డెవలపర్ల నైపుణ్యానికి, సృజనాత్మకతకు లభిస్తున్న గుర్తింపునకు నిదర్శనంగా నిలిచింది.

# వెండి దిగుమతులపై మరింత కఠిన కార్యాచరణ

## పరిమితి దిగుమతుల కేటగిరీలోకి గుళికలు, పొడి



**ముంబయి,జూన్ 3:** వెండి దిగుమతులు రికార్డు స్థాయిలో పెరిగిపోవడంతో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. వెండి దిగుమతులపై ఆంక్షలను మరింత కఠినతరం చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు పరిమితులు లేని వెండి గుళికలు, పొడి రూపాలను కూడా పరిమిత దిగుమతుల కేటగిరీలోకి చేర్చింది. ఇకపై ఈ రకమైన వెండిని దిగుమతి చేసుకోవాలంటే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇటీవల భారీగా పెరిగిన వెండి దిగుమతి కేంద్రం కఠిన నిర్ణయం ప్రపంచంలోనే అత్యధికంగా వెండిని వినియోగించే దేశంగా ఉన్న భారత్, ఇటీవలి కాలంలో భారీగా వెండిని దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల రూపాయి విలువపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గత నెలలో 99.9 స్వచ్ఛత కలిగిన వెండి కడ్డీలు, ఇతర పాక్షికంగా తయారు చేసిన వెండి ఉత్పత్తుల దిగుమతిని కూడా పరిమిత కేటగిరీలో చేర్చిన విషయం తెలిసిందే. బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 6 నుంచి 15 కి పెంచింది. అధిక చమురు ధరల కారణంగా విదేశీ మారక నిల్వలపై పడుతున్న భారాన్ని తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గణాంకాలను పరిశీలిస్తే 2026 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారత్ రికార్డు స్థాయిలో 12 బిలియన్ డాలర్ల విలువైన వెండిని దిగుమతి చేసుకుంది. అంతకుముందు ఏడాది ఈ దిగుమతుల విలువ కేవలం 4.8 బిలియన్ డాలర్లు మాత్రమే. ఈ యేడాది ఏప్రిల్‌లోనూ వెండి దిగుమతులు గతేడాదితో పోలిస్తే 157 పెరిగి 411 మిలియన్ డాలర్లకు చేరాయి. ప్రభుత్వం వెండి దిగుమతులను మరింత కష్టతరం చేసింది. ఇప్పుడు దిగుమతిదారులకు ముందస్తు అనుమతి తప్పనిసరి. అయితే ఆ అనుమతి వస్తుందో రాదో, ఎంత సమయం పడుతుందో స్పష్టత లేదని ముంబైకి చెందిన ఓ బులియన్ డీలర్ వ్యాఖ్యానించారు. భారత్‌లో వెండిని ఆభరణాలు, నాణేలు, కడ్డీలతో పాటు సోలార్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ వంటి పారిశ్రామిక అవసరాలకు కూడా విరివిగా వాడతారు. గత ఏడాది కాలంగా సంప్రదాయ వినియోగం కంటే పెట్టుబడుల రూపంలో వెండికి డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా సిల్వర్ ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడులు రికార్డు స్థాయికి చేరాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.